# గెలుపంటే...

## 7 విజయానికి ఏడు సూత్రాలు

### మరెన్నో గెలుపు గాథలు



జాలాది రత్న సుధీర్

# గెలవాలంటే...

## విజయానికి ఏడు సూత్రాలు

డా. జాలాది రత్నసుధీర్

**గెలవాలంటే...**
**విజయానికి ఏడు సూత్రాలు**

**GELAVALANTE**
**Vijayaniki Edu Sutralu**

*by* JALADI RATNA SUDHEER

© జాలాది రత్న సుధీర్

ప్రతులకు : రూపా ప్రచురణలు
201, Saikrishna Towers
8-3-229/16/W
Hylem Colony, Venkatagiri
Hyderabad - 500 045
Cell : 98494 18009
jrsudheer18@gmail.com

ప్రథమ ముద్రణ : జూన్, 2020

వెల : 100/–

ప్రతులు : 500

డి.టి.పి. : మను గ్రాఫిక్స్
చిక్కడపల్లి, హైదరాబాద్
ఫోన్ : 93 93 83 40 50

ముద్రణ : సతీష్ గ్రాఫిక్స్
చిక్కడపల్లి, హైదరాబాద్
ఫోన్ : 96421 44422

# Acknoledgement

I express my deep gratitude to Dr.Rajan of I.A.T.D, Sekhar Chikkireddy and members of both the baches of I.A.T.D (2018 and 2019) for inspiring me to write this book.

I thank my family members Sudha, Sunny, Vani-Soumya, Vivek for their support. I thank my elder brother Emmanuel and Durki Mohanrao, V.V.N.Dileep for the sugestions.

The information for the inspirational stories are gathered from different sources viz news papers, periodicals and public domain (on-line). I express my thankfulnes to each one of them.

I thank Sri Kudupudi Bhaskar Rao (Manu Graphics) for D.T.P work and Satish Graphics for Printing.

# About the author

- ❖ A Post graduate in chemistry, graduate in law and doctorate in devinity.
- ❖ Worked as lecturer at Andhra Loyola College, Vijayawada.
- ❖ Wroked in the Government as
  - (i) Director of Works Accounts, Finance department, Govt. of Andhra Pradesh.
  - (ii) Director (Finance), Ministry of Water resources, Govt. of India
  - (iii) Managing Director, APCFC, Minorities Welfare dept. Govt. of Andhra Pradesh.

**HOBBIES:**

- (i) Lyric writer for a couple of movies
- (ii) Writer for ETV sponcered programme
- (iii) Author of Two Anthology of Poems (a) SPARSHA (b) PRAKSHALANA
- (iv) Author of book of Short stories (a) MANASU KATHALU (b) AMMA CHEKKINA SILPAM

**AS TRAINER:**

- (i) Master Diplomo from Indian Academy of training and development
- (ii) Licenced N.L.P. Practioner

# ఈ పుస్తకం....

ఎవరికోసం? జీవితంలో గెలవాలనుకునే ప్రతి యువకుని కోసం. చదువుకుంటున్న ప్రతి విద్యార్థి కోసం, చదువు మధ్యలో ఆపేసిన కుర్రాళ్లకోసం, చదువు పూర్తిచేసుకొని ఉద్యోగ వేటలో ఉన్న ఆశావాదులకోసం, ఏ ఉద్యోగం లభించడం లేదనే నిరాశలో ఉన్న నిరుద్యోగులకోసం, అమ్మానాన్నలకు ఆస్తిపాస్తులు లేని కుటుంబాల్లో యువకులకోసం, ఆస్తిని కాక స్వశక్తిని నమ్ముకున్న సుపుత్రులకోసం, సినిమాలు, షికార్లు, స్నేహితులతో కుషీగా కాలం గడిపేస్తూ కూడా అంతరాంతరాల్లో జీవితంలో ఏదైనా సాధించాలనే కసి ఉన్న యంగ్‌స్టర్స్ కోసం, 'లవ్'లో గెలిచి జీవితంలో కూడా గెలవాలనుకునే ప్రేమికులకోసం, లవ్‌లో ఓడి జీవితంలోనైనా గెలవాలనుకునే వారికోసం, భవిష్యత్తును నిర్మించుకోవాలనుకునే వారికోసం, జీవితాన్ని పునర్‌నిర్మించుకునే వారికోసం.. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది అక్షరజ్ఞానమున్న ప్రతి యువకుడికోసం... ప్రతి యువతికోసం....

ఇంతకీ ఈ పుస్తకంలో ఏముంది? విజ్ఞానం లేదు, వినోదం లేదు, విద్వత్తు లేదు, మేధస్సు అసలే లేదు. మరి! సాధారణమైన విషయాలే, అతిసాధారణ విషయాలు మనందరికి తెలిసినవే, మనకు ఉపయోగపడేవే, కానీ మనం ఆలోచించనివి, అశ్రద్ధ చేసేవి... నాన్న పనిహడావిడిలో పడి మనకు చెప్పటం మరచిపోయినవి, అమ్మను మనం అడగటం మరచిపోయినవి... చాలా చిన్న చిన్న విషయాలే ఈ పుస్తకంలో రాసాను.

'స్మాల్‌లీక్ సింక్స్ ఎ గ్రేట్ బోట్' అంటారు. చిన్న రంధ్రమే పెద్ద పడవను ముంచేస్తుంది. చిన్న చిన్న విషయాలపట్ల మనం చూపే అశ్రద్ధ భవిష్యత్తులో మన ప్రగతికి పెద్ద అవరోధాలుగా మారతాయి. మనము ఫోన్ కొంటే ఆ ఫోను ఉపయోగించే విధానాన్ని వివరిస్తూ ఒక మాన్యుల్ కూడా ఇస్తారు. ఇలాగే ఒక వాహనాన్ని కొన్నా, టి.వి, ఎ.సి, వాషింగ్ మెషిన్ , మిక్సీ ప్రతివస్తువుకు దానిని ఉపయోగించే విధానాన్ని వివరిస్తూ ఒక మాన్యుల్ ఉంటుంది. మరి జీవితానికి? దానిని ఎలా ఉపయోగించుకోవాలి. ఎలా సద్వినియోగపరచుకోవాలో వివరిస్తూ మాన్యూల్ ఎవరైనా రాసారా? ముఖ్యంగా భవిష్యత్తును, జీవితాన్ని నిర్దేశించే యవ్వన కాలాన్ని ఉపయోగించుకునే మాన్యూల్ ఏదైనా ఉందా? వ్యక్తిత్వ వికాస పుస్తకాలన్నీ ఆ కోవకే చెందుతాయి. ఈ పుస్తకం కూడా తప్పకుండా మీ జీవితాన్ని ప్రభావితం చేస్తుందని ఆశిస్తున్నాను. మరి చదవండి...

**-రచయిత**

# విషయ సూచిక

| | | |
|---|---|---|
| **I.** | **విజయం** | 10 |
| **II.** | **విజయానికి ఏడు సూత్రాలు** | **15** |
| 1) | గెలుపంటే చిన్ననాటి కలలను వెంబడించటమే *(మొదటి సూత్రం)* | 15 |
| | a) కె.జి.ఎఫ్. హీరో యష్ | 17 |
| | b) జస్టిస్ కపాడియా | 19 |
| | c) వ్యోమగామి రాజాచారి | 21 |
| 2) | గెలుపంటే కాలాన్ని సద్వినియోగపరచుకోవటమే *(రెండవ సూత్రం)* | 23 |
| | a) బెంజిమిన్ ఫ్లాంక్లిన్ | 27 |
| | b) ఎల్లెన్ మస్క్ | 28 |
| | c) మోక్షగుండం విశ్వేశ్వరయ్య | 30 |
| 3) | గెలుపంటే ఓటమితో నిరంతర సహవాసం *(మూడవ సూత్రం)* | 32 |
| | a) జాక్‌మా (ఆలీబాబా డాట్ కామ్) | 34 |
| | b) హీరోయిన్ వాణిశ్రీ | 38 |
| | c) జె.పి.రౌలింగ్ (హరీపోటర్ రచయిత్రి) | 41 |
| 4) | గెలుపంటే నిలుపుకున్న బంధాలే *(నాలుగవ సూత్రం)* | 44 |
| | a) శంకర్ దేవరాజన్, I.A.S.Guru | 46 |
| | b) మహానటి | 48 |
| | c) ప్రమోద్ మహజన్ | 50 |

5) గెలుపంటే లోపాలను అధిగమించడం 51
*(ఐదవ సూత్రం)*

A) వైకల్యం × వైఫల్యం 53

a) హెలెన్ కెల్లర్ 55

b) జైపాల్‌రెడ్డి 57

c) చేతుల్లోని పైలెట్ 59

B) పేదరికాన్ని జయించి... 61

a) దీరూబాయ్ అంబానీ 62

b) అక్కినేని 64

c) ఎల్.వి.ప్రసాద్ 66

C) డిగ్రీలు లేని గెలుపు 69

a) సరిపల్లి కోటిరెడ్డి 71

b) సింగిల్ డిజిట్ మార్కులు 74

c) మొక్కను నమ్ముకొని 76

D) గెలుపుకు వయోపరిమితి లేదు 78

a) కల్నల్ శాండర్స్–కె.ఎఫ్.సి 80

b) ఐ.ఐ.టి.రామయ్య 83

c) వయసును ఓడించే పరుగు 86

6) గెలుపంటే అవరోధాల్నే అవకాశాలుగా మార్చుకోవటమే 88
*(ఆరవ సూత్రం)*

a) గాంధీ 89

b) వోల కాబ్స్ 92

c) కెంట్ వాటర్ ఫిల్టర్ 94

7) గెలుపంటే ఇవ్వటమే 96

(...ఇస్తా... గెలుస్తా...) *(ఏడవ సూత్రం)*

a) రతన్ టాటా 98

b) విప్రో అధినేత–అజిమ్ ప్రేమ్‌జీ 100

c) వారెన్ బఫెట్ 102

**IV. విద్యార్థులకు ఏడు సూత్రాలు 105**

**యువతకు ఏడు సూత్రాలు 109**

**V. గెలుపు ఒక గాజుబొమ్మ 113**

a) "సత్యం" రామలింగరాజు 114

b) చందా కొచ్చార్ 116

c) 'శరవణ్ భవన్' రాజగోపాల్ 119

**VI. చరిత్ర చెప్పే పాఠాలు 121**

a) గెలుపంటే మనల్ని మనం గెలవటమే– అజాత శత్రువు 122

b) గెలుపంటే బాధ్యతల్ని స్వీకరించటమే– రాణిఅహల్యాబాయి 124

**VII. పిసాటవర్ చెప్పే పాఠాలు 128**

# విజయం

**విజయం అంటే ఏమిటి? దీనిని ఎలా నిర్వచించాలి? విజేత అంటే ఎవరు?**

మన ఎం.ఎల్.ఎ.గారు ఈ ఎలక్షన్‌లో బంపర్ మెజారిటీతో గెలిచారు. అందరి దృష్టిలో ఆయనో గొప్ప విజేత. ఐదేళ్లలో మళ్లీ ఎన్నికలు. పాపం ఈసారి డిపాజిట్ కూడా దక్కలేదు. ఇంతకీ ఆయన విజేత? పరాజితుడా?

నాకు ఎమ్.ఎస్.సిలో ఒక క్లాస్‌మేట్ ఉండేవాడు. మంచివాడు. చలాకిగా, అందిరితో స్నేహంగా ఉండేవాడు. తెలంగాణలో మారుమూల పల్లెనుండి ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్.ఎస్.సి లో చేరటం ఆ రోజుల్లో గొప్ప ఎచీవ్‌మెంటే ,బి.ఎస్.సిలో కాలేజీ టాపర్! అంటే విజేత కదా! తల్లిదండ్రులు కడుపేదవారు. ఇతన్ని యూనివర్సిటీ హాస్టల్‌లో పెట్టి చదివించే స్థోమత వారికి లేదు.

ఆరోజుల్లో ఫీజు రీఇంబర్స్‌మెంట్ సదుపాయాలు లేవు. అతను డిగ్రీ చదివిన కాలేజిలో లెక్చరర్లు చందాలేసుకొని ఇతన్ని యూనివర్సిటీలో చదివించారు. యూనివర్సిటీలో కూడా టాపర్. దీనినిబట్టి ఈయన ఒక విజేత అంటే ఎవరైనా సరే ఒప్పుకుంటారు కదా!!

మెరిట్ స్టూడెంట్ అవటంవలన ఎమ్.ఎస్.సి. అయిన వెంటనే ముంబాయ్‌లో ప్రతిష్ఠాత్మక కేంద్ర ప్రభుత్వ సంస్థలో సైంటిస్ట్‌గా ఉద్యోగం వచ్చింది. అతని క్లాస్‌మేట్స్ చాలా మంది చిన్నచిన్న కాలేజీల్లో లెక్చరర్ ఉద్యోగానికి ప్రయత్నిస్తున్న రోజుల్లోనే అతను సెంట్రల్ గవర్నమెంట్‌లో సైంటిస్ట్. ఎంత గొప్ప విజయం?.... అక్కడ ఏం జరిగిందో కరెక్టుగా ఎవరికీ తెలియదు. కానీ తోటి ఉద్యోగినితో మనస్పర్థలవలన అవమానానికి గురై ట్రైనింగ్ పీరియడ్‌లోనే ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. ఇతను జీవితంలో గెలిచాడా? ఓడాడా??- అతను ఓడిపోవటమే కాదు, అతనిమీద ఎన్నో ఆశలు పెట్టుకొన్న అతని తల్లిదండ్రులను కూడా ఓడించాడు- వారికి అతను ఏమీ కానప్పటికీ కేవలం ఒక మంచి స్టూడెంట్‌ని ఎంకరేజ్ చేయాలన్న సదుద్దేశంతో వారి డబ్బులతో అతన్ని చదివించిన కాలేజి లెక్చరర్లందరిని ఓడించాడు. ఎందుకిలా?

మరో ఉదాహరణ, అతను కష్టపడి ఐ.ఎ.ఎస్‌కు సెలక్టయ్యాడు. ఇంట్లో, బంధువుల్లో, ఊర్లో అతనికి బ్రహ్మరథం పడతారు. గొప్ప విజేతగా అందరూ ఆకాశానికెత్తేస్తారు. కానీ, అతను ఉద్యోగంలో ఎటువంటి ప్రతిభను, అంకితభావాన్ని ప్రదర్శించలేకపోయాడు. అతన్ని ప్రభుత్వం ఒక అసమర్థ అధికారిగా ముద్రవేస్తుంది. ఎప్పుడూ మంచి పోస్టింగ్ ఇవ్వరూ. అప్రదానమైన (నాన్‌ఫోకల్) సీటు కేటాయిస్తారు. అంతులేని ఫ్రస్టేషన్. ఇతను జీవితంలో గెలిచినట్లా? ఓడినట్లా??

ఇలా రాసుకుంటూ పోతే కోకొల్లలు...ఈ పుస్తకం చాలదు.

ఇంతకీ విజయమంటే ఏమిటి? విజేతలంటే ఎవరు??

విజయం ఒక సంఘటనో, సందర్భమో కాదు. విజయం అంటే ఒక ఎన్నిక (సెలక్షన్), ఒక పోలిక లేదా ఒక కంపారిజన్ కాదు.

**విజయం అంటే డబ్బు సంపాదించడం అస్సలు కాదు.** పక్కవాడి మీదాదిక్యత సాధించే ఒకే ఒక సులువైన మార్గం పక్కవాడికంటే ఎక్కువ సంపాదించడం మాత్రమే. ఈ అజ్ఞానంలో, పోటీపడి జనం ధనం సంపాదిస్తున్నారు. అంతే.

**ఇంతకీ విజయమంటే...? విజయం నిర్వచనం లేనిది. కొలమానం (measurement) లోనికి రానిది. వర్ణనలకు అందనిది. మరి...**

**విజయం ఒక నిరంతర పయనం.** తనశక్తియుక్తులు తెలుసుకొని వాటిని పెంచుకుంటూ, సద్వినియోగం చేసుకుంటూ తన లోపాలను, బలహీనతలను గుర్తించి వాటిని తుంచుకుంటూ–సహజన్యాయ సూత్రాలననుసరిస్తూ, సామాజిక విలువలను పాటిస్తూ తను సంతోషంగా ఉండి తనచుట్టూ ఉన్నవారిలో వీలైనంత ఎక్కువమందిని సంతోషపెట్టడమే విజయం.

Give, for give, give up - ఈ మూడు పదాలు నాకు చాలా ఇష్టం. వీటిని Trinity of success అంటాను.

గివ్ అంటే ఇవ్వడం. ఏమి ఇవ్వాలి. పక్కవాడికి కొంత సమయమివ్వాలి, .... ఇంకా మన ఆలోచనలో స్థానమివ్వాలి .... కొంచెం సహకారం, ఇంకొంచెం సహాయం .... అన్నిటికీ మించి కాసింత ప్రేమ ఇవ్వగలగాలి.

ఫర్‌గివ్ అంటే క్షమించడం, రెండువేల సంవత్సరాల క్రితం ఆయనను చిత్రవధ చేసి శిలువేసిన రోమా సైనికుల గురించి "దేవా, వీరేంచేయుచున్నారో వీరికి తెలియదు కాబట్టి వీరిని క్షమించండి" అని దేవున్ని ప్రార్థిస్తాడు-జీసస్.

ఇక మూడవది గివ్ అప్. అంటే గివ్ అప్ చేయమని కాదు. చెయ్యవద్దని ఇక్కడ అర్థం. గివ్ అప్ అంటే మధ్యలో వదిలి వేయడం, ఓడిపోతామనే భయంతోనో, గెలుస్తామనే నమ్మకం లేకనో, కష్టంగా ఉందనో, ఇష్టంగా లేదనో కుంటిసాకులతో తలపెట్టిన కార్యాన్ని మధ్యలో వదిలేస్తారు చాలామంది. నెవర్ గివ్ అప్ అంటారు. ప్రారంభించిన పనిని మధ్యలోనే వదిలి వేయకపోవడం విజేతల ప్రథమ లక్షణం. గివ్ (ఇస్తం), ఫర్‌గివ్ (క్షమిస్తం)నెవర్‌గివ్ అప్ (జయిస్తం). **గెలుపంటే ఇస్తం... క్షమిస్తం... జయిస్తం.**

ఇంకా, విజయం అంటే తనను తాను గెలవడం (చివర్లో ఇచ్చిన అజాత శత్రువు కథ చదవండి) తనను తాను చదవడం, తనలోకి తాను ప్రయాణించడం.

చివరిగా, విజయమంటే బాధ్యతల్ని గుర్తెరగడం, ధైర్యంగా వాటిని స్వీకరించడం (చివర్లో ఇచ్చిన రాణీ అహల్యాబాయి కథ చదవండి).

ఒక చిన్న కరోనా కథ - అరివళగన్ కుంభకోణంలో నివశించే ఒక కార్మికుడు. 65 సంవత్సరాల వయసు, భార్య మంజుల 62 సంవంత్సరాల వయసు, ఈమె కాన్సర్ పేషెంట్. 31, మార్చి, 2020 ఆమె కెమోథెరపీకి డాక్టర్ అప్పాయింట్‌మెంట్ ఇచ్చిన తేది. దేశమంతా లాక్ డౌన్ బస్సులు లేవు, రైల్లు లేవు, టాక్సీలు లేవు, అంబులెన్స్‌లు లేవు. ఇవి సమస్యలు. 130 కి.మీ. దూరంలో ఉన్న పాండిచ్చెర్రీలోని జిప్‌మర్ హాస్పిటల్‌కు వెళ్లే మార్గమే లేదు. అతను సమస్యలవైపు చూడలేదు. కేవలం పరిష్కారం వైపు మాత్రమే చూపాడు-సైకిల్ వెనుక భార్యను కూర్చోబెట్టుకున్నాడు. భార్యకింద పడిపోకుండా టవల్‌తో ఆమెకు తన నడుముకు కట్టుకున్నాడు. కుంభకోణం నుండి పాండిచెర్రీకి 130 కి.మీ. సైకిల్ తొక్కి భార్యను జిప్‌మర్ హాస్పిటల్‌కి తీసుకెళ్లాడు. లాక్‌డౌన్‌లో హాస్పిటల్‌కి వచ్చిన పేషెంట్‌ను చూసి డాక్టర్లు ఆశ్చర్యపోయారు. "ఎలా వచ్చావు" అని అడిగారు. 130 కి.మీ.సైకిల్ తొక్కుకుంటూ వచ్చాను అని చెప్పాడు. అతని నిబద్ధతకు డాక్టర్లు ఆశ్చర్యపోయారు. ఇద్దరికి భోజనం పెట్టించారు. భార్యకు కెమోథెరపీ ఇచ్చారు. అంబులెన్స్‌లో తిరిగి ఇంటికి పంపించారు.

అరివళగన్‌కు డబ్బులేదు. హోదా లేదు, కారులేదు, కనీసం స్కూటర్ కూడా లేదు. తనకున్న ఆపాత డొక్కు సైకిల్‌తోనే తన సమస్య పరిష్కరించుకున్నాడు. తన బాధ్యతను నెరవేర్చాడు. మీడియా అతని గురించి కథలు కథలుగా రాసింది. దేశమంతా అతనికి జేజేలు పలికింది. మనం కూడా ఇప్పుడు అతని గురించి చదువుకుంటున్నాం. విజయమంటే సమస్యలను పరిష్కరించడం బాధ్యతలను నిర్వర్తించడం.

మన జీవనగమనంలో వేర్వేరు పాత్రలు (రోల్స్) పోషించవలసి వస్తుంది. జీవితం ఆరంభంలో విద్యార్థి పాత్రను పోషిస్తాము. చక్కగా చదువుకుంటూ భవిష్యత్తుకు పునాదులు నిర్మించుకుంటూ, వ్యసనాలకు, చెడు సహవాసాలకు బలికాకుండా, ... అదే సమయంలో, యవ్వన దశలో మాత్రమే సాధ్యమయ్యే సహజమైన అల్లరి, ఆనందాలు, స్నేహాలు కోల్పోకుండా ఉండటమే విద్యార్థిగా విజయం.

చదువు పూర్తయిన తర్వాత సరైన కెరీర్‌ను ఎన్నుకోవడం మంచి ఉద్యోగాన్ని సాధించడం ఒక యువకునిగా అది ఘనవిజయం.

పిమ్మట, ఒక ప్రియుడుగా, ప్రియురాలిగా, భర్తగా, భార్యగా కుటుంబపెద్దగా, ఒక తండ్రిగా, తల్లిగా వేర్వేరు పాత్రలు పోషించవలసి వస్తుంది.

అంతేకాదు, ఆఫీసులో ఒక ఉద్యోగిగా, కోలీగ్‌గా, బాస్‌గా వేర్వేరు రోల్స్ పోషించాలి కూడా.

వీటికి తోడు, ఎందరికో స్నేహితుడిగా / స్నేహితురాలిగా, బంధువుగా, సమాజంలో ఒక పౌరునిగా, ఇంటి పరిసరాలలో నైబర్‌గా మనకు తెలియకుండానే ఎన్నో రోల్స్ పోషిస్తాము.

ఈ పాత్రలన్నిటినీ సక్రమంగా, బాధ్యతాయుతంగా పోషించడమే నిజమైన విజయం. అది మనిషికి తృప్తిని, సంతోషాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుంది.

ఇంగ్లీష్‌లో ఒక కోట్ ఉంది "ది స్ట్రెంథ్ ఆఫ్ ఎ చైన్ ఈస్ డిసైడెడ్ బై ఇట్స్ వీకెస్ట్ లింక్" గొలుసులో ఎన్నో లింకులు ఉంటాయి. ప్రతి లింకు బలంగా ఉండాలి. ఏ ఒక్క లింకు బలహీనంగా ఉన్న, గట్టిగా లాగినప్పుడు ఆ బలహీనంగా ఉన్న లింక్ దగ్గర చైన్ తెగిపోతుంది.

మనం జీవితంలో కూడా ప్రతిపాత్రను విజయవంతంగా పోషించాలి. విద్యార్థి పాత్రను ఉద్యోగి పాత్రను ప్రియుడు/ప్రియురాలి పాత్రను, భర్త/భార్య పాత్రను, తండ్రి /తల్లి పాత్రను – ఇలా ప్రతిపాత్రకు న్యాయం చేయాలి. ఏ ఒక్క పాత్రలో ఫైల్ అయినా అది జీవితమనే చైన్‌లో వీక్ లింక్ అయిపోతుంది. గొలుసు అక్కడే తెగుతుంది. జీవితంలో విజయం చేజారిపోతుంది.

ఇలా విజయం గురించి రాయాలంటే ఎన్ని పేజీలైనా చాలవు. అందుకే స్ఫూర్తిదాయక విజయగాథలను ఈ పుస్తకంలో ఎక్కువగా రాశాను.

చివరిగా **"ఫీల్ మై లవ్"** ఈ వాక్యం యంగ్‌స్టర్స్‌కి బాగా పరిచయమైనదే. మన ప్రేమని మనం వ్యక్తపరచటం కంటే, మన ప్రేమను ఎదుటివ్యక్తి ఫీల్ అయితే దాని మాధుర్యం రుచిచూడటం సులభం. విజయం కూడా అలాటిదే. సక్సెస్‌ను మీ ప్రియుడుగానో / ప్రియురాలుగానో ఊహించుకోండి. మీ జీవితంలోకి ఆహ్వానించండి. ఆ కిక్ వేరుగా ఉంటుంది... ఆశ్వాదించండి మరి...

# విజయానికి ఏడు సూత్రాలు

## మొదటి సూత్రం

# 1. గెలుపంటే చిన్ననాటి కలలను వెంబడించటమే

**మ**నిషి ఆలోచించటం నేర్చుకున్నప్పుడే కలలు కనటం కూడా నేర్చుకుంటాడు. కలలు మనిషి ఆలోచనలో, జీవితంలో అంతర్భాగం.

పెద్దయ్యాక ఏమవుతావని ఏ పిల్లవాడినడిగినా పైలెట్ అవుతాననో, కార్ రేసర్ అవుతాననో చెప్తున్నారు. కొంతమంది తమనితాము స్పైడర్‌మాన్‌గానో, ఐరన్‌మాన్‌గానో ఊహించుకుంటారు. ఎందుకు? వారి ప్రతిభకు వారు పరిమితులు విధించుకోరు. కేవలం డాక్టర్ లేదా ఇంజనీరు మాత్రమే అవ్వాలని ఊహించుకోరు.

అసాధ్యాల గురించి ఆలోచించరు. గెలవటానికే మనిషి జన్మించాడనే వాస్తవానికి వారి ఆలోచనలు చాలా దగ్గరగా ఉంటాయి.

కానీ, వారు పెరిగి పెద్దవారైన కొద్దీ పరిసరాలు, పరిస్థితులు, పెంపకం వారి ప్రతిభకు పగ్గాలు, కలలకు కళ్ళాలు వేస్తుంది. వీటి ప్రభావంతో అవకాశాలు అందుకోవటం మానేసి అవరోధాలవైపు చూడటం నేర్చుకుంటారు.

నా డాటర్‌ని చిన్నప్పుడు (సుమారు నాలుగు సంవత్సరాల వయసులో) ఒకసారి డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాను. ఆయన సరదాకి పెద్దయ్యాక ఏమవుతావని అడిగారు. వెంటనే తడుముకోకుండా టీచర్ అవుతానంది. డాక్టర్ నీరసంగా "టీచరా" అన్నారు. "ఏ... అవకూడదా అని అమాయకంగా అడిగింది. డాక్టర్ తెలియకుండానే మా పాప కలను పలుచన చేసి ఉంటారు.

బాల్యంలో కలలు కనటం సహజలక్షణం. ఆ కలలను సాకారం చేసుకోటానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరం. యవ్వనంలో ఉండి తాను సాధించాల్సింది

ఇంకా ఎంతో ఉంది అని నమ్మే ప్రతి వ్యక్తి తనలోకి తాను ప్రయాణం చేసి చిన్ననాటి కలలను జ్ఞాపకం చేసుకోవాలి, వాటిని నెరవేర్చుకోటానికి చిత్తశుద్ధితో ప్రయత్నించాలి.

కలలను సజీవంగా నిలుపుకొని వాటిని నిజం చేసుకొనేవారు మన పరిసరాలలో ఎంతోమంది.

ఎక్కడో రామేశ్వరం దగ్గర్లోని కుగ్రామంలో ఒక పడవ కార్మికుని ఇంట్లో జన్మించి–ఒక భారతరత్నగా దేశాధ్యక్షునిగా ఆయన స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని ఈ జాతి వీక్షించింది.

పిల్లలు బాల్యంలో అమాయకంగా, "నేను స్పైడర్‌మాన్ అవుతాను... నేను ఐరన్‌మాన్ అవుతాను" అన్నట్లు రాజాచారి చిన్నప్పుడు అమాయకంగా టీచర్‌తో నేను "ఆస్ట్రోనాట్ (అంతరిక్ష యాత్రికుడు)" అవుతానన్నాడు. ఆ కలను సజీవంగా నిలుపుకొని, ఆ దిశగా ఒక్కొక్క అడుగు వేసుకుంటూ తన లక్ష్యాన్ని చేరుకున్న రాజాచారి కథ తెలుసుకుందాము...

ఒక పేద కుటుంబంలో జన్మించి, వీధిలో క్రికెట్ ఆడుకుంటూ దూరంగా ఉన్న జడ్జిగారి  బంగళా చూసి నేను కూడా పెద్దయ్యాక జడ్జినయితే ఇలాంటి పెద్ద బంగ్లాలో ఉండొచ్చని పగటికలలు కన్నాడు ఒక అమాయకపు బాలుడు. కానీ, పేదరికం వలన చదువుసాగక చిన్న కోర్టులో క్లాస్–4 (బంట్రోతు) ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. ఐనప్పటికి, నిరాశ చెందక, తన చిన్ననాటి కలను సజీవంగా నిలుపుకొని–విద్యార్హతలు పెంచుకుంటూ, కష్టపడుతూ, ఒక్కొక్క మెట్టు ఎక్కుకుంటూ భారత ప్రధాన న్యాయమూర్తి పీఠాన్ని అలంకరించారు జస్టిస్ కపాడియా.

ఇక కె.జి.ఎఫ్.హీరో  'యష్" బహుశా, యష్ గురించి మీకు తెలిసే ఉంటుంది. ఈయన తండ్రి కర్నాటక ఆర్.టి.సిలో డ్రైవర్. తన కొడుకు డిగ్రీ చదువుకొని ఆర్.టి.సి.లో ఏ క్లర్క్ ఉద్యోగమో తెచ్చుకుంటే చాలనుకొని ఉండవచ్చు. లేదా ఇంజనీరింగ్ చదివితే చాలు అనుకొని ఉండవచ్చు.

కానీ "యష్" అలా అనుకోలేదు. చిన్నప్పుడే తను హీరో కావాలని కలలు కన్నాడు. స్కూల్లో తోటి విద్యార్థులతో "హీరో" అనిపించుకొని సరదా పడేవాడు.  అంతటితో ఆగిపోలేదు. ప్రతిక్షణం దాని గురించే ఆలోచిస్తూ,  ఆ దిశగా శ్రమిస్తూ సినిమా హీరో అయ్యాడు.

# కె.జి.ఎఫ్ హీరో యష్

**యష్,** పరిచయం అక్కరలేని హీరో. కె.జి.ఎఫ్ సినిమా ద్వారా భారతీయులందరికి పరిచయమైన కన్నడ నటుడు. పూర్తిపేరు నవీన్‌కుమార్ గౌడ. ధనవంతుల కుటుంబంకాదు. పదోతరగతి మించిన క్వాలిఫికేషన్ లేదు. సినిమా నేపథ్యం లేనేలేదు. గాడ్‌ఫాదర్ లేదు. తను ఎప్పటికైనా హీరో కావాలనే చిన్ననాటి కలను సజీవంగా నిలుపుకొని నిరంతర శ్రమ, ఆశావాదం ఆయుధాలుగా తనను తాను నిరూపించుకున్న రియల్ లైఫ్ హీరో ఈ యష్. ఇతని కథేంటో చూద్దాం...

యష్ తండ్రి అరుణ్‌కుమార్ కర్నాటక ఆర్.టి.సి.లో బస్ డ్రైవర్. కొడుకు నవీన్ డిగ్రీ చదువుకొని ఏదో ఉద్యోగం తెచ్చుకొని చెల్లి పెళ్లి చేసి వృద్ధాప్యంలో తమని ఆదరిస్తే చాలని కలకని ఉండవచ్చు.

కానీ, యష్ కల ఏమిటి? తను ఒక గొప్ప హీరో కావాలి. చిన్నప్పటి నుండి అదే ధ్యాస. చిన్నప్పటి నుండే స్కూల్లో నాటికలు, మోనోయాక్షన్స్ వేసేవాడు. అందరూ చప్పట్లు కొడితే సంతోషించేవాడు. ఈ చప్పట్లు తన జీవితాంతం వినిపించాలని కలలు కనేవాడు. స్కూల్లో ఉండగానే అందరూ హీరో అని పిలిచేవారు. దానిని నిజం చేసుకోవాలని తాపత్రయపడేవాడు. స్నేహితులు, టీచర్లు డాక్టర్ అయితే బాగుంటుందనో, పైలెట్ ఇంకా బాగుంటుందనో ప్రలోభపెట్టి ఉండవచ్చు. యష్ మాత్రం తన గోల్ మార్చుకోలేదు. మరచిపోలేదు.

టెన్త్ క్లాస్ పాస్ అయ్యాడు. బెంగళూర్ వెళ్లి నటన నేర్చుకుంటానని ఇంట్లో నుండి పారిపోయాడు. అమ్మనాన్నలు వెతికిపట్టుకొని నాలుగు తగిలించి కాలేజీలో జాయిన్ చేశారు. 'ముందు డిగ్రీ పూర్తి చెయ్యి, తరువాత నటన నేర్చుకుందువుగాని' అని బుద్ధి చెప్పారు. కాలేజీలో జాయిన్ అయ్యాడు, కొన్ని నెలలు బుద్ధిగానే కాలేజీకి వెళ్ళాడు, మరి అతని కల... యష్‌ది నిదురపోతే వచ్చే కల కాదు. అసలు నిదురపోనీయని కల. అందుకే ఓ సుదినాన కాలేజీకి గుడ్‌బై చెప్పి ఇంట్లో ఏమీ చెప్పకుండా బెంగళూరు

వెళ్లి బి.వి.కారంత్ నాటక కంపెనీలో చేరిపోయాడు. నటుడిగా కాదు... నట శిక్షణకు కాదు... మరి... ఆఫీసుబాయ్‌గా. చిన్నా చితక పనులు చేయడం, కాఫీలు టీలు అందించడం అతని డ్యూటీ. అయినా యష్ సిగ్గుపడలేదు, అది తన గమ్యం కాదని కేవలం ఒక మజిలీమాత్రమేనని, అతనికి తెలుసు. అంతేకాదు, ఏకలవ్యునిలా నటనలో మెళకువలు కూడా నేర్చుకుంటాడు.

**మనమెప్పుడూ అదృష్టం అంటూ ఉంటాము. అదృష్టము ఎక్కడో దూరంగా ఉండదు. మన కలల్లో, మన ప్రయత్నాల్లో నక్కి దాక్కొని ఉంటుంది. మనకు దాని అవసరం ఏర్పడినపుడు ఒక్కసారిగా మన జేబులోకి దూకుతుంది.**

యష్‌కి కూడా ఇలాగే జరిగింది. సరిగ్గా ప్రోగ్రాం రోజున ఒక నటుడు రాకపోవటం వలన ఆ పాత్ర నటించే అవకాశం యష్‌కి లభించింది, ఆఫీస్ బాయ్ నుండి నటుడిగా ప్రమోషన్ లభించింది.

స్టేజ్ నటుడిగా తనను తాను నిరూపించుకొని టి.వి.సీరియల్స్‌లో అవకాశాల్ని అందుకొని 2004-2007 మధ్య టి.వి.రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకొని సినిమా అవకాశాలకోసం ప్రయత్నాలు ఆరంభించాడు.

2007లో ప్రియదర్శిని దర్శకత్వంలో "జంబడగుడిగి" సినిమాలో చిన్న వేషం దొరికింది. చిన్నపాత్రే కదాని ఆషామాషీగా తీసుకోలేదు. చిన్న పాత్రలో కూడా తన ప్రత్యేకతని ప్రదర్శించి ఇతర దర్శకుల దృష్టిలో పడ్డాడు.

**"ప్రతి చిన్న విషయాన్నీ సీరియస్‌గా తీసుకోవడం, ఈజీగోయింగ్‌గా ఉండకపోవడం విజేతల ప్రథమ లక్షణం "**

"మొగ్గిన మనసు" సినిమాలో హీరో రోల్ కానప్పటికీ హీరోకంటే బాగా చేసాడని, హీరోకంటే స్టైలిష్‌గా ఉన్నాడని ప్రేక్షకులతో జేజేలు పలికించుకొని బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్నాడు. 2008లో రాఖీ సినిమాతో హీరోగా మారాడు, ఇక ఇప్పటివరకు వెనక్కు తిరిగి చూసుకోలేదు.

**చూశారుగా చిన్ననాటి కలలను సజీవంగా నిలుపుకుంటే, ఆ కలల బలం!**

# జస్టిస్ కపాడియా

**ఈ**యన భారతదేశానికి 38వ ప్రధాన న్యాయమూర్తి (సుప్రీంకోర్టు). భారత రాజ్యాంగం ప్రకారం దేశాన్ని మూడు వ్యవస్థలు (ఎస్టేట్స్) నడిపిస్తాయి. పరిపాలనా వ్యవస్థకు (ఎక్సిక్యూటివ్) రాష్ట్రపతి అధినేత. శాసన వ్యవస్థ (లెజిస్లేచర్)కు ప్రధాని అధినేత, న్యాయవ్యవస్థకు (జుడీషియరీ) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అధినేత. ఇటువంటి అత్యున్నత పీఠాన్ని అధిరోహించిన 38వ భారత ప్రధాన న్యాయమూర్తి ఎస్.హెచ్.కపాడియా గురించి తెలుసుకుందాం.

**ఈయన జీవితాన్ని చూసినపుడు నెరవేరని కలలు ఉండవని నమ్మాల్సి వస్తుంది.** ఆయన ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఒక సభలో ఆయన వెల్లడించిన దానిని బట్టి ఆయన బాల్యంలో తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటున్నప్పుడు, దూరంగా ఒక భవంతి కనిపించేది. అది ఒక జడ్జిగారి నివాసము. అటు ఎవరినీ వెళ్లనిచ్చేవారు కాదు. జడ్జి అంటే ఒక హెూదా, గౌరవము కలిగిన ఉద్యోగమని, ఆ చిన్నమనసుకు అర్థం అయ్యింది. అంతేకాదు, పెద్దయ్యాక నేనుకూడా జడ్జిని అవ్వాలి అనుకున్నారు. చిన్ననాటి ఆ కలను ఆయన సజీవంగా నిలుపుకున్నారు.

గొప్పగా చదువుకున్న కుటుంబ నేపథ్యం ఏమీలేదు. ఆర్థిక స్థితిగతులు అంతంత మాత్రమే. తండ్రి ఆర్మీలో ఎలక్ట్రీషియన్. పేదరికం కారణంగా చదువు మధ్యలోనే ఆపేసి, ఉద్యోగంలో చేరవలసి వచ్చింది. కపాడియా క్లాస్-4 ఉద్యోగిగా కోర్టులో పనిచేసేవాడు.

ఉద్యోగాన్ని బట్టి ఆయన కప్పులు కడిగేవాడో కోర్టుహాలు ఊడ్చేవాడో మనకు తెలియదు. కానీ, ఆయన చిన్ననాటి కల జడ్జి అవ్వటం మాత్రం ప్రతిక్షణం గుర్తుకు తెచ్చుకునేవాడు.

కోర్టులో క్లాస్-4 ఉద్యోగం చేస్తూనే చదువుకున్నాడు. డిగ్రీ తర్వాత "లా" పూర్తిచేశాడు. ఒక లాయర్ దగ్గర గుమస్తాగా చేరాడు. తరువాత ఒక లా కంపెనీలో గుమస్తాగా పనిచేశాడు, తరువాత ఆయనే స్వయంగా లా ప్రాక్టీస్ మొదలు పెట్టాడు.

ఒక లాయర్‌గా మంచి పేరు తెచ్చుకొని 1991లో 43 సంవత్సరాల వయసులో ముంబాయి హైకోర్టు జడ్జిగా నియమింపబడ్డారు. అప్పటి నుండి ఆయన 22 సంవత్సరాల కెరీర్‌లో హైకోర్టు జడ్జిగా, చీఫ్ జస్టిస్‌గా, సుప్రీంకోర్టు జడ్జిగా, భారత ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు.

నిజాయితీకీ, వృత్తి నిబద్ధతకు మారుపేరుగా నిలిచారు. ఈ 22 సంవత్సరాలలో ఒక్కరోజు కూడా ఆయన లీవ్ తీసుకోలేదు. ఒకసారి ఆయనకు ప్రమాదవశాత్తు వెముక విరిగింది. అలా కట్టుతోనే కోర్టుకు వచ్చారు.

తన లాంటి అల్పసంఖ్యాక వర్గానికి చెందిన పేదవాడు జీవితంలో ఈ విధంగా ఎదగడం, అత్యున్నత స్థానానికి చేరుకోవడం కేవలం భారతదేశంలోనే సాధ్యమని పరోక్షంగా మన ప్రజాస్వామిక వ్యవస్థని మెచ్చుకున్నారు.

కోర్టులో ప్యూన్ ఉద్యోగం నుండి భారత ప్రధాన న్యాయమూర్తిగా ఆయన ప్రస్థానం ఒక సినిమా కథలాగా ఉన్నప్పటికీ, ఆయన చిన్ననాటి కల, ఆయన గురి, ఆయన వ్యక్తిత్వం, అంతర్గత శక్తులుగా ఆయన్ని నడిపించి ఉండాలి. **అసాధ్యమంటే ఏమిటో ఆయనకు తెలిసి ఉండకపోవచ్చు.**

# వ్యోమగామి (ఏస్ట్రోనాట్) రాజాచారి

ఇది రాజాచారి కథ. అసలు జరగటానికి ఏమాత్రం అవకాశం లేని ఒక కల కని ఆ కలను నిజం చేసుకొని అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఒక కార్యశూరుని కథ.

చిన్నప్పుడు పైలెట్ కావాలని కోరుకుంటే అది సాధ్యం కావచ్చు. తనకు సొంత విమానం ఉండాలని కలకన్నా అదీ నిజం కావచ్చు. కానీ, ఏస్ట్రోనాట్ (వ్యోమగామి) కావాలని కలకంటే అది ఎలా సాధ్యం? అది చదివే కోర్స్ కాదు. ఎన్నుకొనే వృత్తికాదు. సంపదతో సాధించే అవకాశం లేదు– ఐనప్పటికీ సాధించి చూపాడు మన రాజాచారి.

మూడు దశాబ్దాల క్రితం రాజాచారి 11 సంవత్సరాల వయసులో అమెరికాలో 5వ తరగతి చదువుతున్నప్పుడు స్కూల్లో టీచర్ ఎసైన్‌మెంట్ ఇచ్చింది. పిల్లలందరూ వారు భవిష్యత్తులో ఏమి కావాలనుకుంటున్నారో చార్టు గీయాలి. రాజాచారి తను భవిష్యత్తులో ఏస్ట్రోనాట్ అవుతాను అని రాశాడు. చార్టుమీద ఏస్ట్రోనాట్ బొమ్మ గీశాడు. ఏస్ట్రోనాట్ ముఖం దగ్గర తన సొంత ఫొటో అంటించాడు. అది చూచి తోటిపిల్లలు నవ్వుకొని ఉండవచ్చు. టీచర్ కూడా “అమాయకత్వం” అనుకొని ఉండవచ్చు.

సరిగ్గా 30 సంవత్సరాల తర్వాత తన కలను నిజం చేసుకున్నాడు. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా / అర్టెమిస్ యాత్ర ద్వారా 2024లో చంద్రునిపైకి, 2030 నాటికి అంగారక గ్రహం మీదకు మానవులను పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ యాత్రకు ఎంపికై ప్రాథమిక శిక్షణ పూర్తిచేసుకొని అంతరిక్ష యాత్రకు అర్హత సాధించి లాంఛనంగా వెండి పిన్ను అందుకున్న పదకొండు మందిలో రాజాచారి ఒకరు.

ఇది కాకతాళీయంగానో, సులభంగానో జరగలేదు. తన కలను నిజం చేయటానికి నిరంతరం శ్రమించాడు. అమెరికన్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో డిగ్రీ చేశాడు. ప్రతిష్టాత్మక ఎమ్.ఐ.టి.లో ఏరోనాటిక్స్ అండ్ ఏస్ట్రోనాటిక్స్‌లో పి.జి.చేశాడు. అమెరికా నౌకాదళ టెస్ట్ పైలెట్ స్కూల్లో శిక్షణ పొంది అమెరికా వైమానిక దళంలో కల్నల్ హోదాలో

యుద్ధ విమాన పైలెట్‌గా పనిచేశాడు. ఈ ఎంపికకు దరఖాస్తు చేసుకున్న 18 వేల మంది నుండి నాసా రాజాచారితో కలిపి పదకొండు మందిని ఎంపిక చేసుకుంది.

**ఒకతరం మరో తరానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలి.** రాజాచారి తాత వెనుకబడిన మహబూబ్‌నగర్ జిల్లా నుండి 1950లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో గణితశాస్త్రంలో ప్రొఫెసర్‌గా చేశారు. రాజాచారి తండ్రి 1973లో ఉస్మానియాలో ఇంజనీరింగ్ చదివి అమెరికాకు వలస వెళ్లారు. రాజాచారి అమెరికాలోనే పుట్టి పెరిగారు.

**తాత మహబూబ్‌నగర్ నుండి హైదరాబాద్‌కు, తండ్రి హైదరాబాద్ నుండి అమెరికాకు, రాజాచారి అమెరికా నుండి అంతరిక్షానికి... ఎంత స్ఫూర్తిదాయకమైన కథ!**

అంతేకాదు, రాజాచారి అమెరికాలో పుట్టి పెరిగినప్పటికీ తన భారతీయ మూలాలను మరచిపోలేదు. అవకాశం దొరికినప్పుడల్లా హైదరాబాద్‌ను సందర్శిస్తారు. ఇక్కడే ఉంటున్న నానమ్మ అంబూజాదేవిని కలుస్తారు.

అన్నిటికీ మించి భారతదేశ ప్రయాణం తనకు తీర్థయాత్ర లాంటిదని పితరుల జన్మభూమి తనకు పుణ్యక్షేత్రం లాంటిదని గర్వంగా చెబుతారు–చిన్ననాటి కలలను సజీవంగా నిలుపుకోవాలనుకునే వారికి రాజాచారి జీవితం ఒక దిక్సూచి.

రెండవ సూత్రం

# 2. గెలుపంటే కాలాన్ని సద్వినియోగపరచుకోవటం

**జీ**వితమంటే?..

"కన్ను తెరిస్తే జననం, కన్నుమూస్తే మరణం కనురెప్పల కదలికే జీవితం". ఎప్పుడో ఎక్కడో చదివిన అక్షరాలు – "కళ్ళు తెరిస్తే ఊయలా కళ్ళు మూస్తే మోయాల" మరో సినీగీతం. కొందరు జీవితమొక పయనం అంటారు. కొందరికి పోరాటం, కొందరికి వేడుక.... కానీ అందరికి **జీవితం ఒక కాలపరిమితి.** గాంధీ అంటే 2-10-1869 నుండి 30-1-1948 మధ్య ఒక వ్యక్తి గమనం, ఒక కాలపరిమితి. ఈ కాల పరిమితిని సద్వినియోగం చేసుకోబట్టి కాలాతీత వ్యక్తిగా మారాడు.

జాన్‌కీట్స్, పరిచయం అక్కరలేని (ఆంగ్ల)కవి. గొప్ప కవిత్వం రాసి తన తర్వాత తరాల కవులకు మార్గదర్శనం చేసిన గొప్పకవి. కానీ ఆయన జీవించింది కేవలం 26 సంవత్సరాలు. ప్రపంచాన్ని జయించిన అలెగ్జాండర్ జీవించింది కేవలం 33 సంవత్సరాలు గణితశాస్త్రవేత్త రామానుజం కూడా 33 సంవత్సరాలే జీవించారు.

వీరంతా తమకు లభించిన కొద్ది కాలాన్నే సద్వినియోగం చేసుకొని గొప్ప వ్యక్తులుగా మారారు. కాలాన్ని సద్వినియోగం చేసుకొన్న ప్రతివ్యక్తి జీవితాన్ని, ఆ జీవితంలో లభించిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలడు.

మనలో చాలామంది తెలిసో తెలియకో డబ్బును దుబారా చేసినట్లే కాలాన్ని కూడా దుబారా చేస్తారు. **డబ్బును వృథా చేస్తే తిరిగి సంపాదించుకోవచ్చు కానీ కాలాన్ని సంపాదించగలమా? కోట్లు ఖర్చు పెట్టినా కొన్ని క్షణాల్ని కొనుక్కోలేము. కాలాన్ని కొనుక్కోవాలంటే సూర్యుని గమనాన్ని ఆపేయాలి.**

**వాస్తవానికి కాలం డబ్బుకంటే విలువైనది-ఎందుకంటే ఆస్తిపాస్తుల్లా కాలాన్ని వంశపారంపర్యంగా పొందుకోలేము.**

అందుకే కాలానికి డబ్బుకిచ్చే విలువైనా ఇవ్వాలి. **డబ్బుకి పద్దురాసుకున్నట్లే కాలానికి పద్దురాసుకోవాలి.** ఉదయం నిద్రలేవగానే ఆరోజు చేయవలసిన పనులన్నీ లిస్టురాసుకోవాలి. ఉద్యోగస్తులు ఆఫీసుల్లో చేయవలసిన పనులు లిస్టురాసుకుంటారు. కానీ, జీవితమంటే కేవలం ఉద్యోగం మాత్రమే కాదు కదా.

**ఊహలు, ఆశలు, కోరికలు, కలలు, గెలుపు గమ్యాలు, విజయాలు... ఇవన్నీ ఉంటేనే కదా జీవితం.**

డబ్బు ఖర్చుపెట్టే ముందు బడ్జెట్ తయారు చేస్తారు. ఖర్చుపెట్టిన తర్వాత సరిగా ఖర్చు అయ్యిందో లేదో తెలుసుకోవటానికి ఆడిట్ చేస్తారు. సంస్థలైతే పద్దుపుస్తకాలలో, వ్యక్తులైతే డైరీలో రాసుకుంటారు. రాసుకోని వారు కూడా కనీసం మనసులోనైనా లెక్కలు వేసుకుంటారు.

అలాగే, ప్రతిరోజు ఉదయం లేచిన వెంటనే ఆరోజు చేయాల్సిన పనుల జాబితా రాసుకోవటం లేదా మనసులో అనుకోవటం అలవాటు చేసుకోవాలి. ప్రతిరోజు రాత్రి పడుకునేముందు ఈ జాబితాలో ఎన్ని పనులు పూర్తిచేసాము, ఎన్ని చేయలేకపోయాము, ఎందుకు చేయలేదు-సమీక్షించుకోవాలి.

ఇలా ఒక వారం రోజులు చేసి చూడండి. లభించే ప్రయోజనాన్ని చూసి మిమ్మల్ని మీరు తప్పక అభినందించుకుంటారు.

ఇంగ్లీషులో "బైయింగ్ టైమ్" అనేవాడుక ఉంది. గడువు పెంచమని అడగటాన్ని బైయింగ్ టైమ్ అంటాము. అంతేగానీ కాలాన్ని కొనగలమని కాదు.

కాలాన్ని కొనలేకపోవచ్చు, కానీ కాలాన్ని సృష్టించుకోవచ్చు. ఎలా? రోజూ ఎనిమిది గంటలు నిద్రపోయే వ్యక్తి దాన్ని 5/6 గంటలకు కుదించుకుంటే రోజుకు 2-3 గంటల కాలాన్ని సృష్టించుకోవచ్చు. అదేవిధంగా వాట్సప్, స్నేహితులతో ముచ్చట్లు-వీటిలో కొంత సమయాన్ని ఆదాచేసి సృష్టించుకోవచ్చు.

ఇంగ్లీష్‌లో "స్టీలింగ్ టైమ్" అనే మరో పదం ఉంది. వేరొకరి సమయాన్ని మనమెలా దొంగిలించగలం? ఒక వ్యక్తికి 10 గంటలకు కలుస్తానని టైమిస్తాం. అతను 10 గంటలకు వస్తాడు. మనం తీరికగా 10-40కి వెళ్తాము. అంటే అతనికి 40 ని. మనం వృథా చేసాము. దీన్నే స్టీలింగ్ టైమ్ అంటారు.

ముందుగా అనుకొన్న సమయానికి కలవటం ద్వారా ఇతరుల సమయాన్ని దొంగిలించకుండా ఉండగలం. కానీ, మన సమయాన్ని ఇతరులు దొంగిలించకుండా జాగ్రత్త పడలేము.

ఎందుకంటే ఇతరుల అలవాట్లు మనం మార్చలేము కదా, **కానీ మన సమయాన్ని మన అలవాట్లు దొంగిలించకుండా మనం తప్పక జాగ్రత్తపడాలి.**

పనులు వాయిదా వేయడం (ప్రొక్రాస్టినేషన్), జరిగిపోయిన దానిగురించి, గతాన్ని ఎక్కువగా ఆలోచించడం (లివింగ్ ఇన్ ది పాస్ట్) చేయవలసిన పనులు, మనం పెట్టిన వస్తువుల స్థానం మరచిపోవడం (పర్‌గెట్‌ఫుల్‌నెస్) మన సమయాన్ని దొంగిలించే కొన్ని అలవాట్లు.

ఇక్కడ విన్‌స్టన్ చర్చిల్ గురించి చెప్పుకోవాలి. రెండుసార్లు బ్రిటన్ ప్రధానమంత్రిగా చేసారు. గొప్ప వక్త, రాజనీతిజ్ఞుడు, రెండవ ప్రపంచయుద్ధములో బ్రిటన్ మిలటరీనీ ఉత్తేజపరచి ఎలైడ్‌ఫోర్స్‌స్ విజయానికి నాజీ జర్మనీ ఓటమికి ప్రధాన కారకుడు. గొప్ప విజేతగా ప్రపంచంచే కీర్తించబడిన వ్యక్తి. ఒక ప్రెస్‌మీట్‌లో ఒక విలేఖరి అడిగాడు "మీరు జీవితంలో ఇంతగా ఎలా రాణించగలిగారు"? ఆయన ఒక్క వాక్యంలో సమాధానమిచ్చాడు...

"నేను తలదువ్వుకునేటప్పుడు కేవలం జుట్టు గురించి మాత్రమే ఆలోచిస్తాను" ఈ ఒక్క వాక్యంకోసం ఇంత రాయాల్సి వచ్చిందంటే ఈ వాక్యంలోని భావాన్ని, ఫిలాసఫీని మనందరం అర్థం చేసుకోవాలి.

"చేసే పనిమీద ధ్యాస"

దీనినే "మైండ్ ఫుల్‌నెస్" అంటారు. నగరాల్లో వేలకువేలు వసూలు చేసి, దీనిలో కోర్సులు కండక్ట్ చేస్తున్నారు–చర్చిల్ గారి గురించి ఇంకో విషయం చెప్పుకోవాలి. ఆయన బ్రిటన్ ఆర్మీలో పనిచేసారు. స్వాతంత్ర్యం రాక మునుపు ఆంగ్లేయ ఆర్మీ అధికారిగా సికింద్రాబాద్‌లో కూడా కొంతకాలం పనిచేసారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఆయన నివాసమున్న క్వార్టర్‌ముందు "ఈ ఇంట్లో చర్చిల్ నివాసముండేవారు" అని బోర్డు ఉంటుంది.

మనకు స్కూల్లో కాలేజీలో చదివేటప్పుడు ఒక ఫిక్స్‌డ్ టైమ్ టేబుల్ ఉంటుంది. జీవితానికి కూడా ఒక టైమ్ టేబుల్ ఉండాలి. ఉదాహరణకు ఒక వ్యక్తి ఉదయం 6–7

జిమ్‌లో, 8–8.30 బ్రేక్‌ఫాస్ట్, ఒంటిగంటకు లంచ్, సాయంత్రం 6–7 సోషల్ మీడియా, 8 గంటలకు డిన్నర్ అనుకుంటే సంవత్సరమంతా ఇదే టైమ్ టేబుల్ ఫాలో కావాలి. చూడటానికి ఛాదస్తంగా కనిపిస్తుంది గానీ విజేతలు తప్పక ఈ నియమం పాటిస్తారు.

ఎవరైనా సమయస్ఫూర్తిగా మాట్లాడినా, సరైన సమయానికి జోక్ పేల్చినా మంచి టైమింగ్" అంటాము. లైఫ్‌లో కూడా "టైమింగ్" కావాలి.

"రైట్ థింగ్స్ ఎట్ రైట్ టైమ్" అంటారు. 22–25 సంవత్సరాల వయసులో చదువులు పూర్తిచేసుకోవటం, ఉద్యోగంలో స్థిరపడటం, తరువాత రెండుమూడు సంవత్సరాలు బ్యాచిలర్ లైఫ్ ఎంజాయ్ చేయటం, ఆపై పెళ్ళి, పిల్లలు... రైట్ ఈవెంట్స్ ఎట్ రైట్ టైమ్ ఐనా, నలభై సంవత్సరాల వయసులో నాలుగు నెలల పసిపాపను ఎత్తుకోవటం ఏం బాగుంటుంది చెప్పండి.

**"ప్లాన్ యువర్ వర్క్, వర్క్ యువర్ ప్లాన్" అనే కోట్ కూడా నాకు చాలా ఇష్టం. కాలం ఆదా అవుతుంది. పనీ పూర్తవుతుంది.**

మీరు విద్యార్థి కావచ్చు, ఉద్యోగి కావచ్చు, గృహిణి కావచ్చు – ఎవరైనప్పటికీ కొన్ని దినచర్యలు ఉంటాయి. అంతేకాదు హాబీలు, కలలు, గమ్యాలు కూడా ఉంటాయి. వాటిని చిన్న చిన్న ముక్కలుగా విభజించుకోవాలి. దినచర్యలో భాగం చేయాలి. వారం, వారం నెలనెలా వాటిని సమీక్షించుకోవాలి. ఇలా చేయటం ద్వారా మన కలలను నిజం చేసుకోగలం. లేదంటే రేపు, మాపంటూ మన పనులన్నీ వాయిదా పడతాయి. కబుర్లు, కాలక్షేపం, టి.వి. మొబైల్ ఫోన్ ఫేస్‌బుక్‌లతో మన విలువైన కాలం, వృథా అయిపోతుంది. **కాలమంటే జీవితమే కదా!**

# బెంజమిన్ ఫ్రాంక్లిన్

**అ**మెరికా డాలర్ మీద ఉన్న తన ఫోటోతో ప్రపంచాన్నంతటిని ప్రతిరోజూ పలకరించే బెంజమిన్ ఫ్రాంక్లిన్ అమెరికా జాతి నిర్మాతల్లో ప్రథముడు అమెరికా ప్రజలచే మొదటి అమెరికన్‌గా గౌరవించబడి అమెరికా అధ్యక్ష పీఠంపై కూర్చొని అమెరికన్ల హృదయాలను గెలిచిన వ్యక్తి.

ఈయన ఎన్ని రంగాలలో ప్రావీణ్యం సంపాదించాడో తెలిస్తే ఆశ్చర్యపోతాం. ఒక్క మనిషికి ఒకే ఒక్క జీవితకాలంలో ఇన్ని సాధ్యమా అనిపిస్తుంది. ఈయన ఒక రచయిత, జర్నలిస్టు, శాస్త్రవేత్త, శాస్త్రపరికరాల ఆవిష్కర్త, దౌత్యవేత్త, రాజనీతిజ్ఞుడు, తత్త్వవేత్త, అమెరికా రాజ్యాంగ నిర్మాత, ఇంకా మరెన్నో...

ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాల మీద ఆధారపడి తరువాత కాలంలో విద్యుత్‌శక్తి కనుగొనబడింది. వాహనాల్లో వాడే స్పీడోమీటరు, బైఫోకల్‌లెన్స్, లైటెనింగ్ రాడ్స్ ఈయన కనుగొన్న పరికరాలలో కొన్ని.

ఒక్క మనిషి ఇన్ని రంగాల్లో ఇంతటి ప్రతిభ కనపర్చటానికి ఏకైక కారణం **క్రమం తప్పని ఈయన దినచర్యేనని ఆత్మకథలో రాసుకున్నారు.**

ప్రతిరోజూ ఉదయం 5గం.లకు నిద్రలేవడం 5 నుండి 8 గంటల మధ్య ధ్యానం, స్నానం, అల్పాహారం పూర్తి చేసుకోవటం, 8 నుండి 12 గం.లవరకు నాలుగు గంటలు పని, 12నుండి 2గం.ల వరకు భోజనం, పుస్తకపఠనం, పద్దులు చూసుకోవడం, 2నుండి సాయంత్రం 6వరకూ మరలా పనిచేసుకుంటూ 6 నుండి రాత్రి 10గం. వరకు సంగీతం వినడం, స్నేహితులు, అతిథులతో మాట్లాడడం....

ఈ విధంగా రోజూ 8గంటలు పని, 7గంటలు నిద్ర నాలుగుగంటలు స్నేహితులు, సంగీతం, వినోదం... కొన్ని దశాబ్దాలపాటు ఇదే దినచర్యతో ఒక అర్ధవంతమైన, విజయవంతమైన జీవితాన్ని జీవించారు.

**అంతేకాదు ప్రతి ఉదయాన్ని ఈరోజు నేనేం మంచిపని చేస్తాను అనే ప్రశ్నతో ప్రారంభించి, ప్రతి రాత్రి ఈ రోజు నేనేం మంచిపని చేశాను అని సమీక్షించుకునేవారు.** ఇంత చిన్న ఉపాయంతో ఎంత పెద్ద శిఖరాన్ని అధిరోహించారు మన బెంజమిన్ ఫ్రాంక్లిన్ (1706–1790)

# ఎల్లెన్ మస్క్

**బి**ల్‌గేట్స్, స్టీవ్‌జాబ్స్ లాగా అందరికీ పరిచయమైన పేరుకాకపోవచ్చు. కానీ ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా టైమ్స్ మ్యాగజైన్‌చే గుర్తింపబడి ఆ మ్యాగజైన్ కవర్‌పేజీ మీదనుండి ప్రపంచాన్ని పలకరించిన సృజనాత్మక ఆవిష్కర్త.

సామాన్యులకే కాదు అసమాన్యులకు కూడా అందని ఆలోచనా ధోరణి ఎల్లెన్ మస్క్‌ది. మనందరికి తెలుసు విమానమైనా, హెలీకాప్టర్ ఐనా గాలిలోకి ఎగురుతుంది, మరలా భూమిమీద లాండ్ అవుతుంది. కానీ, ఒక విమానంలా, ఒక హెలీకాప్టర్‌లా భూమి మీదనుండి ఆకాశంలో కెగిరి తిరిగి భూమిమీద లాండ్ అయ్యే రాకెట్‌లను ఆవిష్కరించాడు. ఈ టెక్నాలజీతో ప్రపంచంలోని ఏ నగరానికైనా ఒక గంటలో చేరుకునే రాకెట్ ప్రయాణ వ్యవస్థను ప్రారంభించి రైట్ బ్రదర్‌కి నిజమైన వారసుడు కాబోతున్నాడు.

అంతేకాదు మార్స్ (అంగారకుడు) మీదకు మనుష్యులను పంపే ప్రాజెక్ట్ మీద పరిశోధనలు ఈయన స్థాపించిన స్పేస్ - ఎక్స్ సంస్థ నిర్వహిస్తుంది. హైపర్‌లూప్ టెక్నాలజీతో గంటకు 1300కి.మీ. వేగంతో ప్రయాణించే రవాణా వ్యవస్థను మానవాళికి పరిచయం చేయటానికి ఇతను స్థాపించిన హైపర్ లూప్ సంస్థ సన్నాహాలు చేస్తుంది.

ఒక్క వ్యక్తి, ఒకే ఒక వ్యక్తి అత్యంత పిన్నవయసులోనే ఏం సాధించవచ్చో నిరూపించాడు. 12సం. వయసులోనే క్లిష్టతరమైన కంప్యూటర్ కోడింగ్ నేర్చుకొని తను చేసిన బ్లాస్టర్ ఆప్‌ను 500 డాలర్లకు అమ్మాడు. స్పేస్-ఎక్స్ స్థాపించినప్పుడు అతని వయసు కేవలం 30 సంవత్సరాలు మాత్రమే.

ఎటువంటి కుటుంబ నేపథ్యం లేకపోయినా పిన్న వయసులోనే అద్భుతాలు సృష్టించి ప్రగతికి పేదరికం అడ్డుకాదని మరోసారి నిరూపించాడు.

దక్షిణ ఆఫ్రికాలో జన్మించి 17 సంవత్సరాల వయసులో కెనడా, అక్కడినుండి అమెరికా వెళ్ళి ఇంజనీరింగ్ చదివాడు. కళ్ళనిండా కలలు, మనసునిండా ఆశలు,

గుండెల్లో ధైర్యాన్ని నింపుకొని తన ప్రగతికి మాత్రమేకాక మానవాభ్యుదయానికి చేయూతనిచ్చే కొత్త ప్రణాళికలు రచిస్తున్నాడు.

అతని కంపెనీ టెస్లాలో తయరుచేసిన బాటరీకారు ఒక్కసారి చార్జ్ చేస్తే వెయ్యి కిలోమీటర్లు ప్రయాణం చేస్తుంది. మోడల్ ఎస్ పేరుగల ఈ కారు రోడ్డు భద్రతలో ప్రపంచంలోనే మొదటిస్థానాన్ని సాధించింది.

పర్యావరణ పరిరక్షణ కోసం సోలార్ పానెల్స్ తయారుచేసే సోలార్ సిటిని (సౌరశక్తి) పది సంవత్సరాల క్రితమే స్థాపించాడు.

అందరూ కృత్రిమ మేదస్సు (ఎ.ఐ) వైపు పరుగులు తీస్తుంటే, కృత్రిమ మేదస్సు వలన మానవాళికి జరుగబోయే నష్టాన్ని ముందుగానే ఊహించి దానిని నిరోదించటానికి న్యూరాలింక్ అనే కొత్త ప్రాజెక్టును ప్రారంభించాడు.

రోజుకు ఒక్క డాలరుతో జీవించిన మస్క్ సంపద ఈ రోజు లక్షా ముప్పైవేల కోట్లు. కేవలం 48 సంవత్సరాల వయసులో మస్క్ ఇంత ప్రగతిని ఎలా సాధించాడు. మస్క్ సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటాడో తెలుసుకుందాం.

**రోజుకు 12 నుండి 14 గంటలు పనిచేసే మస్క్ ప్రతి గంటను ఐదేసి నిముషాల బ్లాక్‌గా విభజించి ప్రతి ఐదు నిమిషాలకు తనేం చేయాలో ముందుగా ప్రణాళిక వేసుకుంటారు.** రోజుకు ఖచ్చితంగా ఆరుగంటలు నిద్రపోతారు. వారంలో కనీసం రెండుసార్లు ట్రెడ్‌మీల్, బరువులు ఎత్తడం వంటి వ్యాయామాలు తప్పనిసరి. అదేవిధంగా కొంత సమయం పుస్తకాలు (ఆత్మకథలు) చదువుతారు.

ప్రతి సోమ, గురువారాలు స్పేస్ –ఎక్స్‌కు (రాకెట్స్) మంగళ, బుధవారాలు టెస్లాకు కేటాయిస్తారు. శుక్రవారం ఒక పూట స్పేస్ –ఎక్స్ మరోపూట టెస్లా. లేదా న్యూరోలింక్ కృత్రిమ మేదస్సుకు కేటాయిస్తారు. ప్రతి శనివారం తన ఐదుగురు కుమారులతో గడపటానికి ఆదివారం విహారాలకు కేటాయిస్తారు. **ప్రణాళికాబద్ధ జీవితాన్ని గడుపుతూ సమయాన్ని సమంగా పంచుతూ అందరికీ, అన్నిటికీ న్యాయం చేస్తారు ఎలాన్‌మస్క్.**

# మోక్షగుండం విశ్వేశ్వరయ్య

ప్రపంచ ప్రఖ్యాత ఇంజనీరు, మేధావి, దేశభక్తుడు, నవభారత నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించిన మహనీయుడు – ఈయన పుట్టినరోజును ఇంజనీర్స్‌డేగా దేశం అంతా ఘనంగా జరుపుకుంటాము.

అత్యంత పేద కుటుంబంలో పుట్టి స్వయంకృషితో ఉన్నత శిఖరాల కెదిగిన స్ఫూర్తిదాయక జీవితం ఈయనది.

విశ్వేశ్వరయ్య పూర్వీకులు ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లాలోని మోక్షగుండం నుండి అప్పటి మైసూర్ రాష్ట్రానికి వలసవెళ్ళారు. ఇంజనీరింగ్ చదువు పూర్తయిన తరువాత అప్పటి బొంబాయి ప్రభుత్వంలో అసిస్టెంట్ ఇంజనీరు నుండి చీఫ్ ఇంజనీరు వరకు ఎన్నో పదవులు నిర్వహించారు.

ప్రజాపనుల శాఖలో అవినీతిరహితంగా ఉద్యోగం చేయటమే కాక ఎన్నో కొత్త ప్రాజెక్టులు డిజైన్ చేసి నిర్మాణం చేపట్టారు. పూణెలో ఆయన పరిచయం చేసిన బ్లాక్ సిస్టమ్ ఆఫ్ ఇర్రిగేషన్, ఆటోమేటిక్ స్లూయిస్ గేట్లు ఆయనకు ఎంతో గుర్తింపు తెచ్చాయి. పూనా, గోవాలతో పాటు ఎన్నో నగరాలకు తాగునీటి సరఫరా ప్రణాళికలు మరియు డిజైన్‌లు సిద్ధం చేసారు.

1908లో వరదనీటిలో హైదరాబాద్ మునిగిపోయి 2000మంది ప్రజలు మరణించారు. నిజాం నవాబు అభ్యర్థన మేరకు ఆయన మూసీ, ఈసీ నదులు పరిశీలించారు. ఆ వరద ఉధృతిని శాశ్వతంగా తగ్గించటానికి మూసీనదికి ఉస్మాన్‌సాగర్, ఈసీనదికి హిమయత్ సాగర్ రిజర్వాయర్లను నిర్మించాలని సూచించారు.

తిరుమల తిరుపతి ఘాట్‌రోడ్డు, వేంకటేశ్వరా యూనివర్శిటీ ఆడిటోరియం ఆయన ఇచ్చిన డిజైన్ మీద నిర్మించబడ్డాయి. విశాఖపట్నం ఓడరేవును సముద్రపు కోత నుండి రక్షించే పరిష్కారమార్గాలు అందించారు.

90 సంవత్సరాల వయసులో ప్రదాని నెహ్రూ కోరిక మేరకు గంగానదిపై పాట్నా వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు- మైసూర్ స్టేట్ దివాన్‌గా పారిశ్రామిక, ఆర్థిక రంగాలలో మైసూర్ ప్రగతికి పునాదులు వేసారు.

అందరి విజేతల్లాగానే విశ్వేశ్వరయ్య కూడా కాలానికి విలువనిస్తూ ప్రణాళికా బద్ధమైన జీవితం గడిపేవారు. **కొన్ని దశాబ్దాలపాటు ఒకే దినచర్య అమల్లో ఉండేది.** విశ్వేశ్వరయ్య మ్యూజియంలో ఆయన రాసుకున్న దినచర్య పదిలపరచబడింది. 25 సంవత్సరముల వయసులో ఆయన దినచర్య ఇలా ఉండేది. ఉదయం 5-7.30 వరకు పారాబోలా గురించి చదివి ఉపయోగపడే ఫార్ములాలు రాసుకోవాలి. 7.30 నుండి 9.00 వరకు వ్యక్తిగతమైన పనులు, 9.00 నుండి 12.00 వరకు ఆఫీసుపని, 12.00 నుండి 12.30 భోజనం, ఈ విధంగా ఈ దినచర్య కొన్ని సంవత్సరాల వరకు కొనసాగింది.

అంతేకాదు, 95 సంవత్సరముల వయసులో కూడా ఈయనకు నిర్దిష్ట దినచర్య ఉండేది. ఉదయం ఏడుగంటలకు అల్పాహారం, 7.30 నుండి 12.30 వరకు గ్రంథ పఠనం, అధ్యయనం మరియు సంబంధించిన పనులు సాయంత్రం 3 నుండి 5 గంటల వరకు ఉత్తర ప్రత్యుత్తరాలు, సాయంత్రం 5 గంటలకు నడక, 8 గంటలకు డిన్నర్, 9 గంటలకు వార్తా పత్రికలు.... ఈ విధంగా ఆయన దినచర్య ఉండేది.

అట్టడుగు స్థాయి నుండి ప్రపంచ ప్రఖ్యాత ఇంజనీరుగా ఎదిగి "భారతరత్న"గా గౌరవించబడి పూర్తి ఆరోగ్యంతో ఆయన శతజయంతి ఉత్సవాల్లో ఆయన కూడా పాల్గొన్నారు. బెంగళూరులో జరిగిన ఈ ఉత్సవాల్లో ప్రధాని హోదాలో నెహ్రూగారు పాల్గొన్నారు. **ఈ విజయాలకు, ఈ వైభవానికి బహుశా క్రమబద్ధమైన ఈయన దినచర్య కూడా కారణమై ఉండవచ్చు.**

మూడవ సూత్రం

# 3. గెలుపంటే ఓటమితో నిరంతర సహవాసం

"నెవర్ గివ్ అప్" దీనికి స్పష్టమైన తెలుగు అనువాదం నా దగ్గర లేదు. కానీ దేనిని మధ్యలో మానవద్దని దీని భావం. రెగ్యులర్‌గా జిమ్‌కి వెళ్లాలనుకుంటాము. నెలకు రెండువేలు ఫీజు–డిస్కౌంట్‌తో పదివేలు కడితే సంవత్సరమంతా జిమ్ సౌకర్యం ఉపయోగించుకోవచ్చు అని ప్రకటన చదువుతాము. పదివేలు కట్టేస్తాము. పదిరోజులు ఎంతో ఉత్సాహంతో క్రమం తప్పకుండా వెళ్తాము. తరువాత ఒకరోజు బద్ధకిస్తాము. మరలా ఒకమూడు రోజులు వెళ్తాము. మూడు రోజులు మానేస్తాము. ఇలా ఒక నెలరోజులలో జిమ్ సంగతే మర్చిపోతాము. దీనినే ఆరంభశూరత్వం అంటారు.

ఇది మన తెలుగు వారికి మరీ ఎక్కువ. ప్రతియేడు నూతన సంవత్సర ఆరంభంలో మనం తీసుకునే ప్రతిజ్ఞలన్నీ ఈ విధంగానే నీరుకారిపోతాయి.

ఇక కొన్ని విషయాల్లో ఆసక్తిని కోల్పోయి మధ్యలో మానేస్తాము. స్విమ్మింగ్ నేర్చుకుంటూ మధ్యలో మానివేయటం, ఎంతో ఉత్సాహంగా టెన్నిస్ నేర్చుకుందామని ఖరీదైన రాకెట్‌కొని మధ్యలో మానివేయటం ఈ కోవకే చెందుతాయి.

ఇలా దేన్ని సీరియస్‌గా కొనసాగించేలేకపోవటం కాలక్రమేనా ఒక అలవాటుగా మారి ఒక జీవన విధానంగా తిష్టవేస్తుంది. వ్యక్తిత్వాన్ని భ్రష్టుపట్టిస్తుంది.

తెలుగులో మంచి పద్యం ఉంది. దాని భావం "అధములు అసలు ఆరంభించరు. మధ్యములు మధ్యలో ఆపేస్తారు. కేవలం ఉత్తములు మాత్రమే అనుకున్న పనిని చివరిదాకా కొనసాగించి విజయం సాధిస్తారు".

"నెవర్ గివ్ అప్" మూడు తరహా వ్యక్తులకు వర్తిస్తుంది. ఆరంభ శూరత్వంలో ప్రారంభించిన వెంటనే వదిలేసేవారు. మొదటి తరహా, కొంతకాలం కొనసాగించి వదిలేసే వారు రెండవి తరహా ఓడిపోయి వదిలేసేవారు రెండవ తరహా ఈ మూడవ తరహా గురించి ఇప్పుడు మాట్లాడుకుందాం.

చీకటి ఉండబట్టే వెలుగు విలువ మనకు తెలుస్తుంది. అలాగే ఓటమి వలననే గెలుపుకు గుర్తింపు వస్తుంది. చీకటి వెలుగులు, గెలుపు ఓటములు జంటపదాలు అంతే కాదు, జంట ప్రయాణికులు కూడా.

అందరికీ తెలిసిన కొటేషనే "ఫెయిల్యూర్స్ ఆర్ స్టెప్పింగ్ స్టోన్స్ టు సక్సెస్" ఓటమి మెట్లు ఎక్కుకుంటూ గెలుపుగమ్యాలు చేరుకోవాలి. – అంటే ఏమిటి? ఓటమి నుండి గుణపాఠాలు నేర్చుకోవాలి. ఓటమి మనలో గెలిచితీరాలనే కసిని రేపాలి.

విజేతల జీవితాలను చదువుతుంటే వాటినిండా ఓటములే ఉంటాయి. కానీ, అంతిమంగా విజయం సాధిస్తారు. జీవితంలో అడుగడుగునా ఓడిపోతూ కూడా అంతిమంగా అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించి చరిత్రలో తన పేరు చిరస్థాయిగా నిలుపుకున్న అబ్రహం లింకన్ కథ మనందరికీ తెలిసిందే.

ఓటమితో నిరంతర చెలిమి చేస్తూ కూడా తమ పోరాటాల్ని మధ్యలో విరమించకుండా గెలిచి నిలిచిన ముగ్గురు విజేతల గురించి తెలుసుకుందాం. ఒకరు అంతర్జాతీయ వ్యాపారవేత్త జాక్‌మా, ఇంకొకరు నటి వాణిశ్రీ మరొకరు హరీపోటర్ రచయిత్రి రౌలింగ్.

# జాక్‌మా (ఆలీబాబా డాట్ కామ్)

**ఓ**టమి.. ఓటమి.. ఓటమి.. ఓటమి... ఓటమి–ఇలా జీవితమంతా ఓటములను ఎదుర్కొంటూ కూడా తన పోరాటాన్ని కొనసాగించి, అంతిమంగా విజయం సాధించిన వ్యక్తి గురించి చెప్పుకోవాల్సి వస్తే, మనకు గుర్తొచ్చే మొదటి వ్యక్తి "అబ్రహం లింకన్".

అమెరికా 16వ అధ్యక్షుడిగా, ఆ అధ్యక్షపీఠానికి గౌరవాన్ని తెచ్చిన అత్యుత్తముల్లో లింకన్ ప్రథముడు. శతాబ్దాలుగా అత్యంత హీనమైన జీవితాన్ని జీవిస్తున్న నీగ్రోబానిసల విముక్తికి బాటలు పరచిన నేతగా, అంతర్యుద్ధం నుండి అమెరికాను రక్షించిన అధ్యక్షుడుగా లింకన్ చరిత్రలో నిలిచిపోయాడు.

ఈయన 'గొలుసు ఓటమి' మనందరికి తెలిసిందే అయినా మరోసారి ఈయన జీవితంలో విషాదాలు, ఓటములు తెలుసుకొందాం. లింకన్ ఏడు సంవత్సరాల వయసులో ఇల్లు కోల్పోయి కుటుంబం మొత్తం రోడ్డున పడింది. లింకన్ తొమ్మిది సంవత్సరాల వయసులో తల్లి చనిపోయింది. 23 సంవత్సరాల వయసులో ఉద్యోగాన్ని కోల్పోయాడు. అదే సంవత్సరం స్టేట్ లెజిస్లేచర్ ఎన్నికలలో పోటీచేసి ఓడిపోయాడు. తరువాత సంవత్సరం వ్యాపారాన్ని ప్రారంభించాడు. భారీ నష్టంతో వ్యాపారం మూతపడింది. ఆ వ్యాపారానికి చేసిన అప్పు తీర్చటానికి మరో పదిహేడు సంవత్సరాలు పట్టింది.

ఇరవై ఆరు సంవత్సరాల యవ్వనంలో తనకు ప్రియాతిప్రియమైన భార్య చనిపోయింది. పిమ్మట తీవ్రమైన మానసిక ఒత్తిడికి, కుంగుబాటుకు చికిత్స తీసుకున్నాడు. 29 సంవత్సరాల వయసులో స్టేట్ లెజిస్లేచర్ స్పీకర్ పదవికి పోటీచేసి ఓడిపోయాడు. 34 సంవత్సరాల వయసులో కాంగ్రెస్ నామినేషన్‌కు ప్రయత్నించి ఓడిపోయాడు. ఐదు సంవత్సరాల తర్వాత ఇదే పదవికి మరలా ప్రయత్నించి మరలా ఓడిపోయాడు. నలభై సంవత్సరాల వయసులో లాండ్ ఆఫీసర్ పదవికి ప్రయత్నించి విఫలమయ్యాడు.

45 సంవత్సరాల వయసులో యు.ఎస్.సెనెటర్‌గా ఓడిపోయాడు. 47 సంవత్సరాల వయసులో ఉపాధ్యక్షపదవి అభ్యర్థిగా ఓడిపోయాడు. రెండు సంవత్సరాల తర్వాత సెనెటర్ ఎన్నికల్లో తిరిగి ఓడిపోయాడు.

1880లో అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికై అప్పటి వరకు ఆయన్ను ఓడించిన ప్రతి ఓటమిపై అంతిమ విజయం సాధించాడు. అంతేకాదు, అత్యుత్తమ అధ్యక్షుడిగా నిలిచాడు.

ప్రస్తుత మన హీరో ఆలీబాబా డాట్ కామ్ అధినేత జాక్‌మా ఓటమి గాథ తెలుసుకుందాం- ఈయన చైనాలోని హంగ్ జూ నగరానికి దగ్గరల్లో 15-10-1964లో ఒక నిరుపేద కుటుంబంలో పుట్టాడు. వారు ఎంత పేదవారో మనకు తెలియదు కానీ, ఆయన ఒక ఇంటర్వ్యూలో చెప్పారు "సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే మేము చికెన్ తినగలిగేవారం".

సరే, ఈయన ఓటమి పరంపర గురించి తెలుసుకుందాం! నాలుగవ తరగతి రెండుసార్లు తప్పాడు. ఎనిమిదవ తరగతి మూడుసార్లు. అంతేనా, గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ ఐదుసార్లు తప్పాడట. అతికష్టం మీద అంతగా డిమాండ్‌లేని కాలేజీల్లో డిగ్రీ సీటు సంపాదించి గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాడు. ఇక ఉద్యోగ వేటలో పడ్డాడు. ఇక్కడ కూడా ఐరన్ లెగ్ అని నిరూపించాడు, ఎలాగంటారా-

ఒక ముప్పయ్ జాబ్ ఇంటర్వ్యూలలో ఇతన్ని తిరస్కరించారు. పోలీస్ ఉద్యోగానికి అప్లై చేసాడు. ఫైనల్ రౌండ్‌లో ఇతనితో కలిసి ఐదుగురు నిలిచారు. ఫైనల్ సెలక్షన్‌లో ఇతన్ని వదిలేసి మిగిలిన నలుగురికి ఉద్యోగం ఇచ్చారు. ఒక ఫైవ్‌స్టార్ హోటల్లో ఉద్యోగాలు ఉన్నాయని తెలిసి ఇతను, ఇతని కజిన్ ఇంటర్వ్యూకి వెళ్తారు. వాళ్లు ఇతని కజిన్‌ని సెలెక్ట్ చేసుకొని ఇతన్ని ఇంటికి పంపించారు. చివరికి కె.ఎఫ్.సిలో చిన్న జాబ్ ఇంటర్వ్యూకి వెళ్తే, వచ్చిన 20 మందిలో జాక్‌మా తప్ప మిగిలిన వారందరూ సెలెక్ట్ అవుతారు. అసలు మనవాడి వాస్తు దోషమేమిటో? జాక్ మాకు హార్వార్డ్ యూనివర్సిటీలో చదువుకోవాలని చాలా మోజు. సుమారు పదిసార్లు అడ్మిషన్ కోసం అప్లై చేస్తే పదిసార్లు రిజెక్ట్ అయాడు. ఏదైనా వ్యాపారం చేద్దామని లోనుకోసం కూడా

ప్రయత్నించాడట. వెంచర్ కాపిటలిస్ట్ల వద్ద ఈయన అభ్యర్థన 30 సార్లు రిజెక్ట్ అయ్యిందట.

ఇంతకీ ఈయన ఫెయిల్యూర్స్ గురించి ఈయనేమంటాడో విందాం- "నేను ఎప్పటికైనా ఒక పుస్తకం రాస్తే ఆ పుస్తకం పేరు ఆలీబాబా-1001 తప్పులు. అంతేకాదు, ఎదుటివారి విజయాల వలన మనకేమీ ప్రయోజనం లేదు, వారి ఓటమి నుండే మనం పాఠం నేర్చుకోవాలి అంటారు. ఓటమిని ఇంతగా హత్తుకున్న జాక్మా ప్రస్తుత స్థితి ఏమిటి-చైనాలో అత్యంత ధనవంతుడు... నేను జోక్ చేయట్లేదండి... 1999లో ఆయన స్థాపించిన ఆలీబాబా డాట్ కామ్, ఆన్లైన్ ఈ-కామర్స్ సంస్థ ప్రభంజనం సృష్టించింది. 2014లోనే ఈ సంస్థ ఆస్తులు 40 బిలియన్ డాలర్లు. ఆలీబాబా అద్భుత దీపంలో మాంత్రికుని వరంలా ఈ సంస్థ ఊహించని లాభాలు సాధించింది-ఇంతకీ జాక్మా జైత్రయాత్ర ఎలా సాధ్యమైంది?

జాక్మా జాతకం చైనీస్ భాషలో అంత బాగున్నట్లు లేదు. అందుకే ఇంగ్లీష్ భాషలో జాతక చక్రాన్ని తిరిగి రాసుకున్నాడు. ప్రపంచాన్ని గెలవాలంటే ఇంగ్లీష్ భాష ఆవశ్యకతని అర్థం చేసుకున్నాడు. ఇంగ్లీష్ పట్ల మక్కువ పెంచుకున్నాడు. ఇంగ్లీష్ భాష నేర్చుకోవడానికి విదేశీ ప్రయాణికులకు ఉచితంగా గైడ్గా వెళ్లేవాడు. ఈ పనికోసం రోజూ ఇరవై కిలోమీటర్లు సైకిల్ తొక్కి హంగ్ జూ నగరానికి వెళ్లేవాడు, ఇలా సుమారు పది సంవత్సరాలు ఈ జీతం లేని ఉద్యోగం చేసాడు. తరువాత కొంతకాలం ఇంగ్లీష్ టీచర్గా పనిచేశాడు. ఇంగ్లీష్ భాషాపరిజ్ఞానం అతనికి ప్రపంచాన్ని వీక్షించే అవకాశం కల్పించింది. అతని భవిష్యత్ వీక్షణం బలమైన చైనావాల్ పరిధులు దాటి ప్రవహించటం ప్రారంభించింది.

1995లో ఒక బిజినెస్ గ్రూప్తో కలిసి అమెరికా పర్యటించే అవకాశం లభించింది. అమెరికాలో మొదట ఇంటర్నెట్ గురించి తెలుసుకున్నాడు. ఇంటర్నెట్లో చైనాకు సంబంధించిన ఎటువంటి సమాచారం లేదని గమనించాడు. వెంటనే 1.2లక్షల పెట్టుబడితో చైనా పేజెస్ అనే వెబ్సైట్ ప్రారంభించాడు. ఇది మంచి ప్రజాదరణ పొందింది. 1999లో కొంతమంది మిత్రులను కలుపుకొని 36 లక్షల పెట్టుబడితో ఆలీబాబా డాట్ కామ్ ఈ-కామర్స్ సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ఒక ప్రభంజనంలా

ప్రపంచమంతా విస్తరించింది. ఈ రోజు లక్షల కోట్ల వ్యాపారం నిర్వహిస్తుంది. ఇతను నడుపుతున్న ఆలీపే ఆన్‌లైన్ పేమెంట్ సంస్థ 200 దేశాలలో 30 కోట్ల మందికి నమ్మకమైన సేవలందిస్తుంది. ఇలాంటి ఇంకెన్నో సంస్థలను జాక్‌మా నిర్వహిస్తున్నాడు.

జాక్‌మా విజయానికి మూలకారణం భవిష్యత్ దర్శనం. పది సంవత్సరాల తరువాత జరిగేది ఇప్పుడే ఊహించగలగడం. **ఏపనైనా తలపెడితే మొదటిరోజు ఇష్టంగా ఉండకపోవచ్చు.**

**రెండోరోజు కూడా కష్టంగానే ఉండవచ్చు, కానీ మూడోరోజు మనం తప్పక ఆ పనిని ఇష్టపడతాం. కొనసాగిస్తాం అంటారు జాక్‌మా. మనం నమ్మాలి మరి.**

# హీరోయిన్ వాణిశ్రీ

ఎక్కడో చిన్న పల్లెటూరులో పుట్టిపెరిగిన వాణిశ్రీకి సినిమాలంటే పిచ్చి ప్రేమ. రోజుకో సినిమా చూడకపోతే ఆమెకు ఏమీ తోచేదికాదు. చూసిన సినిమాను పదేపదే పదిసార్లు చూస్తేకానీ తృప్తి ఉండేదికాదు.

ఆమె టీనేజ్‌కి రాగానే ఆ ఊళ్ళో అందరూ ఆమెను కన్నార్పకుండా చూసే వాళ్లు. అందరు ఆడవాళ్లలాగే నేనే ఈ ప్రపంచంలో నెంబర్‌వన్ అందగత్తెను అనుకుంది. అనుకుందే తడవుగా హీరోయిన్ కావాలని అనుకుంది. ఇంట్లో ఒప్పుకోలేదు. కాని పేదరికం అలాంటిది. ఆమె ఎలాగో పెద్దగా చదువుకోలేదు. ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే సినిమాల్లో చేరమన్నారు.

ఎన్నో ఆశలతో వాణిశ్రీ మద్రాసుకు వెళ్లింది. ఆమె అందం చూసి తెలుగు సినిమా రంగం రెడ్‌కార్పెట్ పరిచి లక్షలు కురిపిస్తారు అనుకుంది. కాని అది ఎంతటి భ్రమనో తెలిసింది. స్టూడియోలకు వెళ్లబోతే వాచ్‌మెన్‌లు గేట్ దగ్గరే ఆపేశారు... నిర్మాతల, దర్శకుల ఇళ్లకు వెళ్లింది. గడప ముందే నుంచోబెట్టి తమ సినిమాల్లో వేషాలు లేవని ముఖంమీదే చెప్పారు. ఆమె దిగిన ఫొటోల ఆల్బం చూసేందుకు కూడా ఎవ్వరూ ఆసక్తి చూపలేదు. అసలే ఆమె నలుపు. చివరికి ఓ ప్రముఖ నిర్మాత 'నీ ముఖానికి హీరోయిన్ వేషం ఎవడిస్తారని ఆ నలుపు ముఖాన్ని ఓసారి అద్దంలో చూసుకో. నువ్వు జూనియర్ ఆర్టిస్ట్‌గా (అంటే జనంలో నుంచునే ఆర్టిస్ట్) కూడ పనికిరావు" అని తిట్టాడు.

ఆ అవమానం వాణిశ్రీని చాలా కృంగదీసింది. అప్పటి వరకు తాను జమునకంటే గొప్ప అందగత్తెనని మురిసిపోయేది. ఆమెనే కాదు ప్రతి స్త్రీ కూడా తనను మించిన అందగత్తే ఈ భూమ్మీద మరొకరు లేరని అనుకుంటారు. అది దేవుడు ఆడవాళ్ళకిచ్చిన గొప్ప వరం. అందులో తప్పులేదు. మద్రాసుకు వచ్చి నెలలు దాటుతున్నా చిన్న వేషం కూడా దొరకలేదు. పస్తులుండే పరిస్థితి. అది మన ఊరికాని ఊరు. తెలిసిన వాళ్ళు ఎవ్వరూ లేరు. బతకడం కష్టంగా మారింది. చివరికి నిలువనీడకూడా లేదు. ఆమెనే

కాదు, అలా పగటికలలుకని మద్రాసుకు వచ్చిన వాణిశ్రీలు కోకొల్లలుగా ఉన్నారనే వాస్తవాన్ని తెలుసుకుంది.

చివరికి సినిమాలో అంట్లుతోమే ప్రొడక్షన్ గర్ల్‌గా పనిచేయాలని నిర్ణయించుకుంది. రెండు పూటల భోజనం దొరికితే చాలనుకునే దుస్థితి.

ఓ సినిమా కంపెనీకి వెళ్లి ఏదో ఒక పని కల్పించమని వేడుకుంది. ఆ ప్రొడక్షన్ మేనేజర్ వాణిశ్రీని ఎగాదిగా చూసి "మరీ అంట్లుతోమే ఉద్యోగం వద్దులే మా కంపెనీలో జూనియర్ ఆర్టిస్ట్‌గా చేరు, మహారాణికి విసనకర్ర ఊపే చిన్న వేషం ఇప్పిస్తాను, డైలాగులు ఉండవు. రోజుకు ఎన్ని గంటలైనా నిలుచుని విసనకర్ర ఊపాలి" అన్నారు.

వాణిశ్రీ సంతోషంగా ఒప్పుకుంది. ఒక్క షాట్‌తోనైనా తెరమీద కనిపిస్తే చాలనుకుంది.

కాని కర్మకాలి ఆ సినిమా ఎవరిదోకాదు, అంతకుముందు ఆమెను తిట్టిన ప్రముఖ నిర్మాతదే. వాణిశ్రీ చెలికత్తెగా విసనకర్ర ఊపుతూ మహారాణి పక్కన నిలుచుంది. ఆ నల్లముఖానికి ఎన్ని లైట్లు వేసినా కనిపించి చావదు. ముందా అమ్మాయిని బయటికి పంపించండి" అని అరిచాడు.

వాణిశ్రీకి ఏడుపు ఆగలేదు. "చెలికత్తెలు నల్లగా ఉండకుండా మహారాణిలా ఉంటారా... పర్వాలేదు... ఆమె చూడ్డానికి బాగానే వుంది. ఉండనివ్వండి" అని కెమెరామెన్ అన్నాడు.

వాణిశ్రీ సంతోషానికి అవదులు లేవు. అక్కడి నుంచి జూనియర్ ఆర్టిస్ట్‌గా చిన్న వేషాలు వేస్తూ పొట్టపోసుకుంటోంది.

సెట్‌లో అందరికంటే ముందు జూనియర్ ఆర్టిస్ట్‌లు వచ్చి కూర్చోవాలి. ఆ గుంపులో గోవిందలా వాణిశ్రీ పొద్దుటే స్టూడియోకి వచ్చేది. ఆ నలుపురంగు... దిట్టంగా మేకప్ వేసేది. ఆరోజుల్లో ఎవరి మేకప్‌లు వాళ్లు వేసుకునేవారు.

జూనియర్ ఆర్టిస్ట్‌లలో చాలామందికి నటన రాదు. ఒక్కొక్కసారి చెప్పినట్లు చేయకుండా మెయిన్ ఆర్టిస్ట్‌లను ఏడిపిస్తుంటారు. కానీ వాణిశ్రీ అలాకాదు. హీరోయిన్‌గా కలలుకని అప్పటికే సావిత్రి, జమున, అంజలీదేవి, కన్నాంబలను అనుసరించేది.

కాబట్టి ఆమెకు ఏ చిన్న డైలాగ్ ఇచ్చినా సింగిల్‌టేక్‌కి ఒకే అయ్యేది. ఓ మంచి డైలాగుంటే ముందుగా వాణిశ్రీకి ఇచ్చేవారు. అలా జూనియర్ ఆర్టిస్ట్‌లలో ఆమె నెంబర్‌వన్‌గా ఎదిగింది. దర్శకనిర్మాతల దృష్టిలో పడింది.

కొంచెం నటించే స్కోపుండి, నాలుగు డైలాగులుండే వేషాలు వాణిశ్రీని వరించాయి. ఆ తరువాత ఆమె బాగా నటించగలదు అనే భావాన్ని అందరిలో కలిగించింది. అక్కడి నుండి వంటమనిషి పాత్రలు, గయ్యాళి పాత్రలు, కామిడి పాత్రలు రాగలిగాయి. ఏ పాత్ర ఇచ్చినా అందులో ఇమిడిపోయి సింగిల్ టేక్‌లో నటించేది.

అప్పట్లో చాలా తక్కువ బడ్జెట్‌లో వచ్చే సినిమాలలో రాజబాబు పక్కన కామెడి పెయిర్ వాణిశ్రీకి స్థానం కల్పించారు. ఇంకా అప్పటికి రమాప్రభతో రాజబాబు జతకట్టలేదు. అప్పటికే రాజబాబు పక్కన గిరిజారాణి నటించేది. ఆ స్థానం వాణిశ్రీకి దక్కింది. నటనతో రాజబాబును మరిపించేది.

ఆ తరువాత చిన్న సినిమాలు సుఖదుఃఖాలు సినిమాలో చంద్రమోహన్‌కి చెల్లెలిపాత్ర వచ్చింది. దేవులపల్లి రాసిన ఇది మల్లెల వేళయనీ–ఇది వెన్నెల మాసమనీ” పాటకు ఆమె ప్రాణం పోసింది. ఆ పాటతోపాటు వాణిశ్రీ కెరియర్ కూడా మలుపు తిరిగింది. కె.విశ్వనాథ్, బాపుల చేతిలో పడి రాటుదేలింది.

అదే చంద్రమోహన్‌తో హీరోయిన్‌గా జతకట్టింది. అక్కడి నుంచి చిన్నహీరోల పక్కన పెద్ద హీరోయిన్‌గా ఎదిగింది. ఇంకా బ్లాక్ అండ్ వైట్ సినిమాల్లో ‘జీవితచక్రం’ సినిమాలో ఎన్.టి.ఆర్.పక్కన హీరోయిన్‌గా నటించింది....

ఆ సినిమాలో శారదతో పోటీపడి నటించింది అని అందరూ మెచ్చుకున్నారు. అంతే! ఆ తరువాత నాగేశ్వర్రావు, శోభన్‌బాబు, కృష్ణ, శివాజి గణేషన్, ఎం.జి.ఆర్ లాంటి అందరు అగ్రహీరోల సరసన అగ్రనాయికగా ఎదిగింది. ఆమెకు అందంలేదు– కాని ఆకర్షణ, ప్రతిభ ఉన్నాయి. అందుకే తెలుగు, తమిళ చిత్రాలలో అగ్రనాయికగా ఎదిగింది. ఇప్పటి వరకు ఏ హీరోయిన్ తీసుకోని అధిక పారితోషికం తీసుకుంది.

చివరికి ఏ నిర్మాత ఐతే ఆమెను తిట్టాడో, అతనే ఆమె ఇంటికొచ్చి సారి చెప్పి హీరోయిన్‌గా బుక్ చేసుకున్నాడు. వాణిశ్రీ డేట్లు లేక ఎన్.టి.ఆర్, ఎ.ఎన్.ఆర్, జెమినిగణేష్, శివాజి గణేషన్ లాంటి అగ్రహీరోలు కూడా పడిగాపులుగాసిన రోజులున్నాయి.

**ప్రతి ఓటమి నుండి ఆమె పాఠం నేర్చుకుంది. నిరాశ చెందలేదు. పోరాటం మధ్యలో విరమించుకోలేదు. అంతిమంగా గెలుపును గెలుచుకొంది. ఒప్పుకుంటారు కదూ!**

# జె.కె.రౌలింగ్ (హేరీ పోర్టర్ రచయిత్రి)

"నువ్వు టీచర్‌గా పనికిరావు, పిల్లలను అదుపుచేయటం నీకు చేతకాదు, పిల్లలను బుజ్జగించి ఎలా చదువుచెప్పాలో నీకు అస్సలు తెలియదు. అసలు నువ్వు టీచర్‌గా పనికిరావు. మా బడిలోనే కాదు–మరో బడిలోకూడా టీచర్‌గా ఉద్యోగం చేయడానికి ప్రయత్నించకు" అని కోపంతో డిస్మిస్ లెటర్‌ని జె.కె.రౌలింగ్ ముఖాన కొట్టాడు ప్రిన్సిపాల్.

జె.కె.రౌలింగ్ మళ్లీ రోడ్డుమీద పడింది. అది కొత్తకాదు. ప్రతి ఆరునెలలకు ఓ బడిలో చేరడం–ఆమె టీచర్‌గా పనికిరాదని ఆ ఉద్యోగంలోంచి తీసేయడం పరిపాటి.

జీవితం ఆరంభదశలోనే ఎన్నో విషాదాలు చుట్టుముట్టినా ఆశావాదంతో, ఆమెపై ఆమెకున్న అచంచల విశ్వాసంతో, "నెవెల్ గివ్ అప్" అనే నినాదంతో ముందుకు నడిచిన వ్యక్తి, స్త్రీశక్తి జె.కె.రౌలింగ్.

రౌలింగ్ జులై, 1965 ఇంగ్లాండ్‌లో జన్మించింది. అందరు స్త్రీల లాగానే రౌలింగ్‌కు తల్లితో అనుబంధం. ఇద్దరూ స్నేహితుల్లా మెలిగేవారు. రౌలింగ్ యుక్తవయసులోనే తల్లిని కోల్పోయింది. ఇది జీవితంలో పెనువిషాదం. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త చేతుల్లో నిరంతర గృహహింస. తప్పనిసరి పరిస్థితుల్లో పెళ్లైన 13 నెలలకు విడాకులు తీసుకొంది–భర్త వదిలించుకున్నాడు, తల్లి లేదు, ఉద్యోగం లేదు. తనను, తన పసిబిడ్డను పోషించుకోలేని నిస్సహాయత–దానివలన మానసిక కృంగుబాటు. ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొంది.

ఒక్కసారి తనలోకి తాను తొంగిచూసుకొంది. ఐదు సంవత్సరాల వయసులో తాను రాసిన "రాబిట్" స్టోరీ గుర్తుకువచ్చింది. తనలో నిద్రాణమైయున్న రచయితకు ఒక అవకాశం ఇవ్వాలనుకుంది. సరైన నివాసం కూడా లేకపోవడం వలన కాఫీ షాపులో కూర్చొని రచనలు ప్రారంభించింది.

ఆమెకు పిల్లలంటే చాలా ఇష్టం. ఆ పిల్లలకు చందమామ కథలు చెప్పడం ఇంకా ఇష్టం. పిల్లల సైకాలజీ గురించి ఆమెకు బాగా తెలుసు. పిల్లలు దేనిని ఇష్టపడతారో, ఆ పిల్లలను ఎలా ఆడించాలో కూడా ఆమెకు బాగా తెలుసు. కానీ తీరా వాటిని ఆచరణలోపెట్టే సరికి ఫెయిల్ అవుతోంది.

ఆమె అపజయాల పరంపర ఆమెను ఎప్పటికప్పుడు వెక్కిరిస్తూనే ఉంది. అందుకే పిల్లలకు తాను చెప్పదలుచుకున్న కథను నవల రూపంలో పెట్టింది. రాత్రనక, పగలనక కంప్యూటర్ ముందు కూర్చుని ఓ మంచి నవల రాసింది. అవి చందమామ కథల్లాంటివి. సమకాలీన పరిస్థితులను ప్రతిబింబించవు. అదో లోకం. అదో ఊహా ప్రపంచం. అందులో ఆమె స్వేచ్ఛగా విహరించింది. దానికి 'హరి-పాటర్' అనే పేరు పెట్టింది.

రోలింగ్ ముందుగా ఏజెంట్లకు తన నవల హరి-పాటర్ ఇచ్చింది. ఒకరుకాదు ఇద్దరు కాదు చాలామంది ఏజెంట్లు ఆ నవల చదివి పెదవివిరిచారు. అలాంటి జానపద సాహిత్యం ఈ రోజుల్లో అమెరికన్ పిల్లలు చదవడం ఏంటని ఎద్దేవ చేశారు. అసలు ఆమె రచయిత్రిగా ఏమాత్రం పనికిరాదని ముఖంమీదే చెప్పారు. ఆమెకు జరిగిన ఆ అవమానం ఆమె భరించింది. తనమీద తనకు పూర్తిగా నమ్మకం ఉంది. ఇక ఏజెంట్లను ఆశ్రయించకూడదని. చిన్నాచితకా పబ్లిషర్లను ఆశ్రయించింది. ఏజెంట్లను భరించలేని కొన్ని చిన్న చిన్న పబ్లిషింగ్ సంస్థలు రచయితతో నేరుగా నవల తీసుకుంటారు. అలాంటి నవలలు అమెరికా అంచులు దాటవు. అలాంటి చిన్న పబ్లిషర్స్ కూడా రోలింగ్ పట్టుకొచ్చిన పెద్ద వాల్యూమ్ చూసి కంగారు పడ్డారు. అంత పెద్ద నవలను చదివే ఓపిక పిల్లలకు ఎక్కడ ఉంటుందని ముఖం మీదే కించపరిచారు. అసలు నవల ఎలా రాయాలో ముందుగా నేర్చుకో-మరోసారి మా ఆఫీసుకు వచ్చి మా టైమ్ వేస్ట్ చేయకు అని మందలించారు.

రోలింగ్ ఆ అవమానాన్ని తట్టుకుంది. దాదాపు అన్ని తలుపులు మూసుకున్నాయి. అయినా ఆమె తన పట్టువీడలేదు.

హరి-పాటర్ నవలను సొంత ఖర్చుతో అచ్చేయించి డిస్ట్రిబ్యూటర్లకిచ్చింది. వాళ్లు కూడా ఆ నవలను చదివి పెదవి విరిచారు. ముందుగా కేవలం వెయ్యి కాపీలను మాత్రమే తీసుకున్నారు.

హరి–పాటర్ మార్కెట్‌లోకి విడుదలైన వారంపాటు ఎలాంటి అమ్మకాలు లేవు.

ఇలాంటి సెల్ఫ్ పబ్లికేషన్ నవలల మీద ఏ పత్రికలు కూడా సమీక్షలు రాయరు. కేవలం ట్రెడిషనల్ పబ్లిషర్లు వేసే నవలలమీదే సమీక్షలు రాస్తారు. అందుకే హరి–పాటర్ నవల మీద ఏ పత్రిక కూడా సమీక్షలు రాసిన పాపాన పోలేదు.

మరోవారం తరువాత డిస్ట్రిబ్యూటర్లు ఫోన్‌చేసి అమ్ముడుపోయిన వెయ్యికాపీల డబ్బు ఆమెకిస్తూ ఓ పదివేల పుస్తకాలు 24 గంటల్లో అచ్చేసి పంపమని డబ్బు ఇచ్చారు. ఊహించని ఈ పరిణామానికి ఆమె ఆశ్చర్యపోయింది. వెంటనే ఆమె పదివేల పుస్తకాలు వేసి పంపింది. మరో వారం తిరక్కుండానే లక్షకాపీలు వేసి పంపమని డిస్ట్రిబ్యూటర్లు ఇంటొకచ్చి డబ్బు ఇచ్చారు.

ఈ వార్త ట్రెడిషనల్ పబ్లిషర్లకు, ఏజెంట్లకు ప్రవాహంలా పాకింది. ఆమెను చీకొట్టినవాళ్లే ఆమె ఇంటికొచ్చి ఆ నవల పబ్లిషింగ్ హక్కులు ఇవ్వమని ప్రాదేయపడ్డారు. ఆమె ఆ వ్యాపారం తలనొప్పులు పెట్టుకోరాదని 50 శాతం రాయల్టిమీద పబ్లికేషన్ హక్కులను ఏజెంట్లకిచ్చింది. అక్కడి నుంచి ఆమె జయకేతనం ఎగరేసింది. ఆ నవల అమ్మకాల్లో సంచలనం రేపడంతో అన్ని పత్రికలు సమీక్షలు రాశాయి. కరోనా వైరస్‌లాగా ఆ నవల వైరస్ ప్రపంచం మొత్తం వ్యాపించింది. ఉదయం ఆరింటికే పిల్లలు షాపుల ముందు క్యూలో నిలుచుని హరి–పాటర్ నవలను కొనే స్థాయికి వచ్చింది. ఆ తరువాత ఆ నవల ఏడు భాగాలు ఆమె రాసింది. దానిని హాలీవుడ్ చిత్రసీమ హరి–పాటర్ ఏడు భాగాలు సినిమాలు చేసింది. ఇప్పుడామె ప్రపంచంలోనే నెంబర్ వన్ రచయితగా పేరు తెచ్చాకున్నారు.

**ఓటమి తిరస్కారం, అవమానం చాక్లెట్‌పై చుట్టే రేపర్ లాంటివి. ఓపికగా ఆ పేపర్లు తిసేస్తే లోపల గెలుపనే తీయని చాక్లెట్ మనల్ని పలుకరిస్తుంది. మనసును పరవశింపచేస్తుంది కూడా.**

## నాలుగవ సూత్రం

# 4. గెలుపంటే నిలుపుకున్న బంధాలే

**అ**నుభందాల్ని నిలుపుకోవటమే నిజమైన గెలుపని చదివాను. అసలు మనిషి గెలుపుకు ఈ అనుబంధాలే తొలిపునాదులు.

విద్యాబుద్ధులు నేర్పించి మనిషి విజయానికి బాల్యంలోనే పునాదులు వేస్తారు తల్లిదండ్రులు. కొన్నిసార్లు, మేనమామ, మేనత్త, బాబాయి, పిన్ని, తాత, మామ్మ.... ఇలా ఎవరో ఒకరు పిల్లవాని బాధ్యతను తీసుకొని అతని ఎదుగుదలకు, జీవితంలో విజయానికి తోడ్పడతారు. నైతిక మద్దతు అందించి స్నేహితులు కూడా మనిషి విజయానికి సహకరిస్తారు కొన్ని సందర్భాలలో.

**కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతో పెనవేసుకున్న ఆరోగ్యకరమైన అనుబంధాలు మనకు ఒక మానసిక సౌఖ్యాన్ని అందిస్తాయి. నా కోసం ఇంతమంది ఉన్నారు అనే భావన మన ఆలోచనలు, నిర్ణయాలపై సానుకూల ప్రభావాన్ని చూపి మనల్ని గెలుపువైపు నడిపిస్తాయి.**

ఆత్మహత్య చేసుకొన్న సెలబ్రిటీస్ మనకు తెలుసు, (సిల్క్‌స్మిత, రంగనాథ్‌లాగా) వారికి పేరు ప్రఖ్యాతులు, డబ్బు, సమాజంలో గుర్తింపు అన్నీ ఉన్నా నీకు నేనున్నాను అని వారికి ఎమోషనల్ సపోర్టు ఇచ్చేవారు లేకనే ఈ పరిస్థితి ఏర్పడి ఉండవచ్చు.

జీవితభాగస్వామితో అవగాహనా సమస్యలు, ఇతర కుటుంబసభ్యులతో మనస్పర్థలు, మిత్రులు ఇరుగుపొరుగువారితో పేచీలు, మన మనశ్శాంతిని దెబ్బతీసి తద్వారా మన ఆలోచనలను, మన నిర్ణయాలను అంతిమంగా మన విజయాల్ని ప్రభావితం చేస్తాయి.

కుటుంబ సభ్యుల మధ్య సత్సంబంధాలు లేకపోవడం వలన జీవితంలో సాధించిన విజయాల్ని ఆస్వాదించలేక పోవటమో, విజయాల ప్రభావం పలచబడడమో లేదా ఆ విజయాలు చేజారి జీవితం తల్లక్రిందులవటమో జరిగిన సంఘటనలు కోకొల్లలు.

బంధాలు నిలుపుకోటానికి ఏం చేయాలి. సైకిల్ తొక్కుతున్నప్పుడు క్రింద పడకుండా ఉండడానికి ప్రతిక్షణం బాలెన్స్ చేసుకున్నట్లే బంధాలు నిలుపుకోవటానికైనా నిత్యప్రయత్నం కావాలి.

**"టేకింగ్ ఫర్ గ్రాంటెడ్" ఎప్పుడూ తప్పే. ముందుగా మనిషిని ప్రేమించాలి. అన్ని తప్పొప్పులతో మనిషిని అంగీకరించాలి. లోపాలను ఎంచక పోవటం, క్షమించటం, నాన్ జడ్జిమెంటల్, సరైన కమ్యూనికేషన్ (భావ ప్రసరణ) కలిగి ఉండటం అవసరం.**

విఫల బంధాల ప్రభావంతో విఫలమైన జీవితాలు ఎన్నో. అందులో కొన్ని మీ ముందుకు.

# శంకర్ దేవరాజన్ – **I.A.S. Guru**

**త**నకు దక్కనిది వేరెవరకూ దక్కకూడదనుకుంటాడు ఒక క్రూరుడు. అందుకే ఏసిడ్ దాడులు, తిరస్కరించిన స్త్రీని హత్య చేయటం సాధారణమైపోయింది.

కానీ తనకు దక్కని సంతోషాన్ని తాను పొందలేని విజయాన్ని, తాను చేరుకోలేని గెలుపు గమ్యాలను ఇతరులకు అందించి తృప్తి పడతారు అరుదుగా కొందరు. అటువంటి అరుదైన వ్యక్తి శంకర్ దేవరాజన్. చెన్నైలో ఐ.ఎ.ఎస్ పరీక్షకు సిద్ధమయ్యేవారి తర్ఫీదునిస్తారు.

గరళాన్ని మింగిన శంకరునిలా ఓటమి పాఠాల్ని దిగమింగి తన అనుభవాలతో వాటిని గెలుపు సందేశాలుగా మార్చి – ఒకరు ఇద్దరు కాదు సుమారు వెయ్యిమంది ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్, ఇతర కేంద్ర సర్వీసులకు ఈయన శిష్యులు సెలెక్టు అవ్వటానికి కారణమయ్యారు.

**అందుకే నా ఓటమిని నిచ్చెనగా మార్చి ఎందరినో గెలుపు శిఖరాల్ని అధిరోహించేలా చేసాను" అని గర్వంగా సంతోషంగా చెప్పుకుంటారు.**

1973లో తమిళనాడులో ఒక నిరుపేద కుటుంబంలో జన్మించిన శంకర్ కష్టపడి అగ్రికల్చర్ ఎమ్.ఎస్.సి. చదివారు. ఆస్తులు లేకపోవటం కాదు ఆశలు లేకపోవటమే నిజమైన పేదరికం అని నమ్మే శంకర్ కలెక్టర్ కావాలనుకుంటాడు.

ఢిల్లీ వెళ్ళి ఒకటి రెండు సంవత్సరాలు అక్కడే ఉండి సివిల్స్ పరీక్షకు సిద్ధమవటం ఖర్చుతో కూడిన పని. స్నేహితురాలు మరియు ప్రియురాలైన వైష్ణవి అతన్ని ప్రోత్సహించి ధన సహాయం చేసి ఢిల్లీ పంపింది. కారణమేమైనప్పటికీ, అతను ఐ.ఎ.ఎస్కు సెలెక్టు కాలేదు.

ప్రేమించే మనిషి మన పక్కన ఉన్నప్పుడు ఓటమి కూడా మనల్ని నిరాశ పర్చలేదు, కొత్త ఆశల ద్వారాల వైపు నడిపిస్తుంది.

2004లో భార్య వైష్ణవి ప్రోత్సాహంతో చెన్నైలో ఐ.ఎ.ఎస్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు ఇద్దరూ క్లాసులు తీసుకునేవారు. వీరి కష్టం ఫలించి ఇక్కడ తర్ఫీదు తీసుకున్నవారు చాలామంది ఐ.ఎ.ఎస్‌కు సెలెక్టు అయ్యారు.

కోయంబత్తూర్, బెంగుళూరులో కూడా బ్రాంచిలు ఏర్పాటు చేసారు. ఢిల్లీ తరువాత అంతటి ఉత్తమ శిక్షణ అందించే సంస్థగా పేరు తెచ్చుకొంది. 2004, 2018 మధ్యలో **ఈయన వద్ద శిక్షకులు సుమారు వెయ్యిమంది జిల్లా కలక్టర్లుగా, పోలీస్ సూపరింటెండ్లుగా, ఇతర ఉన్నత అధికార్లుగా దేశమంతా పనిచేస్తున్నారు.**

ఎందరో యువకుల జీవితాల్లో స్ఫూర్తిని నింపి అత్యున్నత విజయాల్ని వారికి కానుకగా అందించిన ఈ విజేత భార్యతో మనస్ఫర్ధల కారణంగా ఒక బలహీన క్షణంలో 2018 అక్టోబరులో ఆత్మహత్య చేసుకొన్నాడు. భార్య, ఇద్దరు కూతుర్లు, ఎందరో అభిమానులకు ఇది తీరని దుఃఖం. **బంధాలు బలహీనపడితే బలవంతులు కూడా ఓడిపోతారు.**

# మహానటి

**అ**రవై, డెబ్బై దశకాలలో వెండితెర కలలరాణి సావిత్రి ఇప్పటి తరానికి తెలియకపోవచ్చు. కానీ ఆమె బయోపిక్ 'మహానటి' 2019లో విడుదలై విజయం సాధించింది. జాతీయ స్థాయి అవార్డులను కూడా గెలుచుకొంది. ఈ సినిమా ద్వారా సావిత్రి ఈ తరానికి కూడా పరిచయమే.

**అభినయానికి ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ లాంటి సావిత్రి నటిగా, నేపథ్య గాయకురాలిగా, డాన్సర్‌గా, డైరక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా బహుముఖ పాత్రలు పోషించారు. అయినవారికి మంచి ఆతిథ్యాన్ని అందించటం, నిస్సహాయులకు చేయూత నివ్వటం, విరివిగా దానధర్మాలు చేయటం ఆమె సహజ లక్షణం.**

1936లో ఆంధ్రప్రదేశ్ గుంటూరులో జన్మించిన సావిత్రి పదహారు సంవత్సరాల వయసులో చిత్రరంగంలో ప్రవేశించి స్వశక్తితో, స్వయంకృషితో భారతీయ చలనచిత్ర చరిత్రలో ఆమెకంటూ ఒక ప్రత్యేక ఆధ్యాయాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

సుమారు మూడు దశాబ్దాల సినీ పయనంలో తెలుగు తమిళ భాషల్లో 250 చిత్రాలలో నటించి నంది అవార్డు, రాష్ట్రపతి అవార్డు కూడా అందుకున్నారు. భారత ప్రభుత్వం ఆమె పేరున పోస్టల్‌స్టాంపును కూడ విడుదల చేసింది.

కానీ, మహానటి విజయం, వైభవం ఎక్కువ కాలం నిలబడలేదు. 45 సంၑవయసులో కడు పేదరికంతో దయనీయంగా మరణించింది. అప్పటికే 19 నెలలు కోమాలో ఉంది.

ఆమె తమిళ హీరో జైమినీ గణేష్‌ను వివాహమాడారు. అప్పటికే ఆయనకు పెళ్ళై పిల్లలు కూడా ఉన్నారు. హిందీ హీరోయిన్ రేఖా ఆయన కూతురే. మొదట్లో సజావుగా సాగిన సావిత్రీ– జెమనీ గణేష్‌ల దాంపత్యం కొంతకాలం తర్వాత చిక్కుల్లో పడింది. భార్యాభర్తల మధ్య తీవ్ర మనస్పర్థలు ఏర్పడి విడిపోయారు. విఫల దాంపత్యం ఆమెను తీవ్రంగా బాధించి కుంగుబాటుకు గురిచేసింది. బాధనుండి ఉపశమానికి

ఆమె మద్యానికి బానిసయ్యారని చెప్పుకుంటారు. ఈ కారణాలతో ఆస్తిపాస్తులు, అందం, ఆరోగ్యం, అన్నీ కోల్పోయి దయనీయంగా మరణించారు. సావిత్రి పతనానికి విఫలమైన దాంపత్యం, మనశ్శాంతి కోసం మద్యానికి బానిసవటం కారణాలుగా చెబుతారు. **భార్య భర్తల మధ్య అనుబంధం దెబ్బతినటం అంటే జీవితంలో అణుబాంబు పేలటమే.**

# ప్రమోద్ మహాజన్

**రా**జకీయాల గురించి ఆసక్తి ఉన్న ఎవరికైనా ప్రమోద్ మహాజన్ అంటే వెంటనే గుర్తుకు వచ్చేది . ఆయన వాగ్ధాటి, సినిమా హీరోలా ఆయన ఆకట్టుకునే రూపం. ఆయన మహారాష్ట్రకు చెందిన రెండవతరం బి.జె.పి.నేత.

తెలంగాణాలో తండ్రి రైల్వే ఉద్యోగిగా పనిచేస్తున్నప్పుడు 1949లో మహాజన్ మహబూబ్‌నగర్‌లో పుట్టారు. మహారాష్ట్రలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకొని అక్కడే ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేసారు.

ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని 1974లో అరెస్టయ్యారు. ఎనభయ్యవ దశకంలో బి.జె.పి.లో చేరి తన ప్రతిభతో అంచెలంచెలుగా ఎదిగి పార్టీ జనరల్ సెక్రెటరీ అయ్యారు. ఒకసారి లోక్‌సభకు, మూడుసార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారు.

వాజ్‌పాయ్ కాబినేట్‌లో రక్షణశాఖ మంత్రిగా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా, కమ్యూనికేషన్ మరియు ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ మంత్రిగా పనిచేసారు. భారతదేశంలో సెల్యూలర్ రివల్యూషన్ (మొబైల్ ఫోన్లు) విప్లవానికి ఈయనిదే ప్రధానపాత్ర అంటారు. అంతేకాదు, భారతీయ జనతాపార్టీకి ఎన్నో ఎన్నికల్లో చక్కని ప్రణాళికలు రచించి విజయాన్ని అందించిన అదృష్ట సూచికగా మహాజన్‌ను పార్టీ గుర్తించింది.

సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టి ఎటువంటి రాజకీయ నేపథ్యం లేనప్పటికీ ఒక జాతీయస్థాయి నేతగా ఎదిగారు. కానీ దురదృష్టవశాత్తు 2006లో ఆయన సొంత తమ్ముడు ప్రవీణ్ మహాజన్ ఆయన గృహంలోనే ప్రమోద్‌ను తుపాకితో కాల్చి చంపాడు.

కుటుంబ వైరం, అశ్రద్ధకు గురికాబడటం, ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్, అసూయ ఈ హత్యకు కారణమని పోలీసులు తేల్చారు, జీవితఖైదు అనుభవిస్తూ 2010లో ప్రవీణ్ బ్రెయిన్ హెమరేజ్‌తో మరణించాడు. ఇది ఇద్దరు అన్నదమ్ముల విషాదగాథ.

ఐదవ సూత్రం

# 5. గెలుపంటే లోపాలను అధిగమించడం

**లో**పం–లోపం లేని మనిషి, లోటులేని జీవితం ఉంటుందా? అలా ఉంటే మనిషే దైవం కదా!... ఈ విశ్వాసాలు, సిద్ధాంతాలు చివరికి ఈ వ్యక్తిత్వ వికాస పుస్తకాలు కూడా అవసరమేలేదు.

జె.ఆర్.డి.టాటా కుమారుడిగా వేలకోట్ల ఆస్తికి వారసుడుగా జన్మించిన రతన్ టాటా తల్లిదండ్రులు విడిపోవటంవలన నానమ్మ వద్ద పెరిగాడు. ప్రియురాల్ని కోల్పోయి ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలిపోయాడు. ఐనప్పటికి ఈ విషాదాల నధిగమించి గొప్ప నాయకుడుగా, దానకర్ణుడిగా, ఉదాత్తమైన వ్యక్తిగా, విలువలకు నిలువెత్తు రూపంగా భరతజాతి గర్వించదగ్గ వ్యక్తిగా రూపాంతరం చెందాడు.

మన లోపాన్ని ఎలా స్వీకరించాం–ఎలా గెలిచాం అనే దానిపైనే మనం జీవితంలో గెలిచామా, ఓడామా అన్నది నిర్ణయించవచ్చు.

**లోపం మనసుకు చేరనంతవరకు మనిషి ఏలోపాన్నైనా జయించవచ్చు.** –అవయవ లోపం ఉంటే ఆ లోపం శరీరానికే పరిమితం కావాలి. మనసులోకి ప్రవేశించకూడదు– పేదరికం... బైక్‌లో తిరిగేబదులు సైకిల్‌మీద తిరగుతాము. పాలెస్‌లో ఉండేబదులు పాకలో ఉంటాము. అంతేకదా! కలలు కనటానికి కష్టపడటానికి పేదరికం ఏవిధంగా అడ్డంకి? ఇక చదువులేకపోవటం–డిగ్రీలు లేనంతమాత్రాన జ్ఞానం లేనట్లా? ఉద్యోగానికైతే డిగ్రీలు కావాల్సిందే. కానీ, ప్రగతికి, పురోగతికి, విజయానికి డిగ్రీ లెందుకు? కలలు, ఆలోచనాశక్తి, చుట్టూ ఉన్న సమాజాన్ని మనుషులను చదవటం నేర్చుకుంటే డిగ్రీలు

అవసరమే లేదు. ఏరోజు స్కూలు కెళ్లని రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్యంలో నోబుల్ ప్రైజ్ సాధించారు. గొప్ప చిత్రకారుడు కూడా.

ఇక వయసు ఒకలోపంగా ఎప్పుడు మారుతుంది? దోసిట్లో పట్టిన నీరు వెంటనే తాగేయకపోతే వేళ్లసందుల్లోంచి కిందకు జారిపోతాయి. కాలం, ముఖ్యంగా యవ్వనకాలం కూడా అంతే. మనకు తెలియకుండానే చేజారిపోతుంది. అమాయకత్వం వలనో, అజ్ఞానం వలనో, చెప్పేవారు లేకపోవటం వలనో, చెప్పినా మనం వినకపోవటంవలనో, వ్యసనాల వలనో జీవితంలో స్థిరపడాల్సిన విలువైన కాలాన్ని వృథా చేసుకుంటాము. ముప్పై ఏళ్లొచ్చినా సరైన ఉద్యోగం ఉండదు. ఉపాధి ఉండదు. మనపై ఆధారపడిన తల్లిదండ్రులు / భార్యాబిడ్డలు కూడా ఉండవచ్చు. నో రిగ్రెట్స్. గడిచిపోయిన దాని గురించిన ఆలోచన వద్దు. మీకు 30 ఏళ్లొచ్చినా, 40 ఏళ్లొచ్చినా ఎక్కడ నుండైనా జీవితాన్ని కొత్తగా ప్రారంభించవచ్చు.

**లోపాలు ఎన్ని విధాలుగానైనా ఉండవచ్చు. ముఖ్యంగా, అంగవైకల్యం, పేదరికం, డిగ్రీలు లేకపోవటం, వయసు పైబడటం మొదలగు లోపాల్ని జయించిన విజేతల్ని మీకు పరిచయం చేస్తున్నాను. ఐదవ సూత్రాన్ని నాలుగు భాగాలుగా– A) అంగవైకల్యం, B) పేదరికం C) చదువులేకపోవడం D) వయసు పైబడటం... మీకు అందిస్తున్నాను.**

# A. వైకల్యం × వైఫల్యం

**అం**గ వైకల్యం ఉన్నంత మాత్రాన జీవితం వైఫల్యం చెందాల్సిన అవసరం లేదు. వైకల్యాన్ని జయించిన విజేత లెందరో మన మధ్య ఉన్నారు.

ఒకప్పుడు పోలియోకి వ్యాక్సిన్ లేదు. ప్రస్తుతం పోలియో కేసులు లేవనే చెప్పవచ్చు. పోలియో వ్యాక్సిన్ వైద్యశాస్త్రం మనిషికందించిన గొప్ప బహుమతి.

ఈ వాక్సిన్ 1955లో అమెరికాకు చెందిన వైద్యుడు జొనాస్ సాల్క్ కనుగొన్నారు. బాల్యంలో పేదరికాన్ని అనుభవించాడు. ఈ వాక్సిన్ ద్వారా కోట్ల డాలర్లు సంపాదించే అవకాశం ఉన్నప్పటికి ఆయన ఈ వాక్సిన్ పేటెంట్ (మేధోహక్కు) రిజిస్టర్ చేసుకోలేదు. దీని ధర ప్రతి పేదవాడికి అందుబాటులో ఉండాలనే ఉన్నతాశయంతో మేధో హక్కు త్యాగం చేశాడు.

ఈ రోజుల్లో అంధులకు, దృష్టిలోపం ఉన్నవారికి వినికిడి లోపం ఉన్నవారికి ఉపయోగపడే శాస్త్ర ఉపకరణాలు , మంచి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

సమాజంలో వికలాంగుల పట్ల దృక్పథం మారింది. వారిని వికలాంగులని పిలవటానికి కూడా ఎవరూ సాహసించడం లేదు. దివ్యాంగులని పిలుస్తున్నారు. ఎవరూ ఇదివరకట్లా హేలన చేయటం లేదు.

ప్రజారవాణా వ్యవస్థలో ప్రత్యేకమైన సీట్లు కేటాయించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఎంట్రన్స్ వద్ద వారికోసం ప్రత్యేకమైన రాంప్ ఏర్పాటు చేస్తున్నారు. లిఫ్ట్ బటన్‌పై బ్రెయిలీ లిపి కూడా ఉంటుంది. ప్రవేశ పరీక్షల్లో, ఉద్యోగాలలో కోటా ఉంది. కొందరు అంధులు ఐ.ఎ.ఎస్‌కు ఎన్నికై జిల్లా కలెక్టర్‌లుగా పనిచేస్తున్నారు.

దివ్యాంగులకోసం ప్రత్యేకమైన ఒలంపిక్ పోటీల (పారా ఒలింపిక్స్) నిర్వహిస్తున్నారు. **అటు సైన్స్, ఇటు సమాజం, ప్రభుత్వం వారికోసం ఎంత చేసినా, ఒక వ్యక్తి ముఖ్యంగా ఒక దివ్యాంగుడు తన కోసం తాను ఏంచేసుకున్నాడు అనే దానిమీద అతని జీవితం ఆధారపడి ఉంటుంది.**

తమ లోపాన్ని బూతద్దంలో చూస్తూ కృంగిపోయేవారు కొందరు, లోపాన్ని సాకుగా చూపుతూ బ్రతుకు పోరాటం నుండి పారిపోయే వారు మరి కొందరు. కానీ **లైఫ్‌ని చాలెంజ్‌గా తీసుకొని, ఆ లోపాన్ని జయించి విజేతలుగా ఎదిగి ఒకరు జాలిపడే స్థితి నుండి ఈర్ష్యపడే స్థానానికి చేరుకున్నవారు మనచుట్టూ ఎందరో!**

కేరళకు చెందిన యువతి జిలోమల్ మారియట్ థామస్‌కు **పుట్టుకతోనే రెండు చేతులు లేవు.** ఆమె చదువుకొని గ్రాఫిక్ డిజైనర్‌గా ఉద్యోగం చేస్తుంది. గ్రాఫిక్ డిజైనింగ్ అంటేనే కంప్యూటర్ కీబోర్డు మీద చేతులు ఆడాలి. రెండు చేతులూ లేకపోయినా గ్రాఫిక్ డిజైనింగ్ నేర్చుకుంది. గ్రాఫిక్ డిజైనర్‌గా ఉద్యోగం కూడా చేస్తోంది. అంతేకాదు, ప్రతిరోజు ఆమె స్వయంగా కారు డ్రైవ్ చేసుకుంటూ ఆఫీసుకు వెళ్తుంది. **స్టీరింగ్, సీట్‌బెల్ట్, గేర్స్ మార్చటం అన్నీ కాళ్లతోనే. కోర్టు కెళ్లి డ్రైవింగ్ లెసెన్స్ సాధించింది.** యు ట్యూబ్‌లో ఆమె వీడియో చూడండి, మనిషి కున్న అంతర్గత శక్తి మీకర్థమవుతుంది.

వైకల్యాన్ని జయించిన విజేతలు మన ఊర్లో, మన రాష్ట్రంలో, మన దేశంలో, ప్రపంచంలో కోకొల్లలు. ఒక ముగ్గుర్ని మాత్రం మీకు పరిచయం చేస్తున్నాను.

# హెలెన్ కెల్లర్

ప్రపంచం ఎలా ఉంటుందో కనిపించదు. కనీసం విందామంటే ఎదుటి మనిషి చెప్పేది వినిపించదు. ఎంతటి హీనత్వం? ఎంతటి దైన్యం? భాష ఎలా ఉంటుందో తెలియదు. అక్షరాలు కనిపించవు. ఆమె చెప్పేది మాత్రమే ఎదుటి మనిషి వినాలి. అతను జవాబు చెబితే వినిపించదు. సైగలతో తడిమి చూపితే తప్ప అర్థంకాని దుస్థితి. ఏమిటీ నరకం.

అందులోనూ స్త్రీ. – ఒంటరిగా ఎక్కడికి వెళ్ళలేని పరిస్థితి. జూన్ 27, 1880లో అమెరికాలో హెలెన్ ఆడమ్ కెల్లర్ జన్మించింది. పుట్టుకతో గుడ్డి, చెవిటితనం. ఆమె గుక్కపెట్టి ఏడ్చేది. తల్లి "ఊ" కొడితే వినిపించేది కాదు. ఎటు చూసినా అంధకారం.

బుడిబుడి అడుగులు వేసే నాటికే హెలెన్ తన లోపం గురించి తెలుసుకొంది. కృంగిపోలేదు. జీవితంలో గెలిచి తీరాలని నిర్ణయించుకుంది. మొదటిగా పట్టుదలగా భాష నేర్చుకొంది. తల్లిదండ్రుల సహాయంతో మరియు టీచర్ అన్నె స్యులీవన్ సహాయంతో చదువు నేర్చుకొంది.

1891లో తన 11వ ఏటనే పుస్తక రచన (ది ఫ్రాస్ట్ కింగ్) ప్రారంభించింది. 1908లో ఆమె రాసిన "ది వరల్డ్ ఐ లివ్ ఇన్" పుస్తకం సంచలనం రేపింది. ఆమె గురించి అమెరికా, యూరప్ దేశాలే కాకుండా ఇతర ప్రపంచ దేశాలు కూడా తెలుసుకోవడం ప్రారంభించాయి.

గ్రాడ్యుయేషన్ చేసిన తొలి అంధ, బదిర విద్యార్థిగా చరిత్ర సృష్టించింది. అప్పటికే ఆమె 12 పుస్తకాలు రాసి సంచలనం రేపింది.

ఆమెకు అభిమానిగా మారిన జాన్ మాసేను వివాహమాడింది. వారిది అన్యోన్య దాంపత్యం.

ఆమె 22వ ఏటనే, "ది స్టోరీ ఆఫ్ మై లైఫ్" అనే పుస్తకం రాసింది. ఆమె తను పడుతున్న కష్టాలను అందులో రాసింది. ఆమె ఊహించుకుంటున్న ప్రపంచం ఎలా ఉంటుందో పాఠకులకు చవిచూపింది.

ఆమె చూడలేని మన ప్రపంచాన్ని మనకే కొత్తగా చూపింది. ఇది కేవలం ఒక పుస్తకం మాత్రమే కాదు. ఒక స్ఫూర్తి దాయిక జీవన చిత్రం. అవిటివారు కూడా ఈ ప్రపంచాన్ని జయించగలరని నిరూపించిన శాస్త్రీయ గ్రంథం. ఇది దివ్యాంగులలో కొత్త స్ఫూర్తిని నింపి వారిలో చైతన్యం రగిలించింది.

ఆమె పుస్తకాలు పాఠకులకే కాదు, ప్రేక్షకులకు కూడా అందాలని, దర్శక నిర్మాతలు "ది స్టోరీ ఆఫ్ మై లైఫ్"ని డాక్యుమెంటరీగా తీసారు. అందులో హెలెన్ కెల్లర్ నటించింది. ఇది ఎంతో ప్రేక్షకాదరణ పొందింది. ఈ సినిమా ఆమె చూడలేనప్పటికీ, ఈ సినిమా ద్వారా ప్రపంచం ఆమెను దర్శించింది.

ఆమె అక్కడితో ఆగిపోలేదు. అమెరికా రాజకీయాలమీద మంచి పట్టు సాధించి మంచి రాజకీయ విశ్లేషకురాలిగా మరియు అమెరికా అధ్యక్షునికి రాజకీయ సలహాదారుగా ఎదిగింది.

ఆమె మంచి వక్తకూడా. ఆమె ప్రసంగాలు ఆసక్తికారంగా, ఉత్తేజభరితంగా ఉంటాయి. ఆమె ప్రసంగాల్ని ఇష్టపడే శ్రోతలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు.

దివ్యాంగుల హక్కుల కోసం, స్త్రీ ఓటు హక్కుకోసం ఆమె పోరాడారు. మిలిటరీ/ఆయుధ రహిత ప్రపంచానికై కలలు కన్నారు. సుమారు 40 దేశాలు పర్యటించి స్ఫూర్తిదాయక ప్రసంగాలతో ప్రజలను ఉత్తేజపరిచారు.

ఆమె జీవించి ఉన్నప్పుడు, మరణించిన తరువాత కూడా ఎన్నో అవార్డులు గుర్తింపులు పొందారు. 1964లో ప్రెసిడెన్షియల్ అవార్డును పొందారు. ఆమె పేరున పోస్టల్ స్టాంపు విడుదల అయ్యింది.

**అన్ని అవయవాలు సరిగా ఉండి, అవకాశాలు అందుబాటులో ఉన్నప్పటికీ నిరాశలో జీవించే ఎంతోమందికి, తన లోపాల్ని అదిగమించి తనను తాను ఉద్ధరించుకొని తన చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా ఉద్ధరించడానికి జీవితకాలమంతా శ్రమించిన హెలెన్ కెల్లర్ జీవితం ఒక విజయ గీతం**–ఈమె జూన్, 1, 1968లో మరణించారు. ఈమె శతజయంతిని అమెరికా ప్రభుత్వం గుర్తించింది.

# జైపాల్‌రెడ్డి

**కా**ళ్లలేకపోతేనేం, ప్రజలతో కలిసి నడిచే సత్తా వుంది. **కాళ్లు లేకపోయినా కాలంతోపాటు పరిగెత్తే గుండెనిబ్బరముంది.** పరుగెత్తాడు. కాలంతోపాటు చెమటలు కక్కేలా పరుగెత్తాడు. పరుగెత్తి అలిసిన కాలం కాళ్లు లాగాయి. అలిసి ఆగిపోయింది. అయినా అతను ఆగలేదు. ఎందుకంటే అతనికి అసలు కాళ్లు లేవు. కాళ్లు లాగే ప్రసక్తి లేదు. ఐనప్పటికి చరిత్రలో తనకొక శాశ్వత స్థానాన్ని ఏర్పరచుకున్న రాజకీయ దురంధరుడు జైపాల్‌రెడ్డి.

జనవరి 19, 1942లో నల్గొండ జిల్లాలో జన్మించారు. పద్దెనిమిది నెలల వరకు కుందేలు పిల్లలా ఎగిరెగిరి గంతులు వేసేవాడు. కానీ ఒక్కసారిగా పోలియో మహమ్మారి ఆయన్ని కబలించింది. అతని కాళ్లను తీసుకుపోయింది. ఇల్లంతా శోకసముద్రంలో మునిగింది. బుడిబుడి అడుగులతో ఇల్లంతా తిరగాల్సిన పిల్లాడు ఇంట్లో దేకుతుంటే తల్లిదండ్రులు గుండె చెరువయ్యింది. ఆ ఇంటిని చీకటి కమ్మేసింది. కానీ, ఆ పసితనంలో కూడా జైపాల్‌రెడ్డి బాధపడలేదు. బతికాను అది చాలు అనుకొని నడిచాడు. కాళ్లు లేకపోతేనేం. గమనం ఆగదుగా!

ఆ చిన్నతనంలోనే అతను రాటుదేలిపోయాడు. తన లాంటి వికలాంగుడు బతకాలంటే అన్నిటికంటే ముఖ్యమైనది చదువు, ఆ చదువే అతనిని ముందుకు నడిపిస్తుందని నమ్మాడు. ఆ రోజులలోనే ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్.ఎ. చదివాడు.

ఒకరి నుండి సానుభూతిని పొందడం జైపాల్‌రెడ్డికి నచ్చదు. ఒకరికి సమస్యగా మారడం అస్సలు నచ్చదు. అందువలనే అందరి సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారాలు చూపేవాడు. విద్యార్థి దశనుండే నాయకత్వ లక్షణాలు అలవరచుకున్నాడు.

ఒక సమస్య వచ్చిందంటే దానికి పరిష్కారం కనుగొనేవరకు నిద్రపోయేవాడు కాదు. విద్యార్థుల సమస్యలను తన సమస్యలుగా చేసుకొని వారి తరపున పోరాడేవాడు. తను నడవలేకపోయినా ఒక నాయకుడై వారిని ముందుకు నడిపేవాడు. సమస్యలపై

పోరాటం చేయడం నేర్చుకున్నాడు. **విద్యార్థి దశలోనే ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘానికి ఎన్నికయ్యాడు.**

జైపాల్‌రెడ్డి చదువుపూర్తికాగానే హ్యాండీకాప్ కోటాలో అతనికి ఉద్యోగం వచ్చింది. కానీ అది అతనికి నచ్చలేదు. ప్రజాజీవితంలో ఉండాలని నిర్ణయించుకున్నాడు. కానీ, అప్పటివరకు ఏ వికలాంగుడు కూడా రాజకీయాలలో రాణించలేదు. అది దాదాపు అసాధ్యమని సన్నిహితులు, కుటుంబసభ్యులు హెచ్చరించారు. ఐనా, అతను తన పట్టు వీడలేదు. నాకు ఏ లోపం లేదు. **నాకు ఏదో లోపం ఉందని భయపడటమే అసలు లోపం అనుకున్నాడు.**

కాంగ్రెస్ పార్టీలో చేరాడు. క్రియాశీలక కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. అతని వాక్ పటిమ, ఉత్తేజం, ఉత్సాహం, మనో నిబ్బరం చూసి కాంగ్రెస్ నాయకులే ఆశ్చర్యపోయారు.

అందుకే, మొదటిసారి 1969లో ఎమ్.ఎల్.ఎ. టికెట్ ఇచ్చి కల్వకుర్తిలో ఎన్నికల బరిలోకి దింపింది కాంగ్రెస్. తన కాళ్లమీద తానే నిలబడలేడు. ఇక కాంగ్రెస్‌ని ఏమి నిలబెడతాడు అని ప్రత్యర్థులు హేళన చేశారు.

అందరి అంచనాలను తల్లక్రిందులు చేస్తూ జైపాల్‌రెడ్డి అనూహ్యంగా విజయం సాధించాడు. 1984 వరకు ఆ నియోజకవర్గానికి ఎమ్.ఎల్.ఎగా ఉన్నాడు.

వ్యక్తిగతంగా, మే 7, 1960లో లక్ష్మిని వివాహమాడాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె.

ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, తెలుగు భాషలను అనర్గళంగా మాట్లాడటం నేర్చుకున్నాడు. జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలను లోతుగా అధ్యయనం చేశాడు.

1976లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని ఖండించి కాంగ్రెస్ నుండి బయటకు వచ్చారు. 1980 మధ్యంతర ఎన్నికలలో మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గంలో ఇందిరాగాంధీ మీద జనతాపార్టీ టికెట్‌పై పోటీచేసి ఓడిపోయారు. ఐనప్పటికీ తరువాత కాలంలో ఐదుసార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారు. జైపాల్‌రెడ్డి వంటి మేధావుల అవసరాన్ని గుర్తించి కాంగ్రెస్ పార్టీ ఆయన్ని తిరిగి పార్టీలోకి ఆహ్వానించింది. విలువలతో కూడిన రాజకీయ జీవితాన్ని జీవిస్తూ కేంద్రమంత్రిగా పనిచేశారు.

ఇటీవలే మరణించిన జైపాల్‌రెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం.

# చేతుల్లేని పైలెట్

**చేతుల్లేకపోవడం వేరు, చేతకాకపోవడం వేరు. రెండవదే పెద్దలోపం. ఆ లోపాన్ని అధిగమించింది జెస్సికా.**

అమెరికా విమానరంగంలో అదో చరిత్రాత్మకమైన రోజు. ఎప్పటిలా అందరూ పైలెట్ శిక్షణకోసం దరఖాస్తు పెట్టుకొని క్యూలో నిలుచున్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలలో దివ్యాంగులకు తావులేదన్నది అందరికీ తెలిసిందే. ప్రపంచంలో అన్ని దేశాలు ఈ నిబంధనను ఖచ్చితంగా పాటిస్తాయి.

కాని దానిని ధిక్కరిస్తూ తను పైలెట్ శిక్షణ పొంది చరిత్రను తిరగరాస్తానని జెస్సికా సవాలు విసిరి దరఖాస్తు పెట్టుకుంది. ఆమెకు చేతులు లేవు. అధికారులు షాక్‌తో ఆమె దరఖాస్తును తిరస్కరించారు. ఆ తరువాత నవ్వుకున్నారు.

తనకు కూడా పైలెట్ శిక్షణ ఇచ్చి చూడమని జెస్సికా సవాలు విసిరింది. ఆ వార్త మీడియా ద్వారా అమెరికా అధ్యక్షుని వరకు వెళ్లింది. ఓ చర్చ మొదలైంది. వాళ్ల నిబంధనలను పక్కకుపెట్టి ప్రయత్నించి చూద్దామనుకున్నారు. ఆమెకు కూడా కనువిప్పు కలిగించాలనుకున్నారు.

కానీ, ఆమె అందరి అంచనాలను తారుమారుచేస్తూ ఆరు నెలలోనే కేవలం కాళ్లతోనే చార్టెడ్ ఫ్లైట్ నడిపింది. అమెరికాయే కాదు, మొత్తం ప్రంపంచం ఆశ్చర్యపోయింది. మనిషి ఆత్మవిశ్వాసానికి ఆకాశం కూడా సరిపోదని ఋజువు చేసిన గొప్ప మహిళ జెస్సికా.

అమెరికాలోని అరిజోన రాష్ట్రంలో 1983లో జస్సికా జన్మించింది. ఆమెకు పుట్టుకతోనే రెండు చేతులు లేవు. ఇది అతి తక్కువ మందికి వచ్చే అరుదైన అవయవరహిత జననం.

ఇది చూసి ఏ తల్లిదండ్రులైనా గుండెలు బాదుకొని ఏడుస్తారు. కానీ, జెస్సికా తల్లిదండ్రులు ఏమాత్రం బయపడలేదు. కుమార్తెకు ధైర్యం చెప్పారు. కాళ్లతోనే చేతులు

చేసే పనులు చేయవచ్చని నూరిపోశారు. జెస్సీకాను వికలాంగులు చదివే బడిలో కాక, మామూలు బడిలో చేర్పించారు. ఐదేళ్ల వయసులో కృత్రిమ చేతులు అమర్చారు. వాటితో ఆమె పన్నెండో ఏటివరకు పెరిగింది. కానీ, యుక్తవయసుకు ముందే ఆమెకో నగ్నసత్యం తెలిసింది. తనవికానివైన ఆ చేతులు ఎప్పటికైనా తనకు అండగా ఉండవని తెలుసుకుంది. అందుకే తన కాళ్లనే తనకు చేతులుగా మార్చుకొంది. ఆ కాళ్లు కూడా లేనివారు ఈ ప్రపంచంలో చాలామంది ఉన్నారని తెలుసుకుంది.

ఆమె ఆ కాళ్లతోనే రాయడం, తినడం, టైప్ చేయడం ఇంట్లో అన్ని పనులుచేయడం నేర్చుకొంది. అంతేకాదు, కారు డ్రైవింగ్ కూడా నేర్చుకొంది. తనకు చేతులు లేవనే లోటును క్రమంగా మర్చిపోయింది.

ఆమె అక్కడితో ఆగలేదు. తనను తాను రక్షించుకోడానికి స్వీయరక్షణ విద్యలు నేర్చుకుంది. అందులో ముఖ్యమైనవి "టైట్వాండో" ఇది కరాటెలాంటిది. చేతులతో, కాళ్లతో కిక్కులిచ్చి ప్రత్యర్థిని మట్టికరిపించాలి. జెస్సీకా తన కాళ్లతోనే చేతులు చేసే పనికూడా చేసి ప్రత్యర్థిని ఓడించి బ్లాక్‌బెల్ట్ వరకు ఎదిగింది.

ఇలా అంచెలంచెలుగా ఎదిగి, తన ప్రత్యేకతను ప్రదర్శించి అమెరికాలో దివ్యాంగులకు ఒక రోల్‌మోడల్‌గా, ఒక ఐకాన్‌గా మారింది.

ఎన్నో విశ్వవిద్యాలయాలు ఆమెచే స్ఫూర్తిదాయిక ఉపన్యాసాలు ఇప్పించాయి. ఆమె జీవితాన్ని డాక్యుమెంటరీగా తీసి పలు దేశాలలో ప్రదర్శింపచేశారు. వీటివలన ఎందరో దివ్యాంగులు జీవితంలో కృంగిపోకుండా కొత్త జీవితాన్ని ప్రారంభించారు.

ఈ విషయం అమెరికా ప్రెసిడెంట్‌కు తెలిసింది. జెస్సికాకు విమానం పైలెట్ సీటు ఇచ్చిచూడమని సూచించారు.

అంతే ఆమె ఆనందానికి అవధులు లేవు. ఈ మహత్తర అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విమానాన్ని కాళ్లతో నడిపి కొత్త రికార్డు సృష్టించింది. అధికారులు ఆమె ప్రతిభకు నివ్వెరపోయి లైసెన్స్ ఇచ్చారు. ఇప్పుడు ఆమె అందరు పైలెట్స్ లాగానే విమానం నడుపుతూ ప్రపంచం విస్తుపోయేలా చేస్తున్నారు.

# B. పేదరికాన్ని జయించి...

**అం**గవైకల్యం ఒక లోపమైతే, ఆ లోపాన్ని అధిగమించిన విజేతల గురించి తెలుసుకున్నాము. అలాగే వయసును ఎదిరించిన వీరులు, పెద్దగా చదువుకోకపోయినా విజయవిహారం చేసిన విజేతల గురించీ కూడా చదువుతాము.

మరి పేదరికం, ఇది లోపమేనా? ఏమో! పాత సినిమాల్లో పేదవాడైన హీరో హఠాత్తుగా అదృశ్యమైపోయి చాలా డబ్బు సంపాదించి ధనవంతుడిగా ప్రత్యక్షమవుతాడు. ప్రేక్షకులు సంతోషిస్తారు.

పేదరికం వరమా? శాపమా? వరమైతే కాదు. మరి శాపమా? ఏమో! కొన్నిసార్లు ఐశ్వర్యం కూడా శాపమే- **పేదరికాన్ని ఒక శాపంగా భావించి ఆ పేదరికంలో కూరుకుపోతారు కొందరు.** పేదరికాన్ని ఒక చాలెంజ్‌గా తీసుకొని దాన్ని గెలుస్తారు మరికొందరు.

అంబానీ సోదరుల తండ్రి దీరూబాయ్ అంబానీ ఒక పెట్రోల్‌బంక్‌లో ఉద్యోగి. కేవలం ఒక్క జీవితకాలంలో మనిషి ఊహకు కూడా అందనంత సంపద సృష్టించాడు. ఎలా సాధ్యమైంది. ఆయన దగ్గర ఏమైనా మంత్రదండం ఉందా? ఉంది! అదే ఆలోచనాశక్తి, ఆశావాదం కొంచెం ఎక్కువ తక్కువా మనందిరిలో ఈ శక్తులు ఉంటాయి. వాటిని ఉపయోగించుకోవాలి-పేదరికాన్ని జయించి చరిత్రలో తమకు కొన్ని అధ్యాయాల్ని సృష్టించుకోన్న విజేతల గురించి తెలుసుకుందాం.

# దీరూబాయ్ అంబానీ

**ఓ** మనిషి కోట్లకు పడగెత్తాలంటే చదువు అక్కర్లేదు. ఆర్థికంగా బాగున్న కుటుంబంలో పుట్టాల్సిన పనిలేదు. రోజువారి కూలి చేసే ఓ పెట్రోల్ డెలివరిబాయ్ కూడా పెట్రోల్ రిఫైనరీకి అధినేతకావచ్చని నిరూపించిన ఓ మహామనిషి దీరూబాయ్ అంబాని.

అతను దేశభక్తుడు కాదు, సంఘసేవకుడు అంతకంటే కాదు. త్యాగగుణం, కరుణ, దానగుణం కాలవాడు కూడా కాదు. ఓ సగటు మనిషి మనదేశంలో ఉన్న కోట్లాదిమంది సగటుమనుషులలో ఒకడు. ఓ సామాన్య మనిషి.

1932లో గుజరాత్‌లోని చార్‌వార్డ్ అనే చిన్న గ్రామంలో పుట్టాడు దీరూబాయ్ అంబాని. అతని తండ్రి ఓ బడిపంతులు. పొట్టపోసుకోవడమే కష్టంగా ఉన్న పేదల కుటుంబం. దీరుబాయ్ పదో తరగతి వరకు ఆ ఊళ్లోనే గవర్నమెంట్ స్కూల్‌లో చదివాడు. ఆ తరువాత చదివించలేని అతని తండ్రి చేతులు ఎత్తేశాడు.

అప్పటికే దీరుబాయ్ అంబాని అన్నయ్య ఓమెన్ దేశంలోని ఎడిన్ పట్టణంలో పెట్రోల్‌బంక్‌లో రోజువారి కూలీగా పనిచేసేవాడు. దీరుబాయ్ తండ్రి కూడా పదహారోఏట దీరుబాయ్‌ని అక్కడికి పంపాడు.

అన్నతోపాటు దీరుబాయ్ అంబాని పెట్రోల్ బంక్‌లో బాయ్‌గా పెట్రోల్ పోసేవాడు. రోజుకు ఎనిమిదిగంటల ఉద్యోగం చేసినా జీతం సరిపోయేది కాదు.

అందుకే దీరుబాయ్ పార్ట్‌టైమ్‌లో దగ్గర్లో ఉన్న షిప్‌యార్డులో కూలీ చేసేవాడు. అక్కడే అతని జీవితం మలుపు తిరిగింది. అది అంతర్జాతీయ షిప్‌యార్డ్. విదేశీయులు వచ్చేవాళ్లు. వాళ్లతో తప్పనిసరిగా ఇంగ్లీష్‌లో మాట్లాడవలసి వచ్చేది. వాళ్ల బ్యాగులు మోస్తూ వాళ్లతో ఎంతో చనువుగా మాట్లాడేవాడు. పరిచయాలు పెరిగాయి. అంతర్జాతీయంగా సరుకుల ఎగుమతులు, దిగుమతుల సుంకాలు, లైసెన్స్‌లు, ఇన్సూరెన్ససల గురించి బాగా తెలుసుకున్నాడు. దాదాపు పదేళ్లపాటు అక్కడే పనిచేసి రూబీలు, రూపాయలు పోగుచేసుకున్నాడు.

1957లో ముంబాయ్‌కి వచ్చిన దీరుబాయ్ అంబాని కేవలం పదిహేను వేల రూపాయల పెట్టుబడితో ఓ చిన్న గదిలో రిలయన్స్ కమర్షియల్ కార్పొరేషన్ అనే సంస్థను స్థాపించాడు. కేవలం రెండు బల్లలు, నాలుగు కుర్చీలు, ఒక టెలిఫోన్, ఒక్క జీతగాడితో ఆ ఇరుకుగదిలో కూర్చునేవాడు. ముందుగా మషాలాలను విదేశాలకు ఎగుమతి చేయడం మొదలుపెట్టాడు. ఆనాడు ఏర్పరుచుకున్న పరిచయాలు అతనికి బాగా కలిసొచ్చాయి. విదేశాల్లో ఉండే భారతీయులు ఆ మషాలాలను ఎగబడి కొనేవారు. ఆ తరువాత కాటన్ ధర మనదేశంలో చాలా చవక. విదేశాల్లో కాటన్ ధరలు విపరీతంగా ఉన్నాయి. అందుకే రెండో అడుగులో టెక్స్‌టైల్స్ రంగంలోకి అడుగుపెట్టాడు. కాటన్ దారాల రీమ్‌లను విదేశాలకు తక్కువ ధరలకు అమ్మడంతో లాభాలపంట పండింది. కేవలం ఎగుమతుల మీదే కాకుండా దిగుమతులమీద కూడా దృష్టిపెట్టాడు.

విదేశాలలో చవకగా దొరికే టెరికాటన్, పాలియస్టర్, నైలాన్ దారాల రీమ్‌లు దిగుమతి చేసుకుని 'విమల్' టెక్స్‌టైల్స్ ముంబాయిలో స్థాపించాడు. అత్యుత్తమ నాణ్యతను తక్కువ ధరలకు అమ్మడం, సినిమా గ్లామర్‌తో ప్రకటనలు గుప్పించడం మొదలైంది. బట్టలు అమ్ముకోడానికి సినిమా గ్లామర్‌ని వాడుకున్న తొలి వ్యాపారిగా దీరుబాయ్ వార్తల్లోకి ఎక్కాడు. సినిమా హీరోలు 'విమల్' కంపెనీ వ్యాపార ప్రకటనకు నటించడం ఓ గౌరవంగా భావించేస్థాయికి తీసుకెళ్లాడు.

అతని కంపెనీలో డబ్బు పెట్టిన ఇన్వెస్టర్లకు లాభాలు చూపాడు. ఓ వెయ్యిమందిని ధనికులుగా మార్చాడు. అది చూసి లక్షలాది మంది తమ పెట్టుబడులను రిలయన్స్‌లో పెట్టడానికి క్యూకట్టారు.

అంతే, 58 వేల మంది ఇన్వెస్టర్లను పోగుచేసిన దీరూబాయ్ అంబానీ టెలిఫోన్ రంగం, పెట్రోల్, కెమికల్స్ రంగం, ఐ.టి.రంగం, రియల్ ఎస్టేట్ రంగాలకు పెట్టుబడులు పెట్టించాడు. లాభాలు ఎలా సంపాదించాలో తెలిసిన వ్యక్తిగా జయకేతనం ఎగురవేశాడు.

జూలై 2, 2002లో ఆయన కన్నుమూశాడు. మనదేశంలోనే అత్యుత్తమ రెండో గౌరవ అవార్డు పద్మవిభూషణ్‌తో భారత ప్రభుత్వం సన్మానించింది. ఆయన చనిపోయేనాటికి ఆయన ఆస్తివిలువ దాదాపు 7.5 బిలియన్ డాలర్లు.

# అక్కినేని

**డా.** అక్కినేని నాగేశ్వరరావు (ఎ.ఎన్.ఆర్), నేటి తరానికి తెలియాలంటే నాగార్జున తండ్రిగారు, నాగచైతన్య తాతగారు–పేదరికంలో పుట్టి పేదరికాన్ని జయించి గొప్ప సంపదని, కళా సామ్రాజ్యాన్ని, కళా వారసత్వాన్ని తెలుగు ప్రజలకు అందించిన మహనీయుడు. గెలుపుకు పేదరికం, అవిద్య అడ్డుకాదని నిరూపించిన విజేత.

ఆయన సంఘసంస్కర్త కాదు. ఓ శాస్త్రవేత్త కాదు. రాజకీయవేత్త కాదు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అంతకంటే కాదు. అందుకే ఆయన చనిపోయిన రోజు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రానికి అధికారికంగా సెలవు ఇవ్వలేదు. కాని ఆంధ్రప్రదేశ్ ప్రజలు అనధికారికంగా సెలవు పాటించారు. ప్రజలు ఆయన మరణవార్తను జీర్ణించుకోలేక శోకసంద్రంలో మునిగారు.

ఎందుకంటే చనిపోయింది ఓ నటుడు కాదు, మొదటితరం సినీయుగం నుంచి, 91 ఏళ్ల వయసువరకు, మూడు తరాల ప్రేక్షకుల అభిమానం పొందిన ఏకైక నటఘనుడు. తెలుగు సినిమా పురుడు పోసుకున్న నాటి బ్లాక్ అండ్ వైట్ నుంచి నేటి డిజిటల్ సినిమా వరకు 75 సంవత్సరాలపాటు ఏకధాటిగా 255 సినిమాలలో హీరోగా నటించిన ఘనత ప్రపంచంలో ఒక్క అక్కినేని నాగేశ్వరరావుగారికే దక్కింది. ఏ నటుడు, ఏ నటి అందుకోలేని ఎవరెస్ట్‌ను ఎక్కిన ఈ బహుదూరపు 'బాటసారి' జీవితంలో ఎన్నో... ఎన్నెన్నో మరపురాని మజిలీలు. ఒక్కొక్క మజిలీకీ ఓ చరిత్ర వుంది. ఒక్కొక్క చరిత్రకు ఎన్నో పుటలున్నాయి. మచ్చుకు కొన్ని మజిలీలు...

డా॥అక్కినేని నాగేశ్వరరావుగారు 1923 సెప్టెంబర్ 20లో రామాపురం గ్రామం, గుడివాడ తాలూకా, కృష్ణా జిల్లాలో అక్కినేని వెంకటరత్నం, పున్నమ్మ దంపతులకు జన్మించారు. చిన్నప్పటి నుంచే ఆయనకు నాటకాలంటే ఎంతో ఆసక్తి. దానిని తల్లిదండ్రులు ప్రోత్సహించారు. ఆ రోజుల్లో స్త్రీలు నాటకాలు వేసేవాళ్లుకాదు అందుకే ఆయన స్త్రీ పాత్రలు వేస్తూ ప్రేక్షకుల మన్ననలు పొందారు. ఆయనకు బడికి వెళ్లే ఆసక్తి లేదు. ఇక గుడికి వెళ్లే అవసరం రాలేదు. అదృష్టం, అవకాశాలు దానికవే వెతుక్కుంటూ వచ్చాయి.

1941లో పి.పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన 'ధర్మపత్ని' సినిమాతో బాల నటుడిగా తెలుగు తెరకు పరిచయమయ్యారు. ఆ తరువాతా 1944లో ఘంటసాల బలరామయ్య దర్శకత్వంలో వచ్చిన 'సీతారామ జననంలో పూర్తిస్థాయి నటుడిగా నటించారు. అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూసుకోకుండా 2014 వరకు 75 సంవత్సరాలపాటు ఏకధాటిగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో కలిపి 255 సినిమాలలో హీరోగా నటించారు. ఈ 'బాటసారి' తన 91 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో మజిలీలు చేశాడు. సాంఘిక, జానపద, పౌరాణిక, చారిత్రాత్మక చిత్రాలలో ఆయన వేయని పాత్ర లేదు. ఏ పాత్ర వేసినా దాంట్లో సహజసిద్ధంగా ఇమిడిపోవడం ఆయన ప్రత్యేకత.

తెలుగు సినిమా పరిశ్రమ హైదరాబాద్‌కి తరలిరావాలనే పట్టుదలతో డా॥అక్కినేని నాగేశ్వరరావు గారు 1975లో హైదరాబాద్‌లో అన్నపూర్ణ స్టూడియోని నిర్మించారు. సినిమాకు కావలసిన అన్ని సదుపాయాలు కల్పించి ఈనాడు తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌లో స్థిరపడటానికి ఎన్నో కష్టనష్టాలు భరించారు. ఓ నిర్మాతగా మారి ఎందరో దర్శకులను, సాంకేతిక నిపుణులను పరిశ్రమకు పరిచయం చేసి ఎన్నో విజయవంతమైన సినిమాలు తీసారు. అన్నపూర్ణ ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ స్థాపించి ఎన్నో సినిమాలను విజయవంతం చేసారు.

2011లో అన్నపూర్ణ ఇంటర్‌నేషనల్ స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్థాపించి ఎందరో కొత్త నటీనటులను తయారు చేసారు.

భారత ప్రభుత్వం సినీ లెజెండ్‌లకు ఇచ్చే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'దాదా సాహెబ్ ఫాల్కే' అవార్డుతో 1991లో డా॥అక్కినేని నాగేశ్వరరావు గారిని సత్కరించింది. పద్మశ్రీ, పద్మవిభూషణ్ అవార్డులు కూడా అందుకున్నారు.

డా॥అక్కినేని నాగేశ్వరరావుగారి మాటల్లో చెప్పాలంటే డబ్బు సంపాదించడం చాలా తేలిక. కాని ఎదుటి మనిషి అభిమానాన్ని సంపాదించడం చాలా కష్టం. సంపాదించిన ఆ అభిమానాన్ని కలకాలం నిలబెట్టుకోవడం ఇంకా కష్టం. చదువుకోని ఓ రైతుబిడ్డ తన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకుని, వాళ్ల మనసులో శాశ్వతంగా నిలిచిపోయిన ఘనత డా॥అక్కినేని నాగేశ్వరరావుగారికి దక్కింది. అన్నిటికి మించి, గ్రామీణ నేపథ్యం, అవిద్య, పేదరికం ప్రగతికి అడ్డుకాదని నిరూపించిన విజేత.

# ఎల్.వి.ప్రసాద్

ప్రసాద్ ఐమాక్స్, జంటనగరవాసులకు పెద్ద తెరలను, సినిమా వీక్షణలో కొత్త అనుభూతులను అందించిన థియేటర్. ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, కంటి వ్యాధుల చికిత్సకు భారతదేశంలోనే పేరెన్నికగన్న సంస్థ. వీటికి ఆద్యుడు ఎల్.వి.ప్రసాద్. నటుడుగా, నిర్మాతగా, దర్శకుడుగా తెలుగు, తమిళ, హిందీ చిత్రసీమలో ఒక వెలుగు వెలిగారు. మనదేశం చిత్రదర్శకునిగా ఎన్.టి.ఆర్‌ను చిత్రసీమకు పరిచయం చేసిన ఘనుడు. ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కె అవార్డును అందుకున్నారు. కడు బీదరికంలో జన్మించినప్పటికీ, దాన్ని జయించి గెలుపు శిఖరాల్ని అదిరోహించిన విజేత.

పేదరికం శాపం కాదు... అది అసలు ఓ లోటు కూడా కాదని ప్రపంచంలో ఎందరో రుజువు చేశారు. నా దగ్గర లక్ష రూపాయలు ఉండుంటే నేను దానిని కోటిరూపాయలుగా మార్చేవాడిని, నేను గొప్పింట్లో పుట్టివుంటే పెద్ద హీరోగా ఎదిగే వాడిని లాంటి మాటలు మనం తరచూ వింటూంటాం. అవన్నీ కేవలం కుంటిసాకులు మాత్రమే. పేదరికం ఎప్పటికీ పైకొచ్చే వాడికి అడ్డుగోడకాదని రుజువుచేసిన మహానుభావులు ఎందరో ఉన్నారు. అందులో మొదటి వరుసలో ఉంటాడు ఎల్.వి.ప్రసాద్. పూర్తిపేరు అక్కినేని లక్ష్మీవరప్రసాద్‌రావు. అతను జనవరి 17, 1908 సంవత్సరంలో అక్కినేని శ్రీరాములు, బసవమ్మలకు సోమవరప్పాడులో గ్రామం (ఏలూరు)లో పుట్టారు. చాలీచాలని సంపాదనతో పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రసాద్‌కి చిన్న తనంలోనే సినిమాలు చూసే అలవాటు. తినడానికి డబ్బు లేకపోయినా అప్పుచేసి అతడు మూకీ సినిమాలు చూసి కడుపునింపుకునేవాడు. నాటకాలు, నాటికలు చూడ్డమేకాదు, అందులో చిన్న చిన్న వేషాలు వేసేవాడు.

అప్పటికే అతను ఇంటింటికీ వెళ్లి గ్రామంలో అరటిపళ్లు అమ్ముకునేవాడు. చిన్నప్పుడు తన తల్లి తరచూ అనేది నా కొడుకు చంద్రుడిలా వెలిగిపోతున్నాడని. ప్రతి తల్లి అనే మాటలే ఆ మాట అతనిలో నాటుకుపోయింది. ఎప్పటికైనా సినిమా హీరో

కావాలని కలలు కనేవాడు. తెరమీద కనిపించే హీరోలో తననుతాను చూసుకుని పగటికలలు కనేవాడు.

కలలు కంటే సరిపోదు, వాటిని సాకారం చేసుకోవాలి. ఆ దిశగా కృషి చేయాలని సినిమా ద్వారా నేర్చుకున్నాడు.

అప్పట్లో సినిమారంగం మద్రాసులో ఉండేది. అక్కడికి వెళతానని, హీరోగా మారివస్తానని తల్లిదండ్రులతో చెప్పాడు. ఇంట్లో తిట్టారు. స్నేహితులు నవ్వారు. దానికి తండ్రి ఎంతో కృషి కావాలని, సినిమారంగంలోని పెద్దలతో పరిచయాలు ఉండాలని, ముందు నటన నేర్చుకోవాలని బుజ్జగించాడు.

కాని మనసు సినిమాల మీదే ఉంది. ఇంట్లో నుండి ముంబాయ్ పారిపోయి స్టూడియోలో బాయ్‌లా మారి అందరికి టీలు అందించసాగాడు. ఆ తరువాత లైట్‌బాయ్‌గా మారాడు. ఆనాడున్న హెవీలైట్లను మోస్తూ హీరోలను, వాళ్ల నటనను గమనించేవారు. అలా లైట్‌మెన్‌గా కష్టపడుతూనే దర్శకులను మచ్చిక చేసుకుని అసిస్టెంట్ డైరెక్టర్‌గా మారాడు. కాని నటుడిగా పనికిరావని అందరూ దూరముంచారు. కనీసం దర్శకుడిగా మారాలని అదే పట్టుదలతో కృషిచేశాడు. కాని అది కూడా అంత సులువుకాదని ప్రాక్టికల్‌గా తెలిసింది.

ఇంపీరియల్ ఫిల్మ్ కంపెనీ తీసిన 'ఆలం హల' తొలి ఇండియన్ టాకి సినిమాలో చాలా చిన్న వేషం లభించింది. ఇప్పుడు ఇలాంటి వేషాలను వేసే వాళ్లను జూనియర్ ఆర్టిస్ట్‌లు అంటారు. ఆ కంపెనీలో నెలకు 30 రూపాయల ఉద్యోగం కుదిరింది. ఆ సినిమాల్లో లాంగ్‌షాట్‌లో కనిపించే వాచ్‌మెన్, చౌకిదార్‌లాంటి చిన్న చిన్న వేషాలు (ముఖం కనిపించదు) అతనిచేతే వేయించి, అన్ని పనులు చేయించుకునేవారు. అప్పుడే ప్రముఖ నిర్మాత దర్శకుడు హెచ్.ఎమ్‌రెడ్డితో పరిచయం అయ్యింది. అది అతని జీవితంలో కొత్తమలుపు.

అతను ప్రసాద్‌కి తొలి టాకి తెలుగు సినిమా 'భక్త ప్రహ్లాద' తొలి తమిళ టాకీ సినిమా 'కాళిదాసు'లో చిన్న వేషాలిచ్చి ప్రోత్సహించాడు. ఈ వేషాలు వేస్తూనే అవిషా దర్శకత్వంలో వెలువడ్డ 'కదమ్–అల్–జమాన్' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాడు.

ఆ సమయంలోనే నాటి సూపర్‌స్టార్ పృధ్వీరాజ్ కపూర్ పరిచయం అయ్యింది. రాజ్‌కపూర్ నటించిన తొలిసినిమా 'శారద'లో చిన్నవేషం దొరికింది.

అక్కడ్నుంచి అతను మద్రాసుకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా వెళ్లాడు. 1943లో 'గృహ ప్రవేశం' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసాడు. కాని కొన్ని నాటకీయ పరిణామాల మధ్య ఆ సినిమా దర్శకుడిగా మారాడు. ఆ సినిమా విజయవంతం కావడంతో అతను వెనక్కి తిరిగి చూడలేదు. 1946లో ప్రసాద్ దర్శకత్వంలో రానున్న 'మనదేశం' సినిమాలో ఎన్.టి.రామారావులోని ప్రతిభను చూసి తొలిసారి మేకప్ వేయించి ఇన్స్‌పెక్టర్ గెటప్ ఇచ్చాడు. అక్కడి నుంచి శివాజి గణేషన్ లాంటి ఎందరో నటీనటులను ఆయన వెండితెరకు పరిచయం చేశాడు.

**ప్రసాద్ ప్రొడక్షన్ స్థాపించి ఎంతో జాగ్రత్తగా తెలుగు తమిళ, హిందీ సినిమాలు తీశారు.** అతను తీసిన 'బాయ్–బెహెన్' సినిమా ద్వారా జమునను హిందీ రంగానికి పరిచయం చేశారు. సునీల్‌దత్‌కి హీరోగా వేషమిచ్చి ప్రోత్సహించారు.

అప్పట్లో సినిమాలు చాలా ఒడుదొడుకులకు లోనయ్యేవి. రోడ్డుమీద పడ్డ నిర్మాతలను కళ్లారా చూశాడు. అందుకే అప్పట్లో సేఫ్‌గా ఉండి ప్రసాద్ ల్యాబ్‌ని నిర్మించారు. ఇందులో లాభాలు నిలకడగా ఉంటాయి. అందులో కూడా విజయం సాధించి మద్రాస్, హైదరాబాద్, ముంబయ్, కలకత్తాలలో ప్రసాద్ ల్యాబ్‌ల శాఖలను విస్తరించారు. అక్కడ నుండి వెనక్కి తిరిగి చూసుకోకుండా **దర్శకుడిగా, నిర్మాతగా,** స్టూడియో అధినేతగా, ల్యాబ్ అధినేతగా, **అవుట్‌డోర్ యూనిట్ అధినేతగా** తెలుగు, తమిళ, హిందీ సినిమా రంగాలలో అగ్రగామిగా ఎదిగి చివరికి **దాదాసాహెబ్ పాల్కె అవార్డు అందుకొని తెలుగువాళ్లు గర్వించే స్థాయికి చేరుకున్నారు.**

# C. డిగ్రీలు లేని గెలుపు

గెలవాలంటే గ్రాడ్యేయ్యుట్ అయ్యుండాలా? లేదా పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కావాలా? పి. హెచ్. డి. కంపల్సరీనా? అసలు గెలుపుకు కావాల్సిన విద్యార్హతలేంటి?

గెలవాలంటే ఎంత పర్సంటేజ్ మార్కులు కావాలి. ఫస్ట్‌క్లాసు కావాలా? లేదా డిస్టింక్షన్ రావాలా?

ఈ ప్రశ్నలకు ఎవ్వరూ సమాధానం చెప్పలేరు. ఎందుకు?.... అందరికి తెలుసు గెలుపుకు మార్కులకు సంబంధం లేదని. గెలుపుకు డిగ్రీలు అవసరం లేదని -మరెందుకు పిల్లలపై మార్కుల ఒత్తిడి. ప్రతి తల్లికి తన పిల్లవాడు క్లాస్‌లో ఫస్ట్ రావాలనే కోరిక. ఒక క్లాసులో ఎన్ని ఫస్ట్‌ర్యాంకులు ఉంటాయి?

ఒక్కసారి నా లైఫ్‌లో స్కూల్ డేస్ నుండి యూనివర్శిటీ చదువుల వరకు నా క్లాస్‌మేట్స్‌ని గుర్తుకు తెచ్చుకుంటే నాకు అర్థమైందేంటంటే **టాప్ రాంకర్లందరూ టాప్ పొజీషన్‌లో ఏమీలేరు, బ్యాక్ బెంచర్స్ జీవితంలో వెనుకపడిపోయిందీ లేదు.** పోస్ట్‌గ్రాడ్యుయేషన్ మా క్లాస్ ఫస్ట్‌ర్యాంకర్ జూనియర్ కాలేజి లెక్చరర్‌గా స్థిరపడ్డాడు. మొదటి పది రాంకులలో కూడా లేని మరో క్లాస్‌మేట్ తరువాత పి. హెచ్. డి. చేసి అదే యూనివర్శిటీలో లెక్చరర్‌గా చేరి ప్రొఫెసర్‌గా ఎదిగి చివరకు తను చదువుకున్న యూనివర్శిటీకే వైస్ ఛాన్సలర్ కూడా అయ్యాడు.

మార్కులకు ఆశపడటం, ర్యాంకుల కోసం ప్రయత్నించడం మంచిదే. కానీ చదువులంటే మార్కులనే అపోహ వద్దు. ర్యాంకుల కోసం పిల్లలపై ఒత్తిడి అసలే వద్దు.

మంచి మార్కులు తెచ్చుకోలేక పోవడం, డిగ్రీలు చదవకపోవడం ప్రగతికి అడ్డంకి కాదు. ఇంటర్మీడియట్‌లో ఎకనామిక్స్‌లో ఫెయిల్ అయిన నా స్నేహితుడు తరువాత ఎకనామిక్స్ ప్రొఫెసర్ అయ్యాడు. ఇంటర్మీడియట్ స్టూడెంట్స్‌కి పుస్తకాలు రాసాడు.

విద్యార్థి దశలో వ్యసనాలకు లోనై, లేదా స్నేహితుల వలనో, లైఫ్‌ని ఎంజాయ్ చేద్దామనో చాలామంది చదువును అశ్రద్ధ చేస్తారు. అలాంటి వారు నిరాశపడాల్సిన అవసరం లేదు. జీవితాన్ని ఎక్కడనుంచైన పునర్‌నిర్మించుకోవచ్చు. "ఎవిరిడే ఈస్ ఫస్ట్ డే పర్ రెస్ట్ ఆఫ్ యువర్ లైఫ్" ప్రతిరోజు కొత్త జీవితానికి తొలిరోజు.

మనందరికి తెలుసు. బిల్‌గేట్స్ కాలేజి డ్రాపవుట్ అని. మనం టి.వి.లో ప్రతిరోజు చూసే లలితా జ్యూవెలరీస్ అధినేత కిరణ్‌కుమార్ స్కూల్ డ్రాపవుట్. నాలుగో తరగతిలో చదువు మానేసాడు. కడు పేద కుటుంబం. ఐనప్పటికీ పదివేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించాడు.

మనం జాగ్రత్తగా పరిశీలిస్తే మన ఊర్లోనే ఎక్కువ చదువుకోనప్పటికీ విజేతలైన వారు కొందరు తప్పక ఉంటారు. అలాగే మన జిల్లాలో మన రాష్ట్రంలో వందల్లో వేలల్లో ఉంటారు. ఒకవేళ మీరు కూడా చదువుని అశ్రద్ధ చేసిన వ్యక్తి ఐనప్పటికీ నిరుత్సాహపడవలసిన అవసరం లేదు.

గొప్ప డిగ్రీలు లేనప్పటికీ విజేతలైన ముగ్గురు వ్యక్తుల్ని మీకు పరిచయం చేస్తున్నాను.

# సరిపల్లి కోటిరెడ్డి

**నా**మటుకు అయితే ఆయనది అత్యంత స్ఫూర్తిదాయక వ్యక్తిత్వం. సంపదలో బిల్‌గేట్స్‌తో సరితూగక పోవచ్చు గానీ, ఆయన కంటే గొప్పవాడుగా పరిగణించవచ్చు. మన గ్రామంలో మన ఇంటిపక్కనే ఉండే ఈ వ్యక్తి జీవితంలో సాధించిన అద్భుత విజయాలు ఒక సినిమా కథకు సరిపోతాయి.

స్కూల్లో చదివే రోజులలో ఆయన చదివిన మహనీయుల జీవితచరిత్రలు తన జీవితాన్ని ప్రభావితం చేశాయంటారు. యవ్వనదశలో విజేతల ఆత్మకథలు (కనీసం వాట్సప్‌లోనైనా) చదవటం ఉపయోగకరం. ఎప్పటికైనా నా కొడుకు గొప్పవాడవుతాడు అని తల్లి తరచుగా చెప్పే మాటలు అతన్ని ఉత్తేజపరిచేయి. పేరెంట్స్ పిల్లల్ని నిరుత్సాహపరచకూడదు. ఎప్పుడూ ఎన్‌కరేజ్ చేయాలి.

కోటిరెడ్డి 80వ దశకంలో ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, గుడివాడ పక్కన జొన్నపాడు గ్రామంలో పుట్టారు. ఆ గ్రామంలోనే ప్రభుత్వ పాఠశాలలో పదవతరగతి పాస్ అయ్యాడు. తండ్రి సాధారణ రైతు. తిండికి, బట్టకు కూడా సరిపడని ఆదాయం, పేదరికం. కాలేజి చదువులు చదివించలేని నిస్సహాయత.

కోటిరెడ్డి స్నేహితులంతా కాలేజీలో చేరిపోయారు. నిక్కరు నుండి పాంట్‌కి స్కూల్ నుండి కాలేజికీ ప్రమోషన్ పొందారు. అయినా కోటిరెడ్డి నిరుత్సాహపడలేదు, ఎందుకంటే అతను అప్పటికే మహనీయుల ఆత్మకథలు చదివాడు. విజేతలందరూ కష్టాలను దాటుకొని గెలుపును అందుకుంటారనీ అతనికి తెలుసు.

కానీ, తల్లి మనసు గిలగిల లాడింది. అందరు పిల్లలు కొత్తబట్టలు కుట్టించుకొని కాలేజికి వెళ్తుంటే తన కొడుకు అటు కొత్తబట్టలు లేక ఇటు కాలేజి చేరక ఎందుకు బాధపడాలి అని కలవరపడింది. తల్లి అతికష్టం మీద వెయ్యిరూపాయలు జమచేసి కొడుకు చేతిలో పెట్టి కొత్తబట్టలు కొనుక్కోమంది.

గుడివాడవచ్చి, ఆ వెయ్యి రూపాయలు ఫీజుకట్టి, కంప్యూటర్ కోర్సులో చేరాడు కోటిరెడ్డి. కానీ బట్టలు కొనుక్కోమని ఇచ్చిన డబ్బులుతో కంప్యూటర్ కోర్సు ఫీజు కట్టినందుకు ఇంటికెళ్ళగానే నాన్న పెళ్ళి చేస్తాడని ఊహించి ఉండడు. అంతేకాదు, తను నాటిన ఈ వెయ్యిరూపాయల విత్తనం 20 సంవత్సరాలలోనే పెరిగి పెద్దదై వెయ్యి కోట్ల వ్యాపారసంస్థగా విస్తరిస్తుందని అస్సలు ఊహించి ఉండడు. ఐనప్పటికీ అప్పుడప్పుడే ఊపందుకుంటున్న కంప్యూటర్ రంగానికి మాత్రం ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సరిగ్గానే ఊహించాడు మన కోటిరెడ్డి.

కొత్త కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటూ, అదే సంస్థలో ఫేకల్టీగా పనిచేస్తూ జీవనోపాధి సృష్టించుకున్నాడు. నిప్పు గుప్పెట్లో ఎంతసేపని ఉండగలదు? తన ఎదుగుదలకు గుడివాడ సరిపోదని నిర్ణయించుకొని జేబులో వెయ్యిరూపాయల్తో హైదరాబాద్ చేరుకున్నాడు. ఇక్కడ అసెంబుల్డ్ కంప్యూటర్లు అమ్ముతూ, చిన్న చిన్న ప్రోగ్రాంలు డెవలప్ చేస్తూ కొత్త జీవితానికి తెరతీసాడు. మొదట్లో బాగానే సాగినా తరువాత కష్టనష్టాలు నిరాశ..... ఒక స్టేజీలో ఆత్మహత్య చేసుకోవాలనే తలంపు కూడా వచ్చింది.

కొంతకాలానికి జావా సర్టిఫికెట్ తీసుకొని మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగానికి అప్లై చేసాడు. టెలిఫోన్ ఇంటర్వ్యూలో ఇతని టెక్నికల్ స్కిల్స్‌కి మెచ్చి ఉద్యోగం ఇస్తానికి సిద్ధపడ్డారు. ఇతని బేసిక్ క్వాలిఫికేషన్ టెన్త్‌క్లాస్ మాత్రమేనని తెలుసుకొని షాక్ అయ్యారు. గ్రాడ్యుయేషన్ కూడా పూర్తి చేయని వానికి మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగం ఇవ్వలేమన్నారు. కాలేజి డ్రాప్‌అవుట్ అయిన బిల్‌గేట్స్ మైక్రోసాఫ్ట్ స్థాపించినపుడు. గ్రాడ్యేయేషన్ చదవని తను మైక్రోసాఫ్ట్‌లో ఎందుకు సరిపోడని ప్రశ్నించాడు. ఇతని లాజిక్ వారికి నచ్చిందో ఏమో, జాబ్ ఇచ్చేసారు.

అలా మైక్రోసాఫ్ట్ ఉద్యోగిగా అమెరికా పయనమయ్యాడు ఈ టెన్త్‌క్లాస్ సర్టిఫికెట్ హోల్డర్. అక్కడ అంచెలంచెలుగా ఎదిగి ఆసియా పసిఫిక్ హెడ్‌గా ఉంటూ వాషింగ్టన్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్, యు.ఎస్. ప్రెసిడెంట్ ఇన్నోవేషన్ అవార్డు కూడా 2012లో అందుకున్నారు.

పది సంవత్సరాల తర్వాత, ఇండియా తిరిగివచ్చి కోటిగ్రూప్ ఆఫ్ వెంచర్స్ ప్రారంభించాడు. ఇది ఇప్పుడు 750 కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. 160 దేశాలలో 70కోట్లమంది ప్రజలు ఈ కంపెనీ సేవలు ఉపయోగించుకుంటున్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ఎంతో చురుకుగా ఉండే ఈ విజేత తన లాభాల్లో మూడోవంతు సమాజానికి, మూడోవంతు ఉద్యోగులకు, మూడోవంతు తనకు అంటున్నారు.

వీలుంటే మరోసారి గూగుల్ లోకి వెళ్ళి ఈయన గురించి మరిన్ని వివరాలు తెలుసుకోండి. మీలో  కూడా మరో కోటిరెడ్డి ఉదయిస్తాడు.

# సింగిల్ డిజిట్

**క్లా**సులో ఫస్ట్‌ర్యాంక్ రావాలని పిల్లలు కోరుకోకపోయినా వారి పేరెంట్స్ మాత్రం పిల్లల్ని టార్చర్ పెడతారు. ఫస్ట్ ర్యాంక్ ఒక్కటే ఉంటుంది కదా. ఒక్కరికే వస్తుంది. అందుకే సెకండ్‌ర్యాంక్, థర్డ్‌ర్యాంక్ .... మొదటి పదిలో ఏదో ఒక రాంక్ వచ్చినా గొప్పే. అదే సింగిల్ డిజిట్ రాంక్ 'సింగిల్ డిజిట్ రాంక్ వస్తే ఎవరికైనా సంతోషమే, కానీ, అదే సింగిల్ డిజిట్ మార్కులు వస్తే... ఇంగ్లీషులో వందకు ఎనిమిది, సైన్స్‌లో వందకు ఆరు, లెక్కల్లో వందకు ఐదు... రాకేష్ చోప్‌దార్ జీవితంలో ఇదే జరిగింది.

మనం ఏదో సినిమాలో చూసినట్లు "ఈ లెక్కలేంటో, ఈ సైన్స్ ఏంటో, ఈ పుస్తకాలేంటో, ఈ పరీక్ష లేంటో... అసలు ఈ అక్షరాలేంటో... అన్నట్లు ఉండేది రాకేష్ చదువు. పాఠశాల, పుస్తకాలు అతనిలో ఎలాంటి ఆసక్తి, కుతూహలం కలిగించలేక పోయాయి. పర్యవసానంగా 'స్కూల్ డ్రాపవుట్' అనే పట్టాపుచ్చుకొని స్కూల్ మానేశాడు మన హీరో.

మీకు తెలుసుకదా. మన సమాజంలో మన పిల్లల సంగతి మనం పట్టించుకోము గానీ పక్కవారి పిల్లలు ఏం చేస్తున్నారో మనకు కావాలి. అందరూ అడగటమే 'మీ అబ్బాయి స్కూల్ మానేశాడు కదా ఇప్పుడు ఏం చేస్తున్నాడు?" అలాగని రాకేష్ పేరెంట్స్ సంపన్నులేమీ కాదు. నట్స్ & బోల్ట్స్ తయారుచేసే ఒక వర్క్‌షాపు ఉంది, అంతే!

**దేవుడు మనిషికి మాత్రమే ఒక వరం ఇచ్చాడు. అదే 'ఆలోచనా శక్తి' రాకేష్ ఆలోచించడం ప్రారంభించాడు. తను చదువుల్లో ఎలాగూ ఓడిపోయాడు. జీవితంలో కూడా ఓడిపోవాల్సిందేనా? 'నో... అలా జరగడానికి వీల్లేదు' అని నిర్ణయించుకున్నాడు.**

నాన్నతో పాటు వర్క్‌షాపుకు వెళ్ళడం మొదలుపెట్టాడు. ఆ పనిమీద ఆసక్తి పెంచుకున్నాడు. **స్కూల్లో పుస్తకాలు నేర్పని చదువును వర్క్‌షాప్‌లో యంత్రాల నుండి నేర్చుకోడానికి ప్రయత్నించాడు. దాన్నే తన క్లాస్‌రూమ్‌గా చేసుకున్నాడు.** స్వయంగా

మెకానికల్ ఇంజనీరింగ్ ప్రాథమిక సూత్రాలు నేర్చుకున్నాడు. ఇంజనీరింగ్ చదవకపోయినా ఇంజనీరింగ్ నేర్చుకున్నాడు. కష్టపడ్డాడు. శ్రమని నమ్ముకున్నాడు. ఆ వర్క్‌షాపుని 'అజాద్ ఇంజనీరింగ్'గా అభివృద్ధి చేశాడు.

ఇప్పుడు అజాద్ ఇంజనీరింగ్, ఒక సాంకేతిక పరికరాల ఉత్పత్తి సంస్థ. ఇంజనీరింగ్ పరికరాలంటే సాదాసీదా స్పేర్ పార్టులు కాదు. విమానాలలో, రాకెట్ లలో ఇంకా మిస్సైల్‌లో వాడే బహు క్లిష్టమైన బాగాలు ఈ సంస్థ మాత్రమే తయారుచేయ గలుగుతుంది.

ఈ సంస్థ ఉత్పత్తులను స్కోడా, రోల్స్ రాయిస్, తోషిబా, మిత్సుబిషి లాటి అంతర్జాతీయ సంస్థలు ఉపయోగిస్తున్నాయి. అంతేకాదు అజాద్ ఇంజనీరింగ్ తయారుచేసే టర్బైన్ బ్లేడులు సుఖాయ్ జట్ ఫైటర్లకు, బ్రహ్మోస్ మిస్సైల్స్‌లో ఉపయోగిస్తున్నారంటే ఈ పరికరాల నాణ్యత ఈ సంస్థ విశ్వసనీయత మనం అర్థం చేసుకోవచ్చు.

మనం ముందే చెప్పుకున్నాంకదా, **జీవితం ప్రతి మనిషికి ఓడిపోయే పరిస్థితి కల్పించకపోవచ్చు. కానీ గెలిచే అవకాశం మాత్రం ప్రతి మనిషికి తప్పక కల్పిస్తుంది.** ఆ అవకాశం అందుకొని ఫస్ట్ డిజిట్ మార్కు నుండి ఫస్ట్ రాంకర్‌గా ఎదిగాడు మన రాకేష్.

# మొక్కను నమ్ముకొని....

**మొ**క్కను నమ్ముకొని మొక్కవోని విశ్వాసంతో గెలుపువైపు పరుగులు తీస్తున్న మరో లోకల్ హీరోని మీకు పరిచయం చేస్తున్నాను. బిల్‌గేట్స్, స్టీవ్ జాబ్స్, ఎలెన్ మస్క్ చాలామందికి తెలిసిన పేర్లే. కానీ వారు వందల కోట్లలో ఒక్కరు. **మనం వందల కోట్లలో ఒక్కరుగా కావాలనే లేదు. వందమందిలో ఒక్కడుగా ఎదిగినా చాలు. అందుకే ప్రపంచ విజేతల్ని మాత్రమే కాక స్థానిక విజేతల్ని కూడా తెలుసుకుందాము.**

ప్రద్యుమ్నరావు, రంగారెడ్డి జిల్లా (తెలంగాణ) కందుకూరు నివాసి. పేదరికం చదువుకు సహకరించలేదు. ఏదో ఒక పనిచేసి, కుటుంబాన్ని ఆదుకోవాల్సిన పరిస్థితి. పదిహేను సంవత్సరాల వయసులో కార్పెట్ (లాన్) గ్రాస్ అమ్మే నర్సరీలో పని కుదిరాడు. **8వ తరగతితో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టి కలాన్ని పక్కన పెట్టాడు, కానీ కలలను, మాత్రం సజీవంగా నిలుపుకున్నాడు.**

**ఉన్నది ఒకే ఒక షర్ట్. రాత్రులు శుభ్రం చేసుకోవాలి. పగలు తొడుక్కోవాలి. ఒక షర్టులో జీవించడమే కాదు ఉన్న ఒక్క జీవితాన్ని ఎలా అర్ధవంతంగా మలుచుకోవాలో కూడా నేర్చుకున్నాడు.**

రాళ్ళతో, గడ్డితో, మట్టితో మొక్కతో అనుబంధం పెంచుకున్నాడు. వాటిని ఉపయోగించి ఇల్లు, ఆఫీసులు, గెస్ట్ హౌసులు అందంగా, ఆహ్లాదకరంగా ఎలా తీర్చిదిద్దవచ్చో లాండ్‌స్కేపింగ్ మెలకువలు నేర్చుకున్నాడు.

నెట్ సెంటర్‌కి వెళ్ళి లాండ్ స్కాపింగ్ స్టైల్స్ స్టడీ చేసాడు. ఏకలవ్యునిలా తదేక దీక్షతో వివిధరకాల పద్ధతులు, వివిధ దేశాల లాండ్ స్కేపింగ్ విధానాలు క్షుణ్ణంగా నేర్చుకున్నాడు. ఏ స్థలాన్నైనా, ఎటువంటి ప్రాంతాన్నైనా ఆకుపచ్చని స్వర్గంలా మార్చగలిగే నేర్పుని, ఆత్మవిశ్వాసాన్ని గెలుచుకున్నాడు.

తొలి ప్రయత్నంగా తన వద్ద ఉన్న 300 రూపాయల్నించి 240 రూపాయలు పెట్టుబడిగా పెట్టి క్లాసిఫైడ్ యాడ్ ఇచ్చాడు... ఒక స్కూల్ ప్రిన్సిపాల్ స్పందించాడు. స్కూల్లో లాండ్‌స్కేపింగ్ పని అప్పగించాడు. ప్రద్యుమ్నరావు తన ప్రతిభ చూపాడు. అంతేకాదు పదిహేనువేలు లాభం కూడా చూసాడు. అంతే ఇక వెనుతిరిగి చూడలేదు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టు, రాయపూర్ ఎయిర్‌పోర్టు, చెన్నై అసెంబ్లీ, జయలలిత పోయస్ గార్డెన్ ఇల్లు, అరుణ్ జైట్లీ, అహ్మద్ పటేల్, గులాంనబీ అజాద్ గృహాలు ఆయన పూర్తిచేసిన కొన్ని ప్రాజెక్టులు. ప్రస్తుతం దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఆయన బృందాలు పనిచేస్తున్నాయి. సహజంగానే టర్నోవర్ కోట్లలో ఉంటుంది.

**జీవితంలో ఓడిపోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. కానీ గెలిచే అవకాశం కూడా ప్రతి మనిషికి దక్కుతుంది. మనసులో ఆశలు, కళ్లల్లో కలలు, కార్యాల్లో కసి, నిరంతర శ్రమ, నిజాయితీ మనిషిని గెలుపువైపు గెంటుతుంది. ప్రద్యుమ్న జీవితంలో అదే జరిగింది. మీకైనా, నాకైనా అదే తప్పక జరిగి తీరుతుంది.**

# D. గెలుపుకు వయోపరిమితి లేదు

ఆమధ్య సోషల్ మీడియాలో ఒక స్టోరీ చక్కర్లు కొట్టింది.

పదేళ్ల పిల్లవాడి స్నేహితుడు అనుకోకుండా బావిలో పడిపోతాడు. బావిలో పడిన స్నేహితుడి వయసు, బరువు కూడా ఈ పిల్లవాని కంటే ఎక్కువే. ఐనప్పటికి నూతిలోకి తాడు దించి స్నేహితుడ్ని ఒక్కడే పైకి లాగాడు. ఈ విషయం ఊర్లో ఎవరూ నమ్మరు, ఒక చిన్నపిల్లవాడికి ఇది సాధ్యం కాదు అంటారు. అప్పుడు ఒక పెద్దమనిషి సమాధానం చెబుతాడు "ఆ సమయంలో ఆ పిల్లవానికి నువ్వు లాగలేవు అని చెప్పటానికి ఎవరూ దగ్గర్లో లేరు. తను లాగగలనని నమ్మాడు, ప్రయత్నించాడు. సాధించాడు.

ఆంజనేయుడికి తన శక్తి తనకు తెలియదంటారు. మనందరిలో కూడా ఆంజనేయుని అంశ ఉంటుంది.

మన శక్తి మనకు తెలియదు. మన గురించి మనం మనకు తెలియకుండానే తక్కువగా అంచనా వేసుకుంటాము. మన ప్రతిభకు మనమే పరిధులు గీసి మన గమనాన్ని మనమే నిరోధిస్తాము. మన కళ్లకు మనమే గంతలు కట్టుకొని మన కాళ్ళకు మనమే సంకెళ్ళు తగిలించుకొని జీవిత పరుగు పందెంలో ఓడిపోతుంటాము.

ఒక తెలుగు మీడియం విద్యార్థి ఐ.ఎ.ఎస్ గురించి గానీ కార్పొరేట్ జాబ్ గురించి గానీ ఆలోచించలేడు. తను తెలుగు మీడియం కాబట్టి. అంత మంచి జాబ్స్‌కి తను అర్హుడు కాడని తనకు తానుగా ఊహించుకుంటాడు. వాస్తవానికి డిగ్రీ వరకు తెలుగు మీడియంలో చదివి కూడా ఐ.ఎ.ఎస్ సెలెక్ట్ అయినవారు ఎందరో.

ఈ మధ్య పేపర్లో కందుల శ్రీనివాస్ అనే ఆయన గురించి చదివాను. డిగ్రీ వరకు తెలుగు మీడియంలో చదివినప్పటికీ 50ఏళ్ల వయసులో కేప్‌జెమెనీ అనే మల్టీనేషనల్ కంపెనీకే చైర్మన్‌గా ఉన్నారు.

పేదరికంలో ఉన్నవారు, సామాజికంగా అణగారిన కులాలకు చెందినవారు వారికులం లేదా పేదరికం వారి ప్రగతికి ఆటంకం అనుకుంటారు. కానీ ఇది ఎల్లప్పుడూ వాస్తవం కాదు. ఈ వర్గాలకు చెందికూడా ఉద్యోగాలలో వ్యాపారాలలో, రాజకీయాలలో ఉన్నత స్థానాలకు చేరిన వారు ఎందరో ఉన్నారు.

తను ప్రతి విజయానికి అర్హుడనేనని ముందు నమ్మాలి. తన కలలకు, ప్రతిభకు పరిధులు, పరిమితులు విధించుకోవటం మానుకోవాలి.

ఒక నలభై సంవత్సరాల వ్యక్తిని కంప్యూటర్ నేర్చుకోమంటే ఈ వయసులో ఎలా వీలవుతుంది అని అనుకుంటాడు. కానీ వాస్తవానికి విజ్ఞానార్జనకు, విజయానికి వయోపరిమితి లేదు–సాహిత్యంలో నోబుల్ ప్రైజ్ సాధించిన రవీంద్రనాథ్ ఠాగూర్ 67 సంవత్సరాల వయసులో చిత్రకళను నేర్చుకొని గొప్ప పెయింటింగ్స్ వేశారు. తయబ్ మెహతా అనే భారతీయ చిత్రకారుడికి జీవితమంతా పోరాటమే. ముంబాయ్‌లోని ప్రతిష్ఠాత్మక జె.జె. ఇన్‌స్టిట్యూట్ నుండి డిగ్రీ స్వీకరించి చిత్రకళను జీవనోపాదిగా ఎంచుకున్నాడు. ఆయన జీవితమంతా కనీసావసరాలకు సరిపడ ఆదాయం కూడా పెయింటర్‌గా సంపాదించలేదు. కానీ ఆయనకు 75 సంవత్సరాల వయసు వచ్చాక ఆయన ఒక్క పెయింటింగే ఏడుకోట్లకు అమ్ముడుపోయింది. పేరు, ప్రఖ్యాతులు, అంతర్జాతీయ గుర్తింపుతోపాటు ధనరాసులను తెచ్చిపెట్టింది చిత్రకళ.

రవీంద్రనాథ్ ఠాగూర్ పెయింటర్‌గా ఆయన ప్రయాణం ఆలస్యంగా మొదలుపెట్టాడు. తయబ్ మెహతా పెయింటర్‌గా యుక్తవయస్సులోనే ప్రారంభించాడు. కానీ, ఇద్దరికీ విజయం దక్కింది.

మనందరికి గుర్తే. నాగార్జున హీరోగా నటించిన 'నువ్వు వస్తావని' సూపర్‌హిట్ మూవీ. దాని డైరెక్టర్ షిండే. అది ఆ డైరెక్టర్‌కి ఫస్ట్ హిట్. అప్పటికి అతని వయసు 60 సంవత్సరాలు. ఇండస్ట్రీకి వచ్చి 35 సంవత్సరాలు. అంటే షిండే తన తొలి విజయం కోసం 35 సంవత్సరాలు వేచి చూడాల్సి వచ్చింది.

మన కలలను నమ్ముకొన్నప్పుడు, వాటికోసం నిరంతరం శ్రమించినపుడు విజయం తప్పక వరిస్తుంది.

**ఎవ్రీడే ఈస్ ఫస్ట్ డే ఫర్ రెస్ట్ ఆఫ్ యువర్ లైఫ్ అంటారు. ఏ వ్యక్తికైనా ప్రతిరోజూ అప్పటి నుండి తను ప్రారంభించాలనుకునే కొత్త జీవితానికి అది తొలిరోజే.** ఏ వయసులోనైనా నూతన విజయాలు సాధ్యమేనని విజేతలు నమ్ముతారు. విజయానికి వయోపరిమితి లేదు. 60 సంవత్సరాల వయసు దాటి పోయిన తర్వాత కూడా జీవితాన్ని కొత్తగా నిర్మించుకొని గొప్ప విజయాల్ని సాధించిన ముగ్గురు వ్యక్తులను ఇక్కడ పరిచయం చేస్తున్నాను.

# కల్నల్ శాండర్స్–కె.ఎఫ్.సి

**చా**లా చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడే అంటే ఏడిస్తే తల్లి దగ్గరకు తీసుకుని ఎత్తుకొని ముద్దాడి లాలించవలసిన వయసులోనే తండ్రి మృతదేహంపై పడి భోరున విలపిస్తున్న తల్లిని చూసాడు. పెరిగి పెద్దవాడైన తరువాత అంతుచిక్కని వ్యాధితో కొడుకు అతని చేతుల్లోనే చనిపోయాడు. అంతేకాదు, తల్లి రెండో పెళ్ళి చేసుకోవటం వలన సవతి తండ్రి నిర్ణయం మేరకు బంధువుల ఇంట్లో పెరిగాడు. పది సంవత్సరాల వయసులో స్కూలు వదిలి బాలకార్మికుడుగా మారాడు. పద్దెనిమిది ఏళ్ళ వయసులో తను ప్రేమించిన స్త్రీని పెళ్ళిచేసుకొని ముగ్గురు పిల్లల తండ్రయ్యాక, సరైన ఉద్యోగం లేదన్న నెపంతో భార్య అతన్ని విడిచి వెళ్లిపోయింది. ఈ విధంగా అతని జీవితమంతా విషాదాలు ఋతువుల్లా క్రమం తప్పకుండా ఒకదాని తర్వాత ఒకటి వచ్చాయి. ఒక్క వసంత ఋతువు తప్ప.

పది సంవత్సరాల వయసులో పొలాల్లో బాలకార్మికుడుగా మొదలైన జీవితంలో– అతను చెయ్యని ఉద్యోగం లేదు, చేపట్టని వ్యాపారం లేదు. ఐనప్పటికీ జీవితమంతా కష్టాలు నష్టాలే. 63 సంవత్సరాల వయసులో కూడా తనకంటూ ఏమీ మిగుల్చుకోలేక కారులోనే నివాసం ఉండాల్సిన పరిస్థితి. ఇలాంటి వాడిని మనమైతే ఏమంటాం? “ఐరన్ లెగ్ ” అని ముద్రవేసి పక్కన పెడతాం. అవునా?

“జీవితమంటే అంతులేని ఒక పోరాటం, బ్రతుకు తెరువుకై పెనుగులాడటమే ఆరాటం–కృషి చేశావంటే, ఎదురీదావంటే సాధించేవు , గెలిచేవు నీదే జయం”. సంబరాల రాంబాబు సినిమాలో చలం పాట శాండర్స్ విన్నాడో లేదో గానీ జీవితంలో మాత్రం ఈ సత్యం నిరూపించాడు.

కల్నల్ సాండర్స్ 1890 అమెరికాలోని ఇలియానాలో జన్మించారు. ఆయన ఆర్మీలో పనిచేయనప్పటికి, కల్నల్ కేవలం ఒక బిరుదు, ఆర్మీలో హోదా కాదు. ఇదేవిధంగా మన మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిగారికి శాస్త్రి కేవలం ఒక డిగ్రీ

(విద్యార్హత) కులం కాదు. ఐదు సంవత్సరాల వయసులో సాండర్స్ తండ్రి చనిపోవటంవలన తల్లి సంరక్షణలో, శిక్షణలో పెరిగాడు. కుటుంబ పోషణ కోసం తల్లి పనికి వెళ్లడం వలన తమ్ముడు, చెల్లిని తనే చూసుకునేవాడు. వారికోసం రొట్టెలు, కేకులు ఇతర వంటలు చేయటం తల్లి దగ్గర నేర్చుకున్నాడు. ఈ వంటగది పరిచయమే భవిష్యత్తులో ప్రపంచమంతా గుర్తించిన వ్యక్తిగా శాండర్స్ పురోగతికి పునాది అని సాండర్స్ గానీ, తల్లి గాని ఊహించి ఉండరు.

తల్లి సంపాదన చాలకపోవటంవలన 12 సంవత్సరాల వయసులోనే చదువు మానేసి బాల కార్మికుడిగా మారాడు. అప్పటి నుండి ముప్పయి సంవత్సరాలపాటు అతను చేయని ఉద్యోగమంటూ లేదు.

గుర్రం బండ్లకు రంగులు వేయటం, వ్యవసాయం, ఇన్సూరెన్స్ ఏజెంట్, లాయర్, ఆర్మీజవాను, టైర్ల వ్యాపారం, ఫెర్రీబోటు డ్రైవరు, పెట్రోల్ సర్వీస్ స్టేషన్ మేనేజరు... ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన జీవితంలో అనేక మజిలీలున్నాయి.

జీవితంలో ఒక గమ్యం లేకుండా కేవలం బతుకు తెరువుకోసం అందుబాటులో ఉన్న ప్రతి పనీ చేసాడు. కొంతకాలంపాటు లాయర్ అవతారం కూడా ఎత్తాడు. మధ్యలో కొన్ని వ్యాపారాలు, ఇవేమీ అతన్ని ఆర్థికంగా నిలబెట్టలేకపోయాయి. ఎందుకంటే మన భాషలో చెప్పుకోవాలంటే ఆయనది ఐరన్ లెగ్!

నలభై సంవత్సరాల వయసులో చిన్నప్పుడు అమ్మ చేయించిన వంటలు గుర్తొచ్చి చిన్న రెస్టారెంట్ ప్రారంభించాడు. అప్పటి నుండి మరో ఇరవై సంవత్సరాల పాటు ఇదే వ్యాపారంలో కొనసాగుతూ కొత్త కొత్త రుచులు కస్టమర్లకు పరిచయం చేసాడు. ఇదే సమయంలో తనకి ప్రీతిపాత్రమైన కె.ఎఫ్.సి (కెంటకీ ఫ్రైడ్ చికెన్) ను పరిచయం చేసి రెస్టారెంట్ బిజినెస్‌లో లాభాలబాట పట్టాడు. ఈయన దురదృష్టానికి దత్తపుత్రుడు కదా! అంతా బాగానే ఉంది అనుకునే సమయానికి రెస్టారెంట్ ఉన్న హైవేని (రోడ్డు) మూసివేసి పక్కనుండి కొత్త రోడ్డు వేసింది ప్రభుత్వం. అంతే బెలూన్ పేలినట్లు సాండర్స్ రెస్టారెంట్ మూతపడింది.

కట్‌చేస్తే, 63 సంవత్సరాల సాండర్స్ రోడ్డున పడ్డాడు. ఉండటానికి ఇల్లు కూడా లేని శాండర్స్ రెండు సంవత్సరాలు కేవలం అతని కారులోనే నివసించాడు. ఎంతోమందికి

భోజనం వడ్డించిన శాండర్స్ తిండికోసం దిక్కులేనివారికి ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ మీద ఆధారపడాల్సి వచ్చింది.

ఈ పరిస్థితిలో ఎవరికైనా ఆత్మహత్య తప్ప వేరే దారి ఏముంటుంది–కానీ, **విజేతలకు ఓటమి అంటే ఏమిటో తెలియదు. విషాదాలు వారికి వింత పదం. వారికి తెలిసిందల్లా అనుకూల పరిస్థితుల్లో ఆనందించటం, ప్రతికూల పరిస్థితుల్లో పోరాడటం. శాండర్స్ అదే చేసాడు.**

తను తయారుచేసిన రెసిపీ, దాని రుచి అంటే సాండర్స్‌కు విపరీతమైన నమ్మకం. 12 రకాల వివిధ దినుసులు చొప్పించి అతను చేసే ఫ్రైడ్ చికెన్ రెసిపీతో హొటళ్ల చుట్టూ తిరిగాడు. 65 సంవత్సరాల వృద్ధున్ని ఎవరు సీరియస్‌గా తీసుకుంటారు. ఇతని రెసిపీని వాళ్ల రెస్టారెంట్‌లో అమ్మటానికి ఎవరూ ఒప్పుకోలేదు. అలా ఒకసారి కాదు, పదిసార్లు కాదు, వందసార్లు కూడా కాదు, 1009 సార్లు వేర్వేరు రెస్టారెంట్లలో తిరస్కరింపబడ్డాడు.

చివరికి ఒక రెస్టారెంట్ యజమాని ఈ ఫ్రైడ్ చికెన్‌ను తన హొటల్లో అమ్మటానికి ఒప్పుకొని లాభాల్లో కొంత శాతం సాండర్స్‌కు ఇచ్చాడు. కెంటకీ (ఊరు పేరు)లో ఈ ఫ్రైడ్ చికెన్ రుచి నచ్చి త్వరగా పాపులరై ఇతర రెస్టారెంట్లకు విస్తరించింది. ఆ విధంగా ప్రారంభించిన పది సంవత్సరాలలో 600 రెస్టారెంట్లకు విస్తరించి 1967 కల్లా అమెరికాలో కె.ఎఫ్.సి ఆరవస్థానానికి చేరుకుంది.

ఈరోజు 123 దేశాలలో, 20,000 ప్రాంతాలలో ఒక లక్షా అరవైవేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తుంది. మనం కె.ఎఫ్.సి. అక్షరాల మధ్య చూసే ఫోటో సాండర్స్‌దే. తన గతకాలపు విషాదాలను, ఓటముల్ని మనసునుండి చెరిపేసి, కొత్త జీవితానికి తెరతీసి 65 సంవత్సరాల వయసులో సాండర్స్ ప్రారంభించిన జైత్రయాత్ర మరో 25 సంవత్సరాలు అప్రతిహతంగా కొనసాగించి 90 సంవత్సరాల వయసులో ప్రాశాంతంగా కొన్నుమూసాడు సాండర్స్. విజయానికి వయోపరిమితి లేదంటే సాండర్స్ జీవితాన్ని చూసిన తరువాత మనం ఒప్పుకొని తీరాలి.

# ఐ.ఐ.టి.రామయ్య

**రో**జూ న్యూస్ పేపర్‌లో ఐ.ఎ.ఎస్/ఐ.పి.ఎస్ అధికారులు పాల్గొనే వేర్వేరు కార్యక్రమాల గురించి చదువుతాము. వారిపేరు అందరికీ పరిచయం అవుతుంది. ఒక్కసారి వారు రిటైర్ కాగానే వార్తల నుండి, ప్రజల జ్ఞాపకాల నుండి అదృశ్యమైపోతారు. ఉద్యోగి / అధికారి ఉనికి అతని హెూదాతో లింకై ఉంటుంది.

అందుకే ఉద్యోగవర్గాల్లో ఒక నానుడి "పుట్టిన ప్రతి మనిషికి చావు తప్పదు, అలాగే ఉద్యోగికి రిటైర్‌మెంట్ తప్పదు" ప్రచారంలో ఉంది. అంటే ఉద్యోగికి రిటైర్‌మెంట్ ఒక చావులాంటిది.

కానీ అరుదుగా కొద్దిమంది రిటైర్ అయిన తర్వాత కూడా పునర్జన్మ లాంటి కొత్త జీవితానికి స్వీకారం చుడతారు. ఆ కోవకు చెందినవారే ఐ.ఐ.టి. రామయ్యగా ప్రాచుర్యం పొందిన చుక్కా రామయ్య.

1925లో అప్పటి వరంగల్ జిల్లాలోని గూడూరు గ్రామంలో జన్మించారు. తల్లి నరసమ్మ, తండ్రి అనంతరామయ్య పురోహితుడు. తండ్రి పౌరహిత్యం నేర్చుకోమని ఒత్తిడి చేసినా, ఆయన మాట వినకుండా తల్లి ప్రోత్సాహంతో సెక్యులర్ విద్య వైపు మొగ్గుచూపారు.

ఈయన 14 సంవత్సరాల వయసులో తండ్రి చనిపోయినా కష్టపడి తల్లే చదివించింది. అందుకే తల్లే నా స్ఫూర్తి అంటారు రామయ్య.

ఆరోజుల్లోనే బి.ఎస్.సి. చదివి సామాజిక కార్యకర్త విశ్వనాథం గారి అనుచరుడిగా వయోజనులకు, అంటరానివారికి విద్యనేర్పటం వలన ఈయన కుటుంబం గ్రామంలో కుల బహిష్కరణకు గురైంది.

చిన్నప్పటి నుండి సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి. అందుకే వ్యక్తి విద్యకు సామాజిక ప్రయోజనం ఉండాలని ఇప్పటికీ భావిస్తారు. సామాజిక కార్యక్రమాల్లో

ప్రభుత్వ ఉగ్రతకు గురై జైలుశిక్ష పడింది. చంచల్‌గూడ, ఔరంగాబాద్ జైళ్లలో ఒక సంవత్సరం గడిపారు, ఐతే ఈ జైలు జీవితం ఈయన వ్యక్తిత్వ నిర్మాణానికి మరింత దోహదపడింది.

జైలు నుండి విడుదలై 1950లో వరంగల్‌లో ఒక ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా ఉ ద్యోగ జీవితం ప్రారంభించారు. ఐ.ఐ.టిలో మంచి ఉద్యోగం చేస్తున్న తమ్ముడి ఆర్థిక సహాయంతో ఉద్యోగం మాని 32 సంవత్సరాల వయసులో ఉస్మానియాలో ఎమ్.ఎస్.సి. (మ్యాథ్స్) చదివారు. క్లాస్‌లో అందరూ ఆయన కంటే పదేళ్ళు చిన్నవారే, ఎమ్.ఎస్.సిలో గోల్డ్ మెడల్ సాధించి తరువాత లెక్చరర్‌గా సిద్దిపేట కాలేజీలో కొత్త జీవితం ప్రారంభించారు.

మ్యాథ్స్ లెక్చరర్‌గా వేర్వేరు కాలేజీల్లో పనిచేసి 1983లో నాగార్జున సాగర్‌లోని ప్రతిష్టాత్మక ఎ.పి.రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా రిటైరయ్యారు.

ఆయనే కాదు, ఆయనతో పాటు కొన్ని వేలమంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులు రిటైర్ అయ్యారు. 1983 నుండి ఇప్పటివరకు కొన్ని లక్షలమంది రిటైర్ అయ్యారు.ఆ ఉద్యోగులను వారు పనిచేసిన ఆఫీసులు ఎప్పుడో మర్చిపోయి ఉంటాయి. కానీ ఈయనమాత్రం చుక్కా రామయ్యగా, ఐ.ఐ.టి రామయ్యగా దేశ విదేశాలలో ఎందరికో తెలుసు. ఇదెలా సాధ్యమైంది?

1984లో పదిమంది విద్యార్థులతో నెలకి 50 రూపాయలు ఫీజు తీసుకొని ఐ.ఐ.టి. కోచింగ్ ప్రారంభించారు. తెల్లవారుజామునే క్లాసులు, అంతా క్రిందే కూర్చునేవారు. క్రమశిక్షణకు చాలా ప్రాధాన్యం ఇచ్చేవారు. అయినప్పటికి మొదటి సంవత్సరం ఒక్కరు కూడా ఐ.ఐ.టి.కి సెలెక్టు కాలేదు.

ఆయన నిరాశ చెందలేదు. మరి ఏం చేశాడు. ఆయనే ఒక విద్యార్థిగా మారిపోయాడు. ఐ.ఐ.టి. పరీక్షా విధానాన్నీ క్షుణ్ణంగా స్టడీ చేసాడు. పాత ప్రశ్నాపత్రాల్ని పరిశీలించి ఐ.ఐ.టి.లో ప్రశ్నలు అడిగే విధానాన్ని అర్థం చేసుకొని టీచింగ్ మెథడాలజీ మార్చేశాడు, అంతే రెండవ సంవత్సరం నుండి ఈయన స్టూడెంట్స్ సెలక్ట్ అవడం మొదలైంది.

సంవత్సరం తర్వాత, సంవత్సరం ఈయన దగ్గరకు వచ్చే స్టూడెంట్స్ సంఖ్య, సెలెక్ట్ అయ్యేవారి సంఖ్య పెరుగుతూ పోయింది. వచ్చిన ప్రతీవారిని చేర్చుకోలేడు కాబట్టి ఈయనే ఒక ఎంట్రన్స్ పరీక్ష పెట్టాల్సి వచ్చింది. ఈయన పెట్టే ఎంట్రన్స్ పరీక్షకు కోచింగ్ ఇవ్వటానికి మరికొన్ని కోచింగ్ సంస్థలు పుట్టుకొచ్చాయి. ఈ విధంగా **గత 30 సంవత్సరాలలో ఈయన దగ్గర కోచింగ్ తీసుకొని ఐ.ఐ.టి.లో సెలక్టు అయి దేశ విదేశాలలో స్థిరపడినవారి సంఖ్య సుమారు 3000. ఇది అత్యంత అరుదైన విజయం.**

సాధించిన విజయాలను తలచుకొని, గొప్పలు చెప్పుకుంటూ కాలక్షేపం చేయడు. నేను కూడా విద్యార్థుల నుండి చాలా నేర్చుకున్నానని సవినయంగా చెబుతారు.

అంతేకాదు, విద్యావ్యవస్థలోని లోటుపాట్లను చర్చిస్తూ, పరిష్కారాలు సూచిస్తూ 16 పుస్తకాలు రాశారు. 2007లో ఎమ్.ఎల్.సి.గా ఎన్నికయ్యారు. **విజేతలకు గెలుపు ఒక గమ్యం కాదు. అది ఒక ప్రయాణం. 94 సం॥ వయసులో కూడా ఈ ప్రయాణం నిర్విఘ్నంగా కొనసాగుతుంది. బహుశా గెలుపు మనిషికి గుర్తింపుతో పాటు ఆరోగ్యాన్ని, ఆయుష్షును కూడా ప్రసాదిస్తుందేమో.**

# వయసును ఓడించే పరుగు

**జీ**వితం ఒక పరుగుపందెం.

ఈ పరుగు బాల్యంలో ప్రారంభమవుతుంది, యవ్వనంలో ఊపందుకుంటుంది. మధ్యవయసులో స్పీడ్ తగ్గి వృద్ధాప్యంలో ఆగి మరణంతో ముగుస్తుంది. కానీ ఆశ్చర్యం, కొందరు ఈ పరుగు వృద్ధాప్యంలో కూడా ప్రారంభించగలరు.

తూనికల రామసుబ్బమ్మ, అంతగా ప్రాచుర్యం పొందని పేరైనప్పటికీ తన డెబ్బైయవ పడిలో పరుగు ప్రారంభించి ఎన్నో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని 12 బంగారు పతకాలను, 8 రజిత పతకాలను గెలుచుకున్నారు. అంతగా చదువుకోక పోయినప్పటికీ ఆమె గురించి మనమంతా చదివే స్థాయికి ఎదిగింది.

రామసుబ్బమ్మది నెల్లూరుజిల్లాలోని కావలి. పేదరికం వలన ఆరవతరగతితో చదువు ఆగిపోయింది. భర్తది వంటచేసే ఉద్యోగం. ఈమె చిన్నచితకా పనులు చేసేది. బతుకు పేదరికంలో ఉన్నా ఆశలు, ఆలోచనలు ఉన్నతంగా ఉండేవి. కొడుకు, కూతురుని పి.జి.వరకు చదివించింది. అంతేకాదు, అల్లుడిని, కోడలిని కూడా పెళ్ళైన తర్వాత పై చదువులు చదివించింది.

అనుకోని పరిస్థితుల్లో 70సం॥ వయసులో క్రీడారంగం వైపు దృష్టి మరల్చి పరుగు పందాల్లో ప్రావీణ్యం సంపాదించింది.

షాట్‌పుట్, జావలిన్ త్రోలో కూడా ప్రావీణ్యం సంపాదించి ఎన్నో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని 12 బంగారు పతకాలు, 8 రజిత పతకాలు సాధించి వెటెరన్ అథ్లెట్ (వయసు పైబడినవారి ఆటలు)గా మంచిపేరు తెచ్చుకొంది.

ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతుంది.

కావలి పట్టణంలో ఆమెను ఘనంగా సన్మానించి 'కావలి రత్న' బిరుదు ప్రదానం చేసారు.

సాధారణ బతుకుతెరువు పనులు చేసుకొనే వ్యక్తి డెబ్బై సంవత్సరాల వయసులో జీవితానికి కొత్త అర్థాన్నీ, జీవించటానికి నూతన మార్గాన్ని ఎంచుకొని పుట్టిన ఊరుకి గుర్తింపు కూడా తెచ్చింది.

యూట్యూబ్‌లో ఈమె పేరు టైపు చేస్తే కొన్ని వీడియోలు ప్రత్యక్షమవుతాయి. విజయాలకు వయో పరిమితి లేదంటే ఒప్పుకుంటారు కదూ.

ఆరవ సూత్రం

# 6. గెలుపంటే అవరోధాల్నే అవకాశాలుగా మార్చుకోవటమే

**రా**త్రి భోజనం చేసి వెళ్తాడనుకున్న అతిథి సాయంత్రమే వెళ్ళిపోయాడు. అతనికోసం వండిన అన్నం అలాగే మిగిలిపోతుంది. అమ్మ ఏం చేస్తుంది? మరుసటి ఉదయం మిగిలిపోయిన అన్నంతో కమ్మటి పులిహోర తయారుచేస్తుంది. అందరూ ఇష్టంగా తింటారు. విడిగా మరలా బ్రేక్‌ఫాస్ట్ తయారు చేయాల్సిన పని, ఖర్చు తప్పుతుంది. ఒక సమస్యను మనకు అనుకూలంగా మలచుకోవటమంటే ఇదే. ఇది మన ఆలోచనలలో మన సంప్రదాయాల్లో సహజంగానే ఇమిడిపోయి ఉంటుంది.

పాతరోజుల్లో పిల్లవాడు టెన్త్‌క్లాస్ లేదా ఇంటర్మీడియట్ తప్పి ఇంట్లో ఖాళీగా ఉంటుంటే, ఆ టైమ్‌లో టైప్, షార్ట్‌హ్యాండ్, హిందీ కోర్సులు చేయించేవారు. సమస్యల్లో నుండి అవకాశాలను వెతుక్కుంటం లాంటిదే. అంతదాకా ఎందుకు-పాము విషం నుండి కూడా ఔషదాలను తయారు చేస్తున్నారు కదా!

దక్షిణాఫ్రికాలో జాత్యంహంకారం ప్రభలంగా ఉన్న ఆ రోజుల్లో అర్ధరాత్రి రైల్వే కంపార్టుమెంట్ నుండి గాంధీని బయటకు తోసివేశారు తెల్లదొరలు. దక్షిణాఫ్రికాలో ఒక లాయర్‌గా గౌరవప్రదంగా జీవిస్తున్న గాంధీ ఈ అవమానానికి కృంగిపోలేదు. అలిగి స్వదేశం తిరిగొచ్చేయలేదు. మరి ఏంచేశాడు. ఈ అవమానాన్ని ఒక అవకాశంగా మలచుకున్నాడు. ఆ దేశంలోనే ఒక ఉద్యమనేతగా ఎదిగాడు. అదే స్ఫూర్తితో భారతదేశానికొచ్చి తెల్లదొరలను తరిమికొట్టాడు. చరిత్రలో ఒక జాతిపితగా నిలిచిపోయాడు.

**ఓటమికి కృంగిపోతారు సామాన్యులు. ఓటమి నిచ్చెన మెట్లమీద నుండి గెలుపును అందుకుంటారు విజేతలు. ఓటమిని కూడా ఒక అవకాశంగా ఒక ఆయుధంగా మలచుకొని గెలుపును గెలుచుకుంటారు కొందరు అసమాన్యులు. అటువంటి ముగ్గురు అసమాన్యుల గురించి తెలుసుకుందాం.**

# గాంధీ

**సౌ**తాఫ్రికా... తేది 2, మే 1893. రాత్రి దాదాపు ఒంటిగంట. అంతకుముందే వర్షం కురిసి రైలు ఆగుతోంది. ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో మంచి నిదురలో ఉన్న మోహన్ లాల్ కరంచంద్ గాంధీని టి.సి. తట్టి లేపాడు. ఎప్పటిలాగే గాంధీ తన టికెట్‌ని టి.సికి చూపాడు.

అతను దానిని చూడకుండానే "తెలుసు. ఇది నీ బెర్తే. కాని వచ్చే స్టేషన్‌లో దిగి జనరల్ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లాలి. 'వచ్చే స్టేషన్‌లో విఐపి వస్తున్నాడు ఇది అతనికి కేటాయించాము' అని ఆదేశించాడు.

లా చదివిన గాంధీకి ఆ వాలకం నచ్చలేదు. ఒళ్లుమండి "ఒక్కసారి కన్‌ఫామ్ అయిన బెర్త్‌ని క్యాన్సిల్ చేసే అధికారం, హక్కు మీ రైల్వేకి లేదు. నేను లాయర్ని. నాకు చట్టం గురించి క్షుణ్ణంగా తెలుసు" గాంధీ మందలించాడు.

"నీ చట్టాలు మీ ఇండియాలో పనిచేస్తాయి. మా సౌతాఫ్రికాలో కాదు. మర్యాదగా వచ్చే స్టేషన్‌లో దిగు" కరువుగా మందలించాడు. వాదోపవాదాలు జరిగాయి. ఈలోగా ఆ స్టేషన్ రానే వచ్చింది. నేను దిగనని–ఆ విషయాన్ని కోర్టులో తేల్చుకుంటానని ఎదురు తిరిగాడు. అప్పటికే ఓపిక క్షీణించిన టి.సి. గాంధీని మెడబట్టి కంపార్ట్‌మెంట్‌లోంచి బయటికి తోశాడు. పెట్టి, బేడను ఫ్లాట్‌ఫామ్ మీదికి విసిరేశాడు. ఈలోగా సదరు విఐపి వచ్చి ఆ కంపార్ట్‌మెంట్‌లో కూర్చున్నాడు.

గాంధీ తన బ్యాగులు పట్టుకుని జనరల్ కంపార్ట్‌మెంట్ వైపు పరుగెత్తాడు. అప్పటికే ఆ కంపార్ట్‌మెంట్ జనంతో ప్యాకైపోయింది. నిలుచోడానికి కూడా వీలులేదు. అలాగే నిస్సహాయంగా ప్లాట్‌ఫామ్ మీదే నిలబడిపోయాడు. అక్కడి నుంచి రైలు కూత వేస్తూ వెళ్లిపోయింది. ప్లాట్‌ఫామ్ మీద గాంధీ ఒక్కడే బిక్కుబిక్కుమని నిలుచున్నాడు. అది అతనికి కాళరాత్రి. ఉదయంవరకు మరో రైలు లేదు. ఒంటరిగా ఆ చీకట్లో ముసురుతున్న దోమలతో ఏగలేక కూర్చున్నాడు.

అది మామూలు అవమానం కాదు, వ్యక్తిత్వం ఉన్న మనిషి ముఖంమీద ఉమ్మేసినంత దారుణమైన అవమానం. ముఖం చిట్లిపోయేంత అవమానం. ఆ ఓటమిలో ఓ ఆర్తనాదముంది. అది అతని గుండెలో కేకలు వేసింది. అది అతని చెవులకు మాత్రమే వినిపించింది.

ఆ రాత్రి అతనికి నిదురపట్టలేదు. ఆ చీకట్లో ఓ కొత్త సూర్యుడు ఉదయించాడు. ఆ సూర్యుడు దగదగమండే సూర్యుడుకాదు, పండువెన్నెల చందమామలా చల్లదనాన్ని పంచే సూర్యుడు. సలసలసాగే రక్తంతో, ఉడుకు రక్తంతో కదంతొక్కే యుక్త వయసు. కాని అతనికాదూకుడు లేదు.ఆ యుక్త వయసులో కూడా ఓ వృద్ధుడిలా ఓ మేధావిలా ఆలోచించాడు. జరిగిన దాంట్లో తప్పుఎవరిదని ఆత్మావలోకనం చేసుకున్నాడు.

అసలు తప్పంతా నాది. నా దేశాన్ని వదిలి–లా పట్టాను ఓ చేత్తో పట్టుకుని, మరో చేత్తో పొట్టను పట్టుకుని నా దేశంకాని దేశానికి వచ్చాను. ఇక్కడ మనం బానిసలం. వాళ్లదే అధికారం. వాళ్లు చెప్పినట్లు వినకపోతే గెంటేస్తారు. ఎక్కువ మాట్లాడితే జైల్లో పెడతారు. అసలు నా దేశాన్ని వదిలి ఇక్కడికి రావడమే నేను చేసిన తప్పు అని తనను తాను నిందించుకున్నాడు.

ఆ తరువాత గాంధీ ఇండియాకు వెళ్లి స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నారని చాలామంది అంటారు. కాని అది తప్పు. గాంధీ తన ప్రయాణాన్ని ఆపలేదు. వెనక్కి తిరిగి చూడలేదు. ముందుకు సాగాడు. పొట్టకూటికోసం బయలుదేరిన అతను ముందు తను చదివిన లాకు న్యాయం చేస్తూ పొట్టపోసుకోవాలని ముందుకెళ్ళాడు.

మరుసటిరోజు అతను చేరాల్సిన ఉద్యోగంలో చేరాడు. ఇక్కడ నిప్పు రాజుకుంది. కాని అది కుంపటిగా మారాలంటే ముందు ఆర్థికంగా నిలదొక్కుకుని, ఉద్యోగం చేయాలని అనుకున్నాడు. అందుకే అతను ఏ ఉద్యోగం కోసమైతే సౌత్ఆఫ్రికా వచ్చాడో అందులో చేరాడు. అది షిప్‌యార్డులో కార్మికుల తరపున వాదించే ఓ లాయర్ ఉద్యోగం. ఐతే మిగతా లాయర్లలాగా తన ఉద్యోగం చేసుకుపోలేదు. అక్కడి కార్మికులను సంఘటితం చేశాడు. వారికి నాయకుడిగా మారాడు. ఆ చిరు నిప్పురవ్వ మెల్లగా రాజుకుంటూ మెల్లిగా బొగ్గు గనిని తగలబెట్టినట్లు అయ్యింది.

ఒకటికాదు, ఇద్దరు కాదు, దాదాపు ఇరవై వేల మంది కార్మికులకు తిరుగులేని నాయకుడిగా ఎదిగాడు. అప్పటికే అతను సౌతాఫ్రికన్ల దృష్టిలో అదినాయకుడిగా ఎదిగాడు. అలాగని ఎదురుతిరగడం, పడవలు కాల్చడం, కూల్చడం, అధికారులను కొట్టడం లాంటి హింసాత్మక ఉద్యమాలు చేయించలేదు. మనం ఏం చేసినా శాంతియుతంగా చేయాలి, ఎదుటి మనిషిని బాధపెట్టేవిధంగా కాదు, ఆలోచింపచేసే విధంగా ఉండాలని తన ప్రసంగాలతో కార్మికులను ప్రభావితం చేసేవాడు.

కాబట్టి గాంధీని ఉద్యోగంలోంచి తీసే హక్కు యాజమాన్యానికి లేకుండా పోయింది. గాంధీని ఇండియాకు పంపిస్తే మొత్తం కార్మికులంతా షిప్‌యార్డ్‌లను తగలబెట్టేస్తారని భయం. గాంధీ ఉండడం మనక్కూడా అవసరం అని సౌతాఫ్రికా యాజమాన్యం నోరుమూసుకుంది. ఒక ఉద్యమాన్ని ఇంత శాంతియుతంగా కూడా చేయవచ్చని సౌతాఫ్రికానే కాదు, విప్లవాలకు పురుడుపోసిన ఫ్రెంచ్‌లాంటి దేశాలు కూడా విస్తుపోయాయి. క్రమంగా గాంధీ పేరు ప్రపంచం మొత్తం వ్యాపించింది.

అప్పటికే భారతదేశంలో స్వతంత్ర పోరాటాన్ని నడుపుతున్న కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఈ విషయం తెలిసింది. ఆ గాంధీలోని అహింసావాదం, తర్కవాద పోరాటం నచ్చి ఇండియాకు వచ్చి స్వతంత్ర ఉద్యమంలో పాల్గోవాలని 1914లో పిలుపువచ్చింది. సరిగ్గా ఆ అవకాశం కోసం ఎదురుచూస్తున్న గాంధీ ఇండియాకు వచ్చి ఆంగ్లేయులకెదురు నిలిచాడు. ఆ తరువాత అందరికీ తెలిసిందే.

# ఓల క్యాబ్స్

**బెం**గళూరు నేషనల్ హైవే. ఒక్కసారిగా ఆ టాక్సీ రోడ్డు పక్కన ఆగింది. ఆ టాక్సీ ఎందుకలా ఆగిందో అర్థంకాక "ఏం జరిగింది" అని వెనకసీట్‌లో కూర్చున్న పాతికేళ్ల యువకుడు భవీష్ అగర్వాల్ అడిగాడు.

"నేషనల్ పార్క్‌కి నేను రాను" డ్రైవర్ సిగరెట్ వెలిగిస్తూ నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు.

"ఏం జరిగింది?"

"మీటర్ మీద మరో రెండొందలు ఎక్కువ ఇస్తే వస్తాను."

"మీటర్ మీద ఎక్కువ ఎందుకివ్వాలి?"

"జవాబు చెప్పను. టాక్సీ దిగి మరో టాక్సీ ఎక్కి వెళ్లు".

"ఈ దారి మధ్యలో నాకు టాక్సీ ఎక్కడ దొరుకుతుంది?"

"అది నాకు అనవసరం. ఇక్కడి వరకు తిరిగిన మీటర్‌కు డబ్బులు కట్టి మర్యాదగా దిగు" చిరాకుగా డ్రైవర్ బెదిరించాడు. అతనిలో సంస్కారం ఏ కోశాన లేదు. తన్నుకోడానికి సిద్ధంగా ఉన్నాడు. అలాంటి వాళ్లలో గొడవ పడటం ఇష్టంలేని అగర్వాల్ కాంప్రమైజ్ కాదలచుకోలేదు. రెండు వందల రూపాయలు ఎక్స్‌ట్రాగా ఇవ్వలేకకాదు, ఇవ్వడానికి మనసొప్పలేదు. టాక్సీవాళ్ల దోపిడీ అతనికి నచ్చదు. ఆ పొగరుబోతు ప్రవర్తన అంతకంటే నచ్చలేదు.

అందుకే అక్కడివరకు తిరిగిన మీటర్ డబ్బుల్ని చెల్లించి, నడిరోడ్డు మీద దిగాడు. ఆ టాక్సీనెంబర్, డ్రైవర్ పేరు రాసుకున్నాడు.

అగర్వాల్ ముంబయిలో ఐఐటి చేశాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో పెద్ద ఉద్యోగం. ఇరవైగంటలూ ఆ ఉద్యోగంలో అతుక్కుపోవటం అతనికి నచ్చలేదు. ఏదో సాధించాలనే అస్పష్టత అతనిని వెంటాడుతోంది.

అందుకే ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి చిన్న ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ పెట్టాడు. అది ఎవ్వరికీ నచ్చలేదు. అందరూ తిట్టారు. ఉద్యోగానికి రాజీనామా చేసి తప్పుచేశానా? అనే ప్రశ్న అతణ్ని మొదటిసారి వెంటాడింది.

సరిగ్గా అప్పుడే ఈ సంఘటన జరిగింది. పుండుమీద కారంచల్లినట్లు అయ్యింది. ఇదేం గొప్ప సంఘటనకాదు. మన దేశంలో ప్రతి నగరంలో ఇలాంటి సంఘటనలు రోజుకు కోకొల్లలుగా జరుగుతూనే ఉంటాయి.

కాని, ఈ చిన్న సర్వసాధారణ సంఘటన అతనిని కొత్తగా ఆలోచింపచేసింది. పోలీస్ కంప్లేంట్ ఇచ్చి, ఆ టాక్సీ డ్రైవర్‌మీద ఆక్షన్ తీసుకొమ్మని స్నేహితులు సలహా ఇచ్చారు.

కాని అది అగర్వాల్‌కి నచ్చలేదు. ఒక్క టాక్సీ వాలాను మార్చితే సరిపోదు. అలాంటి టాక్సీవాలాలు మన దేశంలో లక్షల సంఖ్యలో ఉన్నారు. ఈ వ్యవస్థను మార్చాలి. ఈ వ్యవస్థలో మార్పురావాలి. ఏం చేయాలి?

ఆ చిన్న ప్రశ్నకు జవాబుగా 'ఓల' ట్రావెలింగ్ కంపెనీని పెట్టాడు. అంటే ఓ యజమాని నిర్దేశించే క్రమశిక్షణలో టాక్సి డ్రైవర్లు ఉద్యోగాలు చేసే సరికొత్త విధానం. అందుకే ఓ ప్యాసింజర్ ఎలాంటి క్రమశిక్షణను కోరుకుంటాడో అతనికి తెలుసు. క్రమశిక్షణతో డ్రైవర్లు టాక్సీలు నడిపే 'ఓలా' సంస్థను ఏర్పాటు చేశాడు. అంతేకాదు, స్వయంగా ఓల సంస్థకు ఒక్క టాక్సీ కూడా లేకుండానే వేల టాక్సీలతో వ్యాపారం చేసే నవీన విధానం. ఇది మనలాంటి దేశాల్లో విజయవంతం కాదని చాలామంది పెదవి విరిచారు. ఐన అతను వినలేదు.

ముందు ఐదు టాక్సీలతో ఆరంభించాడు. అది విజయవంతమైంది. టాక్సీవాలా చెప్పిన చోటుకి వస్తున్నాడు. ఎక్స్‌ట్రా డబ్బులు అడగడంలేదు. ఓపికగా వెయిటింగ్‌లో నిలుచుంటున్నారు. మీటర్‌లో ఎలాంటి 'జంపింగ్'లు లేవు. పిలవగానే వచ్చి ఇంటిముందో/ఆఫీసు ముందో వాలుతున్నాడు. ముఖ్యంగా ఎంతో నమ్రతగా మసులుకుంటున్నారు. అంతే! జనానికి ఇది నచ్చింది. 2010లో స్థాపించిన ఓల అతి తక్కువ కాలంలో విస్తరించి నేడు 50 వేల కోట్ల రూపాయల సంస్థగా ఎదిగింది. భవీష్ అగర్వాల్‌ని మన దేశంలో సంపన్న వర్గాల జాబితాలో చేర్చింది.

**మన అపజయాన్ని కూడా విజయంగా ఎలా మలుచుకోవచ్చో అతను నిరూపించాడు.**

# కెంట్ వాటర్ ఫిల్టర్లు

**డా॥**మహేష్ గుప్తా 1975లో కాన్పూర్‌లోని ఐఐటిలో గ్రాడ్యుయేషన్ చేశాడు. 1977లో ఇండియన్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ పెట్రోలియం, డెహరాడూన్‌లో పి.జి. పూర్తిచేశాడు. ఆ తరువాత వెంటనే 1978లో ఇండియెన్ పెట్రోలియమ్ లిమిటెడ్‌లో ఉద్యోగం వచ్చింది.

జీవితం సంతోషంగా సాగిపోతోంది. గొప్పింట్లో పుట్టినవాడు. కష్టాలంటే తెలియవు. అప్పటికే మహేష్ ఆయిల్ మీటర్‌ని తన చిన్న ఫ్యాక్టరీలో తయారు చేసి హెచ్.పి.కంపెనీకి అమ్ముతూ లాభాలు గడిస్తున్నాడు. జీవితం నల్లేరుమీద నడకలా హాయిగా సాగిపోతోంది. అప్పుడు దాన్ని జీవితం అని ఎందుకంటారు?

వేసవి సెలవల్లో కుటుంబంతో సరదాగా విహారయాత్ర కెళ్లాడు మహేష్ గుప్తా. వెకేషన్‌లో పిల్లలు బాగా ఎంజాయ్ చేసారు. పిల్లల కళ్లల్లో మెరుపులు చూసి భార్యాభర్తలు చాలా సంతోషించారు. జీవితమనే నాణేనికి ఒక వైపు సంతోషం ఉంటే మరో వైపు చికాకులు ఉంటాయి.

ఇంటికి చేరుకోగానే పిల్లలిద్దరికి జ్వరం. హాస్పిటల్లో చేర్పించాల్సి వచ్చింది. కామెర్ల వ్యాధి అని చెప్పాడు డాక్టర్. దానికి కారణం అపరిశుభ్రమైన నీరు త్రాగటం అని తెలుసుకున్నాడు మహేష్.

మరోసారి ఇటువంటి పొరపాటు జరగకూడనుకున్నాడు. మంచి వాటర్ ప్యూరిఫైయ్యర్ ఇంట్లో ఏర్పాటు చేసుకోవాలనుకున్నాడు. మార్కెట్‌లో దొరికే అల్ట్రా వయెలెట్ వాటర్ ప్యూరిఫైయ్యర్ నీటిలోని బాక్టీరియాను చంపుతుందే కానీ పూర్తిగా తొలగించలేదు. అప్పుడే అతనికి ఓ కొత్త ఆలోచన వచ్చింది.

ఎలాంటి బాక్టీరియా లేని నూటికి నూరుపాళ్లు శుద్ధమైన నీటిని తయారుచేసి అమ్మితే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చింది. నీటిని పూర్తిగా శుద్ధిచేసే ఆర్.వో (రివర్స్ ఆస్మాసిస్) విధానాన్ని స్టడీచేసి దానికి కావలసిన పరికరాలను విదేశాల నుండి దిగుమతి చేసుకున్నాడు.

ప్రారంభంలో కేవలం లక్ష రూపాయల పెట్టుబడితో వంద యూనిట్లు తయారుచేసి "కెంట్" అనే బ్రాండ్ నేమ్‌తో మార్కెట్‌లోకి విడుదల చేసాడు. అతని ప్రయత్నం

విజయవంతమైంది. కెంట్ వాటర్ ప్యూరిఫైయ్యర్‌లకు డిమాండ్ పెరిగింది. అంతే, 1999లో ఉత్తరాఖండ్‌లోని రూర్కీలో 40 ఎకరాల స్థలంలో ఫాక్టరీని ఏర్పాటు చేసి దేశీయమార్కెట్‌లోకి పూర్తిగా వ్యాపించడమే కాక, విదేశాలకు కూడా ఎగుమతులు ప్రారంభించాడు. 2005 నాటికే నలభై కోట్ల టర్నోవర్‌కి చేరుకొని పాతతరం సినీనటి హేమామలినిని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నాడు.

కేవలం వ్యాపారాన్ని పెంచుకోవటానికి మాత్రమే కాక, తన ఉత్పత్తుల నాణ్యతని కూడా నిత్యం పెంచుకోవటం వలన వాటర్ ప్యూరిఫైయ్యర్ మార్కెట్‌లో 40% కెంట్ ఉత్పత్తులు అమ్ముడవుతున్నాయి. ఎయిర్ ప్యూరిఫైయ్యర్స్, కూరగాయలు / పంటపై క్రిమిసంహారక మందులను తొలగించే పరికరాలను కూడా ఉత్పత్తి చేస్తున్నాడు.

కెంట్ వాటర్ ప్యూరిఫైయ్యర్‌లకు కేవలం మనదేశంలోనే కాక విదేశాలలో కూడా మంచి డిమాండ్ ఉంది. కెంట్ నాణ్యతకు యునెస్కో (UNESCO) ఆమోదముద్ర లభించింది. పరిశుభ్రమైన తాగునీటిని ప్రపంచానికి అందించిన వ్యక్తిగా ప్రపంచమంతటా మహేష్‌గుప్తాకు గుర్తింపు లభించింది.

2007లో ప్రతిష్ఠాత్మక గోల్డెన్ పీకాక్ ఇన్నొవేటివ్ అవార్డును అందుకున్నారు. ఒడిశా శ్రీశ్రీ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది–కేవలం సంవత్సరానికి వందయూనిట్లతో ప్రారంభమైన కెంట్ ఈరోజు సంవత్సరానికి మూడు లక్షల యూనిట్లను ఉత్పత్తిచేస్తూ వందల కోట్ల టర్నోవర్‌ను దాటిపోయింది.

చూసారు కదా! మహేష్ గుప్త ప్రయాణం.... అపరిశుభ్రమైన నీరు తాగి కుమారుడు అనారోగ్యం పాలవుతాడు. ఈ సమస్య అతనికి తాగునీటిని శుద్ధిచేసే పరికరాన్ని తయారు చేయాలనే ఆలోచన కలిగించింది. ఆ ఆలోచనను ఆచరణలో పెట్టాడు. అదే "కెంట్".... ఈరోజు వందల కోట్ల టర్నోవర్. "ప్యూర్ వాటర్ మాన్"గా ప్రపంచం అంతా గుర్తింపు. అవరోధాలను అవకాశాలుగా, ... సమస్యలను సమాధానాలుగా మార్చుకోవడమంటే ఇదే కదా!

ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలకు కూడా తన సంపదను వెచ్చించే మహేష్ ఉప్తా మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో యువతకు గెలుపు పాఠాలు చెబుతారు. "కలలు కనండి, పెద్ద పెద్ద కలలకనండి. విజయం తథ్యం" అంటారు – **సమస్యల నుండి విషాదాల నుండి నూతన విజయద్వారాలు తెరుచుకుంటాయని మహేష్‌గుప్తా నిరూపించారు.**

## ఏడవ సూత్రం

# గెలుపంటే ఇవ్వటమే
# (...ఇస్తా... గెలుస్తా ...)

"**జి**గ్‌జిగ్లర్ పేరు పలకటానికే సరదాగా ఉంది కదూ. కొంపముంచి ఇది ఒక మంత్రం అనుకునేరు. ఈయన ఒక అమెరికన్ రచయిత, వక్త, స్ఫూర్తిదాయక ఉపన్యాసాల కర్త. కొన్నికోట్ల టర్నోవర్ కలిగిన ట్రైనింగ్ ఇండస్ట్రీ సృష్టికర్త. యూట్యూబ్‌లో ఆయన గురించి చదువుతుంటె, ఆయన చెప్పే మొదటి కొటేషన్...

"You can get everything in life you want, if you will just help others enough to get what they want"

ఈయనకు గానీ పిచ్చిపట్టలేదు కదా? ఎదుటి వారికి ఇస్తేనే మనం గెలుస్తాం అంటాడేమిటి? "ఇస్తే గెలుస్తా" కాదు. "ఇస్తే చస్తా" అని కొందరనుకోవచ్చు. ఇచ్చి ఇచ్చి రోడ్డుమీద పడ్డ మన ప్రకాశం పంతులు, రేలంగి వంటి వారి చరిత్ర చదివి ఉండడు. ఈ జిగ్లర్ అనుకోవచ్చు మీరు.

వినటానికి, కనీసం ఆలోచించడానికి కూడా విచిత్రంగా ఉంది కదూ. గుర్తుంది కదా. శ్రీమంతుడులో మహేష్‌బాబు డైలాగు "తీసుకున్నది తిరిగి ఇచ్చేయ్ లేకపోతే లావైపోతావ్" దీనికి కూడా లాజిక్ లేదు. కానీ ఇది వాస్తవం.

"ఇస్తేనే గెలుస్తావ్" అంటే అని నేనంటే "నాకు డబ్బువస్తే నేను వేరొకరికి ఇస్తా అపుడు నేను గెలుస్తా" అని మీరనవచ్చు. గెలిస్తే ఇస్తమా లేదా ఇస్తే గెలుస్తమా. గుడ్డు ముందా? పిల్లముందా? ఏమో... ఎవరికి వారు ఆలోచించుకోవాలి. అంతేకాదు.

ఇవ్వటం ప్రారంభించండి–గెలవడం ఆరంభమవుతుంది. వ్యక్తిగతంగా ఎక్స్‌పీరియన్స్ చేయండి. మనసుతో ఆలోచిస్తే జీవితం ఎంతో నేర్పుతుంది.

"మనసు కనులు తెరిస్తే
ప్రకృతి ఓ ప్రాథమిక పాఠశాల
జీవితం ఆధునిక ప్రయోగశాల"

ఈ పుస్తకంలోనే కె.జి.ఎఫ్ హీరో యశ్ గురించి చెప్పుకున్నాము. ఒక బస్ డ్రైవర్ కొడుకు, కష్టపడి హీరో అయ్యాడు. జీవితం విలువ, సమాజం విలువ తెలిసిన వాడు. యశోమార్గ్ ఫౌండేషన్ స్థాపించి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నాడు. ఒక్క 2016లోనే రైతులకోసం చెరువుల పూడిక తీసే పనులకు నాలుగు కోట్లు ఖర్చుపెట్టాడు. టీబాయ్ స్థాయి నుండి హీరోగా ఎదిగిన లారెన్స్ మనకు తెలుసు. ఇతను కూడా లారెన్స్ ఫౌండేషన్ ద్వారా చిన్నపిల్లల ఆరోగ్యానికి కోట్లు ఖర్చు పెడుతున్నాడు.

ఇక్కడే మన తెలుగు హీరోల గురించి కూడా చెప్పుకోవాలి. నాన్న పేరు చెప్పుకొని హీరోలయ్యారు. సమాజానికి తిరిగి ఏమిస్తున్నారు? అలాగని జనరలైజ్ చేయటంలేదు. బసవతారకం కాన్సర్ ఆసుపత్రి మనకు తెలుసుకదా!

గూగుల్‌లో మౌంటెన్ మాన్ అని టైప్ చేయండి. దశరద్ ప్రేమ్‌జీ పేరు వస్తుంది. ఒంటి చేత్తో సుత్తి ఉలి పట్టుకొని 22 సంవత్సరాలు కష్టపడి అడ్డుగా ఉన్న కొండ తొలిచి దారితవ్వాడు. దానివలన తన గ్రామం నుండి పట్టణానికి దూరం 40 కిలోమీటర్లకు తగ్గిపోయింది. పేదవాడు, దళితుడు ఐనా సమాజానికి ఎంతో ఇచ్చాడు, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు. అతని మీద హిందీలో బయోపిక్ కూడా వచ్చింది మీకు తెలుసా! ఇతను గెలిచాడా? ఓడాడా? "బెంజ్‌కారు కూడా లేదు, బంజారాహిల్స్‌లో ప్లాట్ లేదు, ఎలా గెలిచినట్లు?" అని మనలో ఎవరైనా ఆలోచిస్తే, వారిని దేవుడు కూడా రక్షించలేడు.

బలమైన భారతీయ కుటుంబాల గురించి గర్వంగా చెప్పుకుంటాము. అది నిజమే కూడా. కానీ, దానికి మరో కోణం ఉంది. అదే–"ప్రపంచాన్ని దోపిడీచేసైనా కుటుంబాన్ని ఉద్ధరించాలి" అందుకే ఇంత అవినీతి మన సమాజంలో. ఈ బలహీతను అదిగమించి గివింగ్ ఈస్ లివింగ్ ఇస్తా... గెలుస్తా.... ఇస్తా... గెలుస్తా ముందుకు సాగిపోతున్న ముగ్గురు విజేతల గురించి తెలుసుకుందాం.

# రతన్ టాటా

**ర**తన్ టాటా, పరిచయం అక్కరలేని పారిశ్రామికవేత్త. 82 సంవత్సరాల వయసులో కూడా ఎంతో చలాకిగా ఉంటారు. రేసుకారులు, విమానాలు నడుపుతారు. బ్రహ్మచారి. 150 సంవత్సరాల పారిశ్రామిక సంస్థకి వారసుడు.

M.S.G (దీనినే మోనో సోడియం గ్లుటామేట్) దీనినే టేస్టింగ్ సాల్ట్ (అజీనామోటో) అంటారు. ఇది అన్ని హోటల్స్‌లో రుచికి వంటల్లో వాడతారు. ఇది కాన్సర్ కారకం. M.S.G వాడకం అనైతికం, కానీ చట్టవిరుద్ధం కాదు. అన్ని స్టార్ హోటల్స్‌లో కూడా M.S.G వాడతారు. కానీ టాటా గ్రూపు నిర్వహించే హోటల్స్‌లో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే M.S.G వాడరు. ఇది వారు స్వయంగా నిర్దేశించుకున్న నియమము. విలువలకు టాటా సంస్థ ఎంత ప్రాధాన్యత ఇస్తుంది అనే దానికి ఇది ఒక ఉదాహరణ.

రతన్ టాటా సున్నిత మనస్కులు. ఇతరుల సమస్యలకు స్పందించే హృదయం ఆయనది–భార్య భర్త, పిల్లలు, ఇలా కుటుంబం అంతా ఒకే స్కూటర్‌మీద తిరగటం చూసి చలించి మధ్యతరగతి కుటుంబాలకోసం చౌకగా లక్ష రూపాయలకే నానోకారు తయారు చేశారు. నానోకారు మీద టాటా గ్రూపుకు వేలకోట్ల నష్టాలొచ్చినా, ఆ కారు ఉత్పత్తిని కొనసాగించారు. ఆయనకు తెలిసినంత వరకు జీవితమంటే "ఇవ్వడమే" వ్యాపారమన్నా "ఇవ్వడమే"–నూతన పారిశ్రామికవేత్తలను, యువకులను ప్రోత్సహించడానికి 'STARTUPS' కు వందలకోట్ల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు.

ఈ ముప్పై సంవత్సరాలలో పదివేల కోట్లుగా ఉన్న టాటా సంస్థల వ్యాపార సామ్రాజ్యాన్ని ఆరు లక్షల కోట్లకు వృద్ధిచేశారు. ఐనప్పటికి దేశంలోగానీ, ప్రపంచంలోగానీ సంపన్నుల జాబితాలో రతన్‌టాటా పేరు/ఫొటో కనపడదు. దీనికి కారణం తెలుసుకుంటే మనందరం ఆశ్చర్యపోతాము– ప్రతి సంవత్సరం టాటా కంపెనీ లాభాలలో 66 శాతం

టాటా ట్రస్టు ద్వారా నిర్వహించే స్వచ్ఛంద సంస్థలకు, సామాజిక సేవా కార్యక్రమాలకు విరాళాల రూపంలో దానం చేస్తారు. ఆయన దృష్టిలో “గివింగ్ ఈస్ లివింగ్”

కోవిడ్–19 కలిగించిన విలయానికి ఆయన చెలించిపోయారు. “మానవ జాతి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు కరోనా” అన్నారు. “వేగవంతమైన నివారణ చర్యలు అవసర”మన్నారు. ఏవో నాలుగు మాటలు చెప్పి ఊరుకోలేదు. ఈ వ్యాధిని ఎదుర్కోవడానికి రూ.1500 కోట్లు విరాళాన్ని ప్రకటించారు. టాటా గ్రూపులో 96 విజయవంతమైన సంస్థలు ఉన్నాయి. ఇస్తూ... గెలుస్తూ – ఇస్తూ...గెలుస్తూ ఈ సంస్థలకు నాయకత్వం వహిస్తున్నారు రతన్ టాటా.

# విప్రో అధినేత అజిమ్ ప్రేమ్‌జీ

**ను**వ్వు నోబుల్ ప్రైజ్ అందుకున్నావా? లేదా ఆస్కార్ అవార్డు సంపాదించావా? బుక్కర్ ప్రైజ్ సాధించావా అని ప్రేమ్‌జీని ఎవరైనా అడిగితే, “నా సంపాదనలోంచి 33 శాతం దానంచేస్తూ పేదవిద్యార్థుల చదువులకు ఇతర సామాజిక సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్నాను” అని గర్వంగా చెప్పగలిగే ఏకైక భారతీయుడు అజయ్ హాషీర్ ప్రేమ్‌జీ. అతడు భారతీయుడు కావడం మనందరికి గర్వకారణం.

అలాంటి మహోన్నత వ్యక్తి ప్రేమ్‌జీ. ఆ వ్యక్తి దాతృత్వం, వ్యక్తిత్వం గురించి తెలుసుకొని దానకర్ణుడు కూడా ఆశ్చర్యపోతాడు.

ఆయన 24, జులై 1945లో గుజరాత్‌లో ఓ సంపన్న కుటుంబంలో జన్మించారు. అతని తండ్రి మహ్మద్ హాషీమ్ ప్రేమ్‌జీని “రైస్ కింగ్ ఆఫ్ బర్మా” అని పిలచేవారు. రైస్ మిల్లులలో అతన్ని మించిన వ్యాపారవేత్త అప్పట్లో ఇండియాలో లేరు.

కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదువుతున్న ప్రేమ్‌జీ 1966లో 21 సంవత్సరాల వయస్సులో, తండ్రి హఠాత్ మరణంతో, చదువు మధ్యలో ఆపేసి, ఇండియా వచ్చి, తండ్రి యొక్క వ్యాపార బాధ్యతలు స్వీకరించారు.

విప్రో సంస్థ అప్పటి వరకు కేవలం వంట నూనెల వ్యాపారం చేసేది. ఆ వ్యాపారాన్ని విస్తరించి, సబ్బులు, షాంపులు, బేబీప్రొడక్ట్స్, డెటర్జంట్స్, టాయ్‌లెట్రీ మరియు విద్యుత్ బల్బులు తయారీ ఆరంభించి, దేశమంతా మార్కెట్ ఏర్పరచి, అధిక లాభాలు గడించారు.

ఇది డెబ్బయవ దశకం చివరి దశ. కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ పవనాలు ప్రపంచం అంతా వీస్తున్నాయి. భారతదేశంలో దీనికి ఉజ్వల భవిష్యత్తు ఉందని ముందుగానే ఊహించింది అజిమ్ ప్రేమ్‌జీ.

1980లో బెంగళూరు ప్రధాన కేంద్రంగా విప్రో కంప్యూటర్ సంస్థను ప్రారంభించారు. ఆయన దార్శనికత, నిరంతర శ్రమ, స్ఫూర్తి పొందిన ఉద్యోగులు

కలిసి పదిహేను సంవత్సరాలలో విప్రోను భారతదేశంలోనే అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సంస్థగా తీర్చిదిద్దారు. వేలకోట్ల లాభాల్ని ఆర్జిస్తూ అజిమ్ ప్రేమ్‌జీ భారతదేశంలోనే అత్యంత ధనవంతునిగా ఎదిగారు.

లక్షా అరవైవేల ఉద్యోగులతో అన్ని దేశాలలో శాఖలు విస్తరించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో మన సత్తాను ప్రపంచం గుర్తించేలా కృషిచేశారు.

ప్రేమ్‌జీ కృషిని దేశం గుర్తించి కొనియాడింది. ఎన్నో దేశ విదేశ యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్‌తో గౌరవించాయి. భారతప్రభుత్వం 2005లో పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది.

పది లక్షల జీతం తీసుకునే వ్యక్తికి అంత ఖర్చు ఎలాగూ ఉండదు కాబట్టి ఒక మూడు లక్షలు దానం చేయమంటే చేయగలడా? కోట్ల రూపాయలు రెమ్యూనరేషన్ తీసుకుంటూ కేవలం ప్రజల అభిమానం మీద బ్రతుకుతున్న మన హీరోలు అందులో మూడోవంతు సమాజానికి ఖర్చు పెట్టగలరా?

కానీ ప్రేమ్‌జీ వేలకోట్ల లాభంలో మూడో వంతు సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తారు. అజిమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ద్వారా ఈ సేవలు చేస్తున్నారు. గ్రామీణ పేదల విద్యకోసం ఒక్క విడతగానే ఎనిమిదివేల కోట్ల దానం చేశారు.

బిల్‌గేట్స్, వారెన్‌బఫెట్ వంటి ప్రపంచ కుబేరులు ఆరంభించిన దానకర్ణుల సభ " ఆ లివింగ్ ప్లెడ్జ్" అందులో సభ్యత్వం పొందిన మూడవ అమెరికాయేతర వ్యక్తిగా పేరుపొందాడు.

ఈ మధ్యే కరోనా వైరస్ నిర్మూలనకోసం 1125 కోట్లు విరాళం ప్రకటించారు. సమాజానికి ఎంతో ఎక్కువ ఇచ్చే ప్రేమ్‌జీ, ఆయనకు మాత్రం చాలా తక్కువ ఇచ్చుకుంటారు. అంటే, చాలా నిరాడంబర జీవితం గడుపుతారు. విమానాలలో కేవలం ఎకానమీ క్లాస్‌లోనే ప్రయాణిస్తారు. అందరూ వాడే మధ్యతరగతి హెూండా కారునే వాడేవారు. **ఇవ్వటంలోని మాధుర్యాన్ని చవిచూసిన వ్యక్తికి తీసుకోవడం ఇష్టముండదేమో!**

# వారెన్ బఫ్ఫెట్

**మ**నిషిని డబ్బుశాసిస్తుంది కానీ ఆ డబ్బునే శాసించే మనిషి ఉంటాడా? ఉంటాడు అనుకుంటే ఆ మనిషి పేరే వారెన్ ఎడ్వర్ట్ బఫ్ఫెట్. అవును. అతను దాదాపు మూడు దశాబ్దాలుగా అమెరికన్ ఆర్థికవ్యవస్థను అంటే స్టాక్ మార్కెట్‌ని శాసిస్తున్న ప్రపంచ నెంబర్ వన్ ధనవంతుడు.

అతను ఆగస్ట్ 20, 1930లో అమెరికాలోని ఒరుహల్‌లో పుట్టాడు. అతని తండ్రి స్టాక్ ఎక్స్‌చేంజ్‌లో బ్రోకర్. డబ్బు సంపాదించడంలో ఆరితేరినవాడు.

చిన్నతనంలో వారెట్ బఫ్ఫెట్ తల్లికి కోపం ఎక్కువ. అకారణంగా అతనిని, అతని అక్కను తిట్టేది. ఇంట్లో ఉంటే తల్లి పోరు ఉంటుందని చదువుకోడానికి అతని స్నేహితుడి ఇంటికి వెళ్లేవాడు.

ఆ స్నేహితుడికి లెక్కల్లో మంచి పట్టు ఉండేది. వారెన్‌కి కూడ లెక్కలంటే చాలా ఇష్టం. గణాంకాలతో ఆడుకునేవాడు. అక్కడ నుంచి ఇంటికి వెళ్లాక అతని తండ్రి ఉద్యోగం చేసే స్టాక్ మార్కెట్ ఏజెంట్ల ఆఫీసుకు వెళ్లేవాడు.

అక్కడ తండ్రితో, మిగతా బ్రోకర్లతో పాటు కూర్చుని చాక్లెట్‌లు తినేవాడు. స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులు, ఏ షేర్ పెరగనుందో, ఏ షేర్ పడిపోనుందో వాళ్లు చర్చించుకునేవాళ్లు. అది మనం చిన్నతనంలో ఆడుకునే వైకుంఠాళి ఆటలా తమాషాగా తోచింది. వాళ్లు బోర్డ్‌మీద వేసే లెక్కలను ఆసక్తిగా చదివేవాడు. అవి ఏవిధంగా ఫలితాలనిస్తున్నాయో మరుసటిరోజు దినపత్రికలో చదివి అవాక్కయ్యేవాడు. ఒక్కోసారి వాళ్ల అంచనాలు తప్పేవి. అవి ఎందుకు తప్పేవో వాళ్లు బుర్రలు బద్దలుకొట్టుకునేవాళ్లు, వాటిని నిశితంగా పరిశీలించేవాడు. క్రమంగా వాటి మీద ఆసక్తి పెరిగింది. కొంచెం తెలివితేటలుంటే డబ్బును సంపాదించటం చాలా తేలికని ఆ పసివయసులోనే అనుకున్నాడు. ఇంటికొస్తే తల్లి ఎప్పుడూ అతని తండ్రిని సాధించేది. లక్షలు గడించమని

పోరుపెట్టేది. డబ్బు వుంటే ప్రపంచంలో అన్ని సమస్యలను ఎదుర్కోవచ్చని అతని తల్లి వాదించేది. కాని డబ్బులు సంపాదించడంవల్ల కూడ అనేక సమస్యలు వస్తాయని అతను పెద్దయ్యాక తెలుసుకున్నాడు.

వారెన్ బడిలో చదువుతుండగానే సంపాదించడం మొదలుపెట్టాడు. దినపత్రికలను ఒక ఏరియాకు కొనేవాడు. వాటిని ఇంటింటికి చందా కట్టించుకుని ఇచ్చేవాడు. ప్రతినెల చేతినిండ డబ్బు వచ్చేది. ఆ డబ్బుతో స్టాక్ మార్కెట్‌లో షేర్లు కొనేవాడు. వాటి లాభాలతో మరిన్ని షేర్లు కొనేవాడు. అతనికి 12వ ఏడు వచ్చేసరికి అతనికి ఉపాధ్యాయుల జీతంకంటే అతని సంపాదనే ఎక్కువుండేది.

అతను 14 ఏళ్లు నిండగానే అతి చిన్నవయసులో ఇన్‌కంటాక్స్ కట్టిన కుర్రాడిగా అమెరికా చరిత్రలో ఎక్కాడు. 19వ ఏట కొలంబియా బిజినెస్ స్కూల్లో తన డిగ్రీని పూర్తిచేశాడు.

ఆ తరువాత అతను పూర్తిగా ఇన్వెస్టర్‌గా ఎదిగాడు. అమెరికాలో ఏ కంపెనీ షేర్లు పెరగనున్నాయి, ఏ కంపెనీ షేర్లు పడిపోనున్నాయో ముందే అంచనా వేసేవాడు. తన డబ్బుతో పెరగనున్న షేర్లను కొనేవాడు. అవి పతనం అవుతున్నాయని తెలియగానే వాటిని అమ్మేసి–తక్కువధర షేర్లు కొనేవాడు. కోట్లు గడించాడు. అప్పటి వరకు షేర్ మార్కెట్‌ని ఓ పార్ట్‌టైమ్ వ్యాపారంలా ఉద్యోగులు, వ్యాపారులు ఆదరించేవాళ్లు–వాళ్ల డబ్బును బ్యాంక్‌లో దాచుకోవడం కంటే కంపెనీలో ఇన్వెస్ట్ చేస్తే డివిడెంట్ వస్తుందనుకునేవాళ్లు. కాని ఇన్వెస్టర్లు కూడా పూర్తిస్థాయి వ్యాపారం చేయవచ్చని వారెన్ రుజువుచేసి అందర్నీ చకితుల్ని చేశాడు.

వందేళ్ల స్టాక్ ఎక్స్‌చేంజ్ చరిత్రను వారెన్ ఒక్కడే ప్రభావితం చేశాడు. అతను ఏ కంపెనీలో ఇన్‌వెస్ట్ చేస్తే మిగతా జనం కూడా గుడ్డిగా ఆ కంపెనీలో ఇన్వెస్ట్‌మెంట్లు గుమ్మరించేవారు. అతని మీద ప్రజలకున్న గురి అలాంటిది.

ఇంతింతై వటుడింతై అన్నట్లు అతను క్రమంగా ఇన్వెస్టర్ల వ్యవస్థను, శాసించసాగాడు. ఆర్థిక మాంద్యం మొత్తం అతనికి తెలుసు. ఏ కంపెనీ ఎందుకు నష్టాలబాట పడుతుందో అంచనా వేసేవాడు.

చివరికి అతనికి 50 ఏళ్లు వచ్చేసరికి ఫోర్బ్సు (FORBES)పుస్తకంలో 2009 సంవత్సరంలో అమెరికన్ డాలర్ల 62 బిలియన్లతో మొదటి స్థానంలోకి వచ్చాడు. బిల్‌గేట్స్‌కి మంచి పోటీ ఇచ్చి–ఈ ఏడు నువ్వా–నేనా అనేలా సవాలు విసిరింది వారెన్ ఒక్కడే. అతని తెలివితేటలను బిల్‌గేట్స్ కూడా ప్రశంసించేవాడు.

ఆ తరువాత లెక్కపెట్టడానికి సమయం దొరకని ఆ ఆస్తిని ఏంచేసుకోవాలనే వైరాగ్యం వారెన్‌కి వచ్చింది. అందుకే పెళ్లిచేసుకుని, ముగ్గురు పిల్లల్ని కన్నాక దానధర్మాలు చేయడం మొదలుపెట్టాడు.

ముందుగా అమెరికా ప్రసిడెంట్ ఒబామా స్థాపించిన చారిటబుల్ ట్రస్ట్‌కి కొన్ని షేర్లు రాసిచ్చాడు. అతను ప్రతిరోజు 262 కోట్ల రూపాయలు సంపాదిస్తాడు. అందులోంచి 12 శాతం వాటాను దానధర్మాలకు వెచ్చించాలని నిర్ణయించాడు. ప్రపంచవ్యాప్తంగా 350 సంస్థలు ఆయనిచ్చే డబ్బుతోనే నడుస్తున్నాయి.

# విద్యార్థులకు ఏడు సూత్రాలు

**మం**చి దస్తూరి–హాండ్‌రైటింగ్ ఎక్కువ మార్కులు తెచ్చిపెడుతుంది. మనం ఎగ్జామ్ చాలా బాగా రాస్తాం. కానీ 70 శాతం మార్కులు వస్తాయనుకుంటాము. కానీ 70% మాత్రమే వస్తాయి. దానికి ఎన్నో కారణాలు ఉండవచ్చు. ఉదాహరణకు, ఎక్సామినర్ పేపర్ దిద్దేటప్పుడు మన పేపర్ దిద్దటానికి ముందు దిద్దిన పేపర్ చాలా బాగా రాసాడనుకొంటే, ఆ పేపర్‌తో మన పేపర్ పోల్చి తక్కువ మార్కులు ఇచ్చే ప్రమాదముంది. అలాగే మనముందు దిద్దిన పేపర్ కంటే మన పేపర్ బాగుంటే రెండు మార్కులు ఎక్కువ పడే అవకాశం కూడా ఉంది. కానీ, ఇవేమి మన చేతులో ఉండవు.

కానీ, మన చేతిరాత మాత్రం మన చేతుల్లో ఉంటుంది. అక్షరాలు గుండ్రంగా ఉండటం, ఒకే లైన్‌లో రాయడం, కొట్టివేతలు ఎక్కువగా ఉండకపోవడం చాలా ముఖ్యం. ఇప్పుడు హేండ్ రైటింగ్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. చిన్నప్పటి నుంచే మంచి దస్తూరి అలవాటు చేసుకోవాలి.

మన హేండ్‌రైటింగ్ బాగుంటే మన ఎగ్జామ్ పేపర్ దిద్దేటప్పుడు చూడగానే మంచి ఫస్ట్ ఇంప్రెషన్ ఏర్పడుతుంది. మంచి మార్కులు వేసే అవకాశం ఉంటుంది. మన హాండ్‌రైటింగ్ బాగోపోతే మన ఎగ్జామ్ పేపర్ చదవటానికి ఎగ్జామినర్ కొంచెం కష్టపడాల్సి రావచ్చు. అది ఆయనకు చికాకు కలిగిస్తుంది, దాని ప్రభావం వేసే మార్కుల మీద ఉంటుంది.

మనం సంవత్సరం అంతా చదువుతాము. పరీక్ష హాల్లో చదివింది గుర్తుకు తెచ్చుకొని రాస్తాము. మనం చదువుకు రాతకు మంచి కనెక్షన్ ఉండాలంటే సంవత్సరం అంతా మనము చదివింది రాయటంకూడా అలవాటు చేసుకోవాలి.

**2. చదవటానికి నిర్దుష్ట సమయం**

మనం ఇంతకుమునుపే చెప్పుకున్నాం, ప్రతిరోజు ఒక ఫిక్స్‌డ్ టైమ్ టేబుల్ ఉండాలని మన దినచర్యలకు, ఆటపాటలకు, స్నేహితులు, సోషల్ మీడియా, చదువులకు ప్రతిరోజు ఒక నిర్దుష్ట సమయం కేటాయించాలి. ఇదే టైమ్ టేబుల్ సంవత్సరమంతా కొనసాగాలి. ముఖ్యంగా స్టడీస్ ఉదయం 4-7 చాలా అనుకూలం. చదివింది గుర్తుంటుంది. డిస్టరబెన్స్ ఉండదు. నిద్రను జయించలేనివారు జీవితాన్ని జయించలేరు. ఉదయాన్నే లేచే అలవాటు లేని విజేతను నేనింతవరకు చూడలేదు.

**3. స్టడీమెథడ్స్:**

ఎక్సామ్స్ ముందు గట్టిగా ఒక నెల కూర్చుంటే ఫస్ట్‌క్లాస్‌లో పాస్ అవ్వవచ్చు. అది ఇంజనీరింగ్ ఐనా, గ్రాడ్యుయేషన్ ఐనా, - పోస్ట్ గ్రాడ్యూయేషన్ ఐనా సరే. ఇది స్టడీస్‌ను సీరియస్‌గా తీసుకోక పోవటమే. మొదట స్టడీస్‌కు తేలికగా తీసుకోవడం, తరువాత కెరీర్‌ను తేలికగా తీసుకోవడం, అటుపిమ్మట లైఫ్‌ను కూడా తేలికగా తీసుకోవడం... ఇవి ఒకదానివెనుక ఒకటి పెరిగే అవలక్షణాలు. జీవితాన్ని గెలవాలనుకునేవారు ఇటువంటి అవలక్షణాలకు దూరంగా ఉండాలి.

ప్రతి విద్యార్థి చదివే విధానాన్ని పరీక్షకులకు సిద్ధమయ్యే ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలి. ఏరోజుపాఠం ఆరోజు చదవడం ఎప్పటి నుండో ఉన్న విధానమే. ఏరోజుపాఠం ఆ రోజు పూర్తి చేయడం వీలుకాకున్నా ఏ వారం పాఠం ఆవారంలో పూర్తి చేయడం అలవాటు చేసుకోవాలి.

ఇప్పుడు ఆగస్టు నెలలో ఉన్నామనుకుందాం. ఏభైపేజీలో, వందపేజీలో ఒక చాప్టర్ థరోగా చదవాము అనుకుందాము. ఈ ఆగస్టులో చదివిన ఈ చాప్టర్ వచ్చే డిసెంబర్‌లో జరిగే సెమిస్టర్ ఎక్జామ్ వరకు లేదా మేలో జరిగే యాన్యువల్ ఎక్జామ్ వరకు ఎలా గుర్తుండాలి. అందుకే ఒక రివిజన్ మెథడ్ ఏర్పాటు చేసుకోవాలి. అంటే ఆగస్టులో చదివింది అక్టోబర్‌లో ఒకసారి, డిసెంబర్‌లో ఒకసారి రివైజ్ చేసుకోవాలి. అప్పుడే పరీక్ష వరకు అది మనకు గుర్తుంటుంది. రివైజ్ చేసుకోవడానికి వీలుగా తప్పకుండా నోట్స్ తయారు చేసుకోవాలి.

సెమిస్టర్ ఎక్జామ్స్ గానీ, ఏన్యువల్ ఎక్జామ్ గానీ వరుసగా రోజుకో పరీక్ష ఉంటుంది, ఒక్కోసారి ఉదయం ఒక పరీక్ష, సాయంత్రం ఒక పరీక్ష ఉంటాయి. అంటే సాయంత్రం పరీక్ష రాసి వచ్చిన తరువాత నెక్స్‌డే పరీక్షకు తయారు అవటానికి ఐదారుగంటల సమయం మాత్రమే ఉంటుంది. సంవత్సరం అంతా చదివింది ఈ ఐదారు గంటల్లో రివైజ్ చేసుకోవాలి. ఎలా సాధ్యం? అదుకే చిన్న చిన్న పాయింట్స్‌తో సినాప్సిస్ తయారు చేసుకోవాలి. ఒక్కరోజులోనే సిలబస్ మొత్తం రివైజ్ చేసుకోడానికి ఈ సినాప్సిస్ చాలా అనుకూలం- ఇదే విధంగా ఎక్జాం ప్రిపరేషన్‌కి ఒక స్ట్రాటజీ ఉండాలి.

పైన చెప్పిందంతా కేవలం ఒక సూచన మాత్రమే. విద్యార్థి తను చదువుతున్న కోర్సును బట్టి, సిలబస్‌ను బట్టి, తన జ్ఞాపకశక్తిని బట్టి ఎవరికి వారు ఒక నిర్దుష్టమైన విధానాన్ని ఏర్పరుచుకోవాలి-లేకపోతే సంవత్సరమంతా కష్టపడి చదివినా ఎక్జామ్ ముందు అంతా గందరగోళంగా ఉంటుంది. ఫెయిల్ అవ్వవచ్చు. లేదా మంచి మార్కులు తెచ్చుకోలేకపోవచ్చు.

**4. బట్టీపట్టడం మంచి అలవాటే**

కొంతమందికి బట్టీ (బైహార్ట్) పట్టే అలవాటు ఉంటుంది. అంటే టెక్స్ట్ బుక్‌లో ఉన్నది మక్కీకి మక్కి వార్డ్ టు వర్డ్ ఎక్సామ్ పేపర్‌లో దించేస్తారు. ఏమీ నేర్చుకోరు, కానీ బాగా గుర్తుంచుకుంటారు. ఇది చెడ్డ అలవాటు కాదు. ఎందుకంటే వారికే మంచి మార్కులు వస్తాయి. ఇలా బట్టీపట్టి ఐ.ఎ.ఎస్. సెలెక్ట్ ఐనవారు ఎందరో. దురదృష్టం ఏమిటంటే మన భారతీయ విద్యావ్యవస్థ మన జ్ఞాపకశక్తికి పరీక్ష మాత్రమే, మన జ్ఞానానికి కాదు.

కాకపోతే, సబ్జెక్ట్ అర్థం చేసుకొని బట్టీపడితే మరీ మంచిది. అప్పుడు జ్ఞానమూ, జ్ఞాపకశక్తి రెండూ పెరుగుతాయి. మన జ్ఞాపకశక్తి పరీక్షల్లో మార్కులు తెచ్చుకోవటానికి, మనజ్ఞానం ఇంటర్వ్యూకి, జీవితానికి ఉపయోగపడుతుంది.

**5. పరీక్షా ప్రణాళిక**

ఇంతకు ముందే చెప్పుకున్నాము, మనకు ఎంత నాలెడ్జి ఉన్నప్పటికీ మనకు వచ్చిన మార్కులనుబట్టే మనకు రేటింగ్ ఇస్తారు. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవడానికి కేవలం బాగా చదివితే సరిపోదు. దానికి ఒక స్ట్రాటజీ ఉండాలి.

పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఎప్పటి నుండో చెప్పుకునే రెండు పాత సామెతలు మీకు చెబుతాను. 1. సెలెక్టివ్ ఇన్‌టెన్సీవ్ అండ్ వైడ్ ఎక్స్‌టెన్సీవ్ (SELECTIVE INTENSIVE AND WIDE EXTENSIVE) 2. బెటర్ నో ఎవిరిథింగ్ ఆఫ్ సమ్‌థింగ్ దాన్ సమ్‌థింగ్ ఆఫ్ ఎవిరిథింగ్ (BETTER KNOW EVERYTHING OF SOMETHING THAN SOMETHING OF EVERYTHING) అంటే సిలబస్ అంతా చదువుతూ కూడా ముఖ్యమైన టాపిక్స్ అంటే పరీక్షల్లో ఎక్కువ ప్రశ్నలడిగే టాపిక్స్ ప్రత్యేక శ్రద్ధతో చదవమని దీనర్థము.

**6. నైట్ అవుట్స్ అస్సలు వద్దు**

ఎక్జామ్స్ సీజన్ వచ్చిందంటే రాత్రంతా మెలుకువగా ఉండి చదవటం కొందరికి అవాటు. ఇది మంచి పద్ధతి కాదు. ముఖ్యంగా రేపు ఎక్జామ్ అనగా ఈ రోజు రాత్రంతా మెలుకవగా ఉండటం ఉపయోగకరం కాదు. చదివింది ఏదీ గుర్తుకు రాకపోవచ్చు. ఆరోగ్యానికి కీడు.

**7. స్నేహితులు**

యవ్వనం జీవితంలో ఒక మదురఘట్టం, మరిచిపోలేని జ్ఞాపకం. అందుకే కేవలం పుస్తకాల పురుగులా మారొద్దు. చదువుకు ప్రాధాన్యత ఇస్తూ, స్నేహితులు, సరదాలు, షికార్లు, సినిమాలు, సోషల్ మీడియా కూడా జీవితంలో భాగంగా ఉండాలి. గర్ల్ ఫ్రండ్/బాయ్‌ఫ్రండ్ కూడా ఉండాలి. స్నేహితుల ఎన్నికలో జాగ్రత్త వహించాలి. కొందరు స్నేహితులు మనకు తెలియకుండానే వ్యసనాల వైపు మనల్ని లాగి జీవితాన్ని ధ్వంసం చేస్తారు.

బైక్‌రైడ్‌ల విషయంలో జాగ్రత్త వహించండి. రోడ్డు ప్రమాదాలకు గురికాకండి. ప్రేమలో మోసపోకండి.

# యువతకు ఏడు సూత్రాలు

## 1. కెరీర్ ప్రారంభం (ఉద్యోగార్తులకు)

గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఇంజనీరింగ్, ఎమ్.బి.ఎ.... మీ చదువు ఏదైనా కానీయండి ఫైనల్ ఇయర్ నుండే ఉద్యోగ ప్రయత్నాలు ఆరంభించండి.

కాంపస్ రిక్రూట్‌మెంట్‌లో సెలక్షన్ వస్తే మంచిదే, రాకపోయినా నిరాశ పడకండి. "If one door is closed, hundred doors will open" అని నమ్మండి. నిరాశ పడవద్దు. ఆత్మన్యూనతకు గురి కావద్దు. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దు. ఆశావాదాన్ని విడవద్దు. కలలు కనడం మానవద్దు.

చదువులు పూర్తయిన వెంటనే మనకు నచ్చిన జాబ్‌రాకపోయినా, వచ్చిన జాబ్‌లో జేరిపోవడం మంచిది. ఒక సంవత్సరం ఖాళీగా ఉన్నారనుకోండి, నెక్ట్స్ ఇంటర్వ్యూలో మిమ్మల్ని అడిగే మొదటి ప్రశ్న–ఒక సంవత్సరం ఎందుకు ఖాళీ ఉన్నారు, లేదంటే ఖాళీగా ఉండి ఏం చేస్తున్నారు. ఈ ప్రశ్నకు సరైన సమాధానం చెప్పటం కష్టం.

మనకు దొరికిన జాబ్ చేస్తూ, మనకు కావాల్సిన జాబ్‌కు ప్రయత్నించడం ఎప్పుడూ మంచిదే. ఆ మధ్య సోషల్ మీడియాలో ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ రోనాల్డ్‌రాస్ స్పీచ్ వైరల్ అయ్యింది. రైల్వేలో చాలా చిన్న ఉద్యోగం చేస్తు కూడా అతను ఐ.ఎ.ఎస్. సాధించాడు.

## 2. వెనక్కి చూడొద్దు:

స్టూడెంట్ లైఫ్‌లో మీరెంతో బాధ్యతా రహితంగా ప్రవర్తించి ఉండవచ్చు. మీ పర్సెంటేజ్ చాలా తక్కువగా ఉండటం వలన చాలా ఉద్యోగాలకు అప్లై చేయడానికి కూడా మీకు అర్హత లేకపోవచ్చు. బాక్‌లాగ్స్ ఉండవచ్చు. క్లియర్ చేసుకోండి.

అంతే కాదు, కొన్ని వ్యసనాలకు కూడా గురై ఉండవచ్చు. లవ్ ఎఫైర్ / ఎఫైర్స్ మిమ్మల్ని ఎంతో డిస్టర్బ్ చేసి ఉండవచ్చు–ఏదిఏమైనప్పటికీ జరిగిపోయిన దాని గురించి ఎక్కువ ఆలోచించవద్దు. అసలు వెనక్కి తిరిగి చూడవద్దు. పరిష్కార దిశగా ఆలోచించండి. నోమోర్ రిగ్రెట్స్.

అలాగే మీ పక్కనే కూర్చొని మీతో తిరిగిన ఫ్రెండ్‌కి మంచి జాబ్ రావచ్చు. ఎవ్వరితో కంపేర్ చేసుకోకండి. మంచి రోజు ముందుందని నమ్మండి.

స్టడీస్ పూర్తయిన తరువాత ఎవరిని కలిసినా, ఏ ఫంక్షన్‌కు వెళ్లినా వారడిగే ప్రశ్న "ఏం చేస్తున్నావు ఇప్పుడు" ఈ ప్రశ్న మనకు చాలా అసౌకర్యంగా ఉంటుంది. ఐనా అందరూ అడిగే ప్రశ్న ఇదే. ఎవర్ని ఎవాయిడ్ చేయవద్దు. ధైర్యంగా ఫేస్ చేయండి. మీరేం నేరం చేయలేదు. ఎవరికీ బాకీ లేరు. తప్పించుకు తిరగాల్సిన అవసరం లేదు–ఇది మీ జీవితంలో అత్యంత కీలక ఘట్టమని ఎప్పుడూ గుర్తుంచుకుంటే అదే చాలు.

## 3. నిర్ణయాలు జాగ్రత్తగా తీసుకోండి

20–25 సంవత్సరాల వయసులో మనం తీసుకునే నిర్ణయాలు మీ భవిష్యత్తుని, జీవితాన్ని నిర్ణయిస్తాయి. మీరు జీవితాంతం వరకు ఎలాంటి లైఫ్‌స్టైల్‌లో ఎంత దర్జాగా జీవించబోతున్నారనేది ఈ సమయంలో మీరు తీసుకునే నిర్ణయాల మీద ఆధారపడుతుంది. ఇది కెరీర్‌కు పునాదులు కట్టే వయసు. ఏ బిల్డింగ్‌కైనా రేటును, ఫేటును నిర్ణయించేది దాని పునాదులే కదా!

కెరీర్‌ను ఎన్నిక చేసుకోవటంలో చాలా జాగ్రత్త వహించాలి. మీ ఇష్టాలు మీ టాలెంట్, మీ బలాలు, బలహీనతలు, మీ కోర్ కాంపిటెన్సీ (ప్రధానశక్తి) ఏమిటో మీకు తెలిసుండాలి. అప్పుడు ఏ ఫీల్డ్‌లో మీరు నెగ్గుకురాగలరో మీరు తెలుసుకుంటారు. సరైన రంగాన్ని ఎన్నుకోగలగుతారు. ఉదాహరణకు మీరు బిడియస్తులు, ఇంట్రోవర్ట్ పర్సనాలిటీ, రిజర్వ్‌డ్‌గా ఉంటారు. మీరు మార్కెటింగ్ రంగాన్ని మీ కెరీర్‌గా ఎంచుకుంటే ప్రయోజనమేముంది చెప్పండి. దీనిమీద యూట్యూబ్ వీడియోలు చూడండి.

## 4. గవర్నమెంట్ జాబ్‌లు కూడా మంచివే!

సాధారణంగా గవర్నమెంట్ ఉద్యోగుల పిల్లలే ప్రభుత్వోద్యోగాలకు ప్రయత్నిస్తారు. గవర్నమెంట్ జాబ్‌ల కంటె కార్పొరేట్ జాబ్‌లు బాగుంటాయని చాలామంది భావిస్తారు. వేటికుండే సాదకబాధకాలు వాటికుంటాయి. ఇప్పుడు గవర్నమెంట్‌లో జీతాలు చాలా బాగున్నాయి. కాబట్టి గవర్నమెంట్ జాబ్‌లు కూడా మంచివే.

కేవలం రిజర్వేషన్స్ ఉంటేనే గవర్నమెంట్ జాబ్ అనే అపప్రధ ఉంది. అది వాస్తవం కాదు. 50% జాబ్స్ రిజర్వేషన్‌లో మిగిలిన 50% ఓపెన్ కాంపిటిషన్‌కు అందుబాటులో ఉన్నాయి. అందరూ తప్పక ప్రయత్నించవచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలకు వేర్వేరు రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు ఉన్నాయి. సివిల్ సర్వీసెస్ (I.A.S / I.P.S)కు UPSC వాళ్ళు పరీక్షలు నిర్వహిస్తారు. ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు స్టాఫ్ సర్వీస్ కమీషన్ అని వేరే సంస్థ ఉంది. రాష్ట్ర సర్వీస్ కమిషన్స్ (గ్రూప్ I & II సర్వీసులకు పరీక్షలు నిర్వహిస్తుంది.

బాంకింగ్ సర్వీస్, ఇన్యూరెన్స్, రిజర్వ్ బ్యాంక్, నాబార్డ్, రైల్వే సర్వీసు కమిషన్ ఇలా వేర్వేరు పరీక్షలుంటాయి. వీటన్నిటికీ చాలా కాంపిటీషన్ ఉంటుంది.

ప్రభుత్వ ఉద్యోగాలంటే ఆసక్తి ఉన్నవారు గవర్నమెంట్‌లో ఉన్న రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు, వాటి పరీక్షల షెడ్యూల్, సిలబస్ పూర్తిగా తెలుసుకోవాలి. ఈ పరీక్షలన్నీ రాయాలి. కొన్నిటికి అప్లై చేస్తూ కొన్నిటికి చేయకపోవడం మంచి పద్ధతి కాదు.

రోజుకు 15 గంటలు చొప్పున ఒక సంవత్సరం ప్రిపేర్ అయితే ఈ పరీక్షలన్నీ రాయగలిగే పరిజ్ఞానం వస్తుంది. ఒక రెండు సంవత్సరాలలో ఏదో ఒక గవర్నమెంట్ జాబ్ లభించవచ్చు. కాస్యువల్‌గా రాస్తే మాత్రం గవర్నమెంట్ జాబ్ ఖచ్చితంగా రాదు.

కేవలం సివిల్ సర్వీస్‌కే ప్రయత్నిస్తా లేదా కేవలం బాంక్ జాబులే నాకిష్టం, లేదా గ్రూప్-1 సర్వీస్ ప్రయత్నిస్తా అని చాయిస్ పెట్టుకోకూడదు. అన్ని గవర్నమెంట్ జాబ్‌లు ప్రయత్నిస్తు ఏదో ఒక గవర్నమెంట్‌జాబ్ లభించిన తర్వాత ఆ జాబ్ చేస్తూ మనకిష్టమైన సివిల్ సర్వీస్ లేదా గ్రూప్-1 సర్వీస్ ప్రయత్నించవచ్చు. టీచర్ ఉద్యోగం చేస్తూ, గుమస్తా ఉద్యోగం చేస్తూ I.A.S / I.P.Sకు, గ్రూప్-1 సర్వీస్‌కు ఎన్నికయిన వారు ఎందరో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌కు గవర్నమెంటులో జాబ్స్ ఎక్కువగా ఉండవు. సివిల్ ఇంజనీర్స్‌కు మాత్రమే గవర్నమెంట్ జాబ్స్ ఉంటాయి. కొద్దిసంఖ్యలో మెకానికల్ ఇంజనీర్స్‌కు కూడా ఉంటాయి.

ఆఖరుగా ఒక హెచ్చరిక. కొంతమంది యువకులు 22 సంవత్సరాల వయసులో సివిల్స్ లేదా ఇతర గవర్నమెంట్ సర్వీసుకు ప్రిపేర్ అవ్వటం ఆరంభిస్తారు. అక్కడ నుండి 32 సంవత్సరముల వరకు కేవలం గవర్నమెంట్ జాబ్స్ మాత్రమే ప్రయత్నిస్తూ ఉంటారు. దురదృష్టం కొద్దీ ఏ జాబ్ రాదు. వెనక్కి తిరిగి చూసుకుంటే పది సంవత్సరాల

జీవితకాలం వృధా అయిపోయింది. ఇది చాలా తప్పు. గవర్నమెంట్ జాబ్ ప్రయత్నాల్లో ఈ రిస్క్ ఉంటది. అంత దీర్ఘకాల ప్రణాళిక శ్రేయస్కరం కాదు.

రెండు లేదా మూడు సంవత్సరాలు సీరియస్‌గా ప్రయత్నించాలి. గవర్నమెంట్ జాబ్ రాకపోతే ప్రత్యామ్నాయ కెరీర్ ఎన్నుకోవాలి.

గవర్నమెంట్ జాబ్ మీద చాలా ఇష్టం ఉంటే అలా వేరే జాబ్ సీరియస్‌గా చేస్తూనే గవర్నమెంట్ జాబ్‌కి తిరిగి ప్రయత్నించాలి.

## 5. స్కిల్స్ పెంచుకోవాలి

మన డిగ్రీ కేవలం మనకు ఒక అర్హత మాత్రమే, కానీ అర్హతను బట్టి ఉద్యోగాలు ఇచ్చే రోజులు ఎప్పుడో పోయాయి. కేవలం టాలెంట్‌ను బట్టి ఉద్యోగాలు వస్తాయి.

మన స్కిల్స్‌ను ఎప్పటికప్పుడు పెంచుకోవాలి. టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ నేర్చుకోవాలి. లేటెస్ట్ టెక్నాలజీస్‌తో అప్ టు డేట్ కావాలి.

లైఫ్‌లో ఇది చాలా ముఖ్యమైన సమయమని ముందే చెప్పుకున్నాం. మన ఆలోచనలు, మన నిర్ణయాలు, మన ప్రవర్తన నిష్పక్షపాతంగా మనమే బేరీజు వేసుకొని అవసరమైన చోట మనల్ని మనమే సరిదిద్దుకోవాలి–ఇంట్రాస్పెక్షన్ చాలా అవసరం. టైమ్ అస్సలు వేస్ట్ చెయ్యొద్దు.

## 6. వ్యక్తిత్వ వికాస పుస్తకాలు :

ఇవి తప్పక చదువుతూనే ఉండాలి, జీవితచరిత్రలు కూడా. అవి తప్పక ఉపయోగపడతాయి. మనల్ని ఉత్తేజపరుస్తాయి. ఇది ఒక అలవాటుగా ఉంటే మరీ మంచిది. చంద్రుడు కూడా ప్రకాశించాలంటే దానిమీద సూర్యకాంతి ప్రసరించాలి కదా!

## 7. ఫిట్‌నెస్ చాలా ముఖ్యం

మీరు ఒక కంపెనీకి బాస్ అనుకోండి. అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్నారు. ఇద్దరు అభ్యర్థులు వచ్చారు. ఇద్దరికి క్వాలిఫికేషన్, టాలెంట్ ఇతర అన్ని అర్హతలు ఒకే విధంగా ఉన్నాయి. కానీ, ఇద్దరిలో ఒకరికి పొట్ట ఉంది, ఇంకొకరు ఫిట్‌గా ఉన్నారు. మీరెవరిని సెలెక్ట్ చేసుకుంటారు?

# V. గెలుపు ఒక గాజుబొమ్మ

**ఆ**యన పర్వతారోహకుడు. కష్టపడి కొండ శిఖరాగ్రహానికి చేరుకున్నాడు. అక్కడ తను ఇష్టపడి తెచ్చుకొన్న స్కాచ్ బాటిల్ తాగి సంతోషంతో గెంతులేసాడు. కట్ చేసే హాస్పిటల్ బెడ్‌మీద చావు బ్రతుకుల మధ్య.

గెలుపు ఒక గాజు బొమ్మలాంటిది. దాన్ని పొందటానికి ఎంతో కష్టపడాలి, నిలుపుకోవటానికి మరింత జాగ్రత్తగా ఉండాలి. ఒక్కసారి చేయి జారితే మరి ఇంతే సంగతులు.

గెలుపు ఎగసిపడే సాగర కెరటం కాదు. జీవనదిలా నిరంతరం ప్రవహించాలి. ప్రభవించాలి కూడా.

ఈ అధ్యాయంలో ముగ్గురు వ్యక్తుల గురించి ముచ్చటిచ్చాను. అతి సామాన్య స్థాయి నుండి అత్యుత్తమ స్థాయి కెదిగి దక్కిన విజయాన్ని నిలుపులేని విషాదస్థితి. ఈ పాఠాలు గెలుపు గమ్యాల దిశగా పరుగుతీసేవారికి హెచ్చరికలు.

విజయం వైపు పయనించేటపుడు ప్రతి గెలుపు ఒక మైలురాయి. అక్కడ ఒక్కక్షణం ఆగి స్వీయ సమీక్ష చేసుకోవాలి. మనకు మనం ఒక ఆడిటర్‌గా, మనమీద మనమే ఒక అధికారిగా, మన చేష్టలకు మనమే ఒక జడ్జిగా నిరంతరం ఆత్మపరిశీలన చేసుకోవాలి. లేదంటే కొన్ని తప్పులు దొర్లిపోతుంటాయి. వాటి పర్యవసానాలు భయంకరంగా ఉంటాయి.

గెలుపు ఒక గాజుబొమ్మ దాన్ని చేజారనివ్వకండి.

# "సత్యం" రామలింగరాజు

**కొందరికి జీవితం ఒక పరుగు, తనకు తానుగా సృష్టించుకున్న గమ్యం వైపు పరుగెత్తుతారు. వీరు ఎవరితోనూ పోల్చుకోరు. ఎవరినీ గెలవాలనుకోరు. నిన్నటికంటే ఈరోజు బాగుండాలని, ఈ రోజుకంటే రేపు మరింత గొప్పగా ఉండాలని ప్రయత్నిస్తారు.**

**మరికొందరికి జీవితం పరుగు మాత్రమే కాదు, పరుగుపందెం. గెలవాలి, అందరికంటే ముందుండాలి, వేగంగా పరిగెత్తాలి** – ఇద్దరూ కరెక్టే. కానీ కొన్నిసార్లు ఈ పరుగు ఎంత వేగంగా ఉంటుందంటే మనల్ని మనం మర్చిపోతాం, పరిసరాల్ని కూడా. జీవితాన్ని ఆస్వాదించం, ఏమీ ఆలోచించం కూడా. సరిగ్గా అప్పుడే తెలిసీ తెలియని తప్పులు జరిగిపోతుంటాయి. శిఖరం మీదనుండి ఒక్కసారిగా లోయలోకి జారిపోతాం. ఆ శిఖరం మరోసారి మనల్ని దరిచేరనీయదు. సత్యం రామలింగరాజు జీవితం అచ్చంగా ఇలాగే అనిపిస్తుంది.

పది సంవత్సరాల క్రితం వరకు పరిచయం అవసరంలేని పేరు. అంతేకాదు, చక్కని ముఖవర్చస్సు ఆరడుగుల ఆజానుబాహుడు. ఏ సినిమాహీరోకి తీసిపోని రూపం– 1954లో ఆంధ్రప్రదేశ్ భీమవరంలో ఒక రైతుకుటుంబంలో పుట్టారు. ఇక్కడే బి.కామ్ పూర్తి చేసుకొని అమెరికాలో ఎమ్.బి.ఏ. చేసారు. వ్యాపారం మీద ఆసక్తితో 23సం॥వయసులోనే ఒక స్పిన్నింగ్ మిల్, మరో మూడు సంవత్సరాలకు కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రారంభించారు.

సాఫ్ట్‌వేర్ రంగం పురోగమిస్తున్న తరుణంలో 1987లో 20 మంది ఉద్యోగులతో సత్యం కంప్యూటర్స్ స్థాపించి నూతన అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. యవ్వనోత్సాహం, కల్లనిండా కలలు, గుండెనిండుగా ఆశలు, కష్టించే స్వభావం, దార్శనికత ఏ వ్యక్తినైనా ప్రగతివైపు పరుగెత్తిస్తాయి. రామలింగరాజు నాయకత్వంలోసత్యం కంప్యూటర్స్ వేగంగా పురోగమించింది. ఇప్పటి ఐ.టి. దిగ్గజాలైన టి.సి.ఎస్, ఇన్‌ఫోసిస్‌కు సమానస్థాయిలో ఈ సంస్థ కూడా ఎదిగింది. ప్రారంభించిన 20 సంవత్సరాలకు భారతదేశంలో నాల్గవ అతి పెద్ద ఐ.టి. సంస్థ సత్యం కంప్యూటర్స్. అప్పటికి 63 దేశాలలో శాఖలుండి, రెండుబిలియన్ల అమెరికన్ డాలర్ల విలువ కలిగిన వ్యాపారాన్ని చేరుకుంది.

ఆ రోజుల్లో సత్యం కంప్యూటర్స్‌లో ఉద్యోగం సాధించటం ఒక ఎచీవ్‌మెంట్. ఈ సంస్థలో పనిచేయటం ఒక ఘనత. సత్యం రామలింగరాజు యువతకు రోల్‌మోడల్, ఒక ఐకాన్. ప్రతి తెలుగువాడు గర్వపడే స్థాయికి ఈయన చేరుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా భారత దేశ ప్రతిష్టను కొత్త శిఖరాలకు చేర్చారు.

ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి రెండు దశాబ్దాలలో అసామాన్యమైన పురోగతి సాధించి సంపద సృష్టించడానికి తరతరాలు కష్టించవలసిన అవసరం లేదని, ఒక తరంలోనే అది సాధ్యమని నిరూపించారు.

బైరాజు ఫౌండేషన్ స్థాపించి దాని ద్వారా ఆరు జిల్లాలలో విద్యా, వైద్యం, వ్యవసాయం, జీవనోపాధి రంగాల్లో గ్రామీణాభివృద్ధి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలకు 108 అంబులెన్స్ సర్వీసు  అందించారు.

ఈయన సాధించిన ప్రగతికి, సేవా కార్యక్రమాలకు ఎన్నో అవార్డులు అందుకున్నారు.  గోల్డెన్ పీకాక్ అవార్డు ఫర్ కార్పొరేట్ గవర్నెన్స్ ఆసియా బిజినెస్ అవార్డు, ఐ.టి. మాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నారు.

2000 సంవత్సరంలో అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ హైద్రాబాద్ వచ్చినప్పుడు ఆయనతో వేదిక పంచుకున్న ఏకైక తెలుగువాడు రామలింగరాజు.

ఆశ్చర్యంగా 2009 జనవరిలో ఈయన అరెస్టయ్యారు. బ్యాలన్స్ షీట్లు తారుమారు చేసి లేని లాభాలు ఉన్నట్లుగా చూపి షేర్ మార్కెట్‌లో సత్యం షేర్ విలువను కృత్రిమంగా పెంచడం ద్వారా పద్నాలుగు వేలకోట్ల కుంభకోణానికి కారణమని ఈయనపై అభియోగం మోపారు. ఇది కార్పొరేట్ రంగంలో అతిపెద్ద కుంభకోణంగా నిలిచింది. సి.బి.ఐ. ఈ కేసు దర్యాప్తు చేసింది. ఈయన, సోదరుడు, మరో ఎనిమిదిమంది ఉద్యోగులకు కోర్టు జైలుశిక్ష విధించింది. – సత్యం కంప్యూటర్సును మహేంద్ర గ్రూపులో కలిపారు.

**కొత్త మిలీనియంలో యువత కలలకు, ఆశలకు అద్దంలా నిలిచి స్ఫూర్తిదాయకమైన ప్రగతితో అందరితో 'జై' కొట్టించుకున్న విజేత జైలు పాలవటం పెద్ద వైరుధ్యం. ఈ రాజుగారి గాజు కిరీటం కిందపడి పగిలిపోయింది. ఔనుమరి, గెలుపు  ఒక గాజు బొమ్మ.**

# చందాకొచ్చర్

**చం**దాకొచ్చర్ ఉచ్చరించటానికి, గుర్తుంచుకోవటానికి అంత సులభమైన పేరు కానప్పటికీ గత దశాబ్దకాలంగా భారతదేశంలో అందరికి పరిచయమైన పేరు, అందరినోట్లో నానుతున్న పేరు. ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకు సి.ఇ.ఓ కమ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పది సంవత్సరాలు పనిచేసారు.

23 సంవత్సరాల వయసులో ఒక సాధారణమైన ఫైనాన్షియల్ సంస్థలో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరి, మరో 25సంవత్సరాలలో ఆ సంస్థకు అధినేత్రిగా (ఎమ్.డి) ఎదిగారు. ఒక దశాబ్దకాలం పాటు ఆ సంస్థ ఎమ్.డి.గా పనిచేసి దేశ విదేశాలలో ఆ సంస్థను విస్తరింపజేసి గొప్పపేరు, ఎన్నో అవార్డులను గెలుచుకొన్న ధీశాలి.

1961లో రాజస్థాన్‌లో జన్మించిన చందాకోచ్చర్ ముంబయిలోని ప్రతిష్టాత్మక మైన బజాజ్ సంస్థలో ఎమ్.బి.ఏలో గోల్డ్‌మెడల్ సాధించారు. 23 సంవత్సరాల వయసులో 1984లో ఐ.సి.ఐ.సి.ఐ.లిమిటెడ్ సంస్థలో (అప్పటికి ఆ సంస్థ బ్యాంకుగా ఏర్పడలేదు) మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరారు.

ఆమె నాయకత్వ లక్షణాలు, కష్టపడే తత్త్వం, చొచ్చుకుపోయే స్వభావం ప్రారంభదశలోనే సంస్థలో ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. 1990లో ఐ.సి.ఐ.సి.ఐ. లిమిటెడ్ ఒక బ్యాంకుగా రూపాంతరం చెందటంలో కొచ్చర్ ప్రముఖపాత్ర పోషించారు.

నిప్పును గుప్పెట్లో దాచలేనట్లే, విజేతలను విజయాలనుండి వేరుచేయలేము. పనిలో అంకితభావం, నిరంతరశ్రమ, దార్శనికత, గెలుపు వైపు పయనం కోచ్చర్ వ్యక్తిత్వం. బ్యాంక్‌కి ఆమె చేసిన సేవలు వృధాపోలేదు. అంచెలంచెలుగా ఎదుగుతూ పదిహేను సంవత్సరాలలో 2006 కల్లా బ్యాంక్ యొక్క కార్పొరేట్ మరియు అంతర్జాతీయ బ్యాంకింగ్ విభాగానికి అధినేత్రి అయ్యారు. మరుసటి సంవత్సరానికి బ్యాంక్ జాయింట్ ఎమ్.డి.గా పదోన్నతి పొందారు. ఆమె ఉద్యోగంలో చేరిన 25 సంవత్సరాలకు 2009లో బాంక్ ఎమ్.డి. & సి.ఇ.ఓ.గా బాధ్యతలు స్వీకరించారు.

ఇది సాధారణమైన విజయం కాదు. బహుశ ఆమెతోపాటు చదువుకొని ఆమెలాగానే బ్యాంకులో ఆఫీసర్‌గా చేరినవారు మహా అయితే మేనేజర్‌గానో, చీఫ్‌మేనేజర్‌గానో లేదా ఎ.జి.ఎమ్.గానో పదోన్నతి పొందవచ్చు.

చందాకొచ్చర్ కెరీర్, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్ పురోగమనం రైలు పట్టాల్లా సమాంతరంగా సాగాయి. 1990లో ప్రారంభమైన బ్యాంకుకు 2009లో ఆమె అధినేత్రి, మరో పది సంవత్సరాలు ఈ హోదాలో కొనసాగారు.

బ్యాంకింగ్ రంగంలో ఆమె సాధించిన ప్రగతి అనితర సాధ్యం, బదులుగా ఎంతో గుర్తింపు, గౌరవం, ఎన్నో అవార్డులు దక్కించుకున్నారు. 2004లో ఆమె ఉత్తమ బ్యాంకర్ అవార్డు అందుకొన్నారు.

ప్రతిష్టాత్మకమైన పార్చ్యూన్ లిస్ట్‌లో మోస్ట్ పవర్‌ఫుల్ బిజినెస్ ఉమెన్‌గా గుర్తింపు పొందారు. ప్రపంచం మొత్తంలో అతికొద్దిమంది ప్రముఖులను మాత్రమే ప్రస్తావించే ఫోర్బ్స్ లిస్ట్‌లో కొచ్చర్ పేరు కూడా ఉంది. 2011లో భారతప్రభుత్వం 'పద్మభూషణ్' పురస్కారంతో సత్కరించింది. (భారతరత్న, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ– ప్రాముఖ్యత పరంగా వీటి వరుస)

ఆమె సాధించిన ప్రగతి కేవలం ఆమెకు, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకుకు మాత్రమే పరిమితం కాలేదు.

దేశంలో కొన్ని కోట్లమంది చదువుకొన్న స్త్రీలకు ముఖ్యంగా యువతులకు ఆమె స్ఫూర్తిదాయక వ్యక్తిగా మారారు. ముఖ్యంగా 90వ దశకంలో పుట్టిన చదువుకొన్న మహిళలకు ఆమె ఒక రోల్‌మోడల్.

స్త్రీ అబల కాదని ఏరంగంలోనైనా రాణించగలదని, తనను తాను నిరూపించుకోగలదనే నమ్మకాన్ని యువతరం మహిళల్లో కలిగించారు. ఇది ఆమె సాధించుకున్న వ్యక్తిగత ప్రగతికన్నా ఎంతో గొప్పది. వెలకట్టలేనిది. ఒక తరాన్ని ప్రభావితం చేసింది. గెలుపు గమ్యాలవైపు ఆశతో, ఆత్మవిశ్వాసంతో చదువుకున్న యువతులను పరుగులు పెట్టించింది.

శిఖరాన్ని అధిరోహించటం కష్టమే, కానీ ఆ శిఖరంపై నిలబడడం ఇంకా కష్టం. ఏ మాత్రం అశ్రద్ధగా ఉన్నా కాలుజారి క్రింద పడతాం.

చందాకోచ్చర్ కెరీర్‌లో అదే జరిగింది. ఆమెపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. చందాకోచ్చర్ ఎమ్.డిగా ఉన్న ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్ నుండి 3250 కోట్లు రుణం పొందిన వీడియోకాన్ సంస్థ ఆ మరుసటి దినం ఆమె భర్త దీపక్ కోచ్చర్ యొక్క సంస్థ న్యూ రెన్యూబుల్స్ పవర్ లిమిటెడ్‌కు 64కోట్లు బదిలీ చేసింది. అవినీతి, అధికారి దుర్వినియోగం ఆరోపణలపై 2018లో ఉద్యోగం నుండి చందాకోచ్చర్‌ను తొలగించారు. సి.బి.ఐ మరియు ఇ.డి. కేసులు నడుస్తున్నాయి. ఇవన్నీ క్రిమినల్ కేసులే. ఒక చిన్న ప్రవాహంగా ప్రారంభమై, మహానదిగా ఎదిగి చివరకు అవినీతి సముద్రంలోకి నెట్టివేయబడటం ఎంత దురదృష్టం – **గెలుపు గాజుపాత్రలో అందుకున్న పరమాన్నం లాంటిది. ఆస్వాదించడంలో ఏమాత్రం అశ్రద్ధచూపినా పాత్ర చేజారి పగిలిపోతుంది. పరమాన్నం నేలపాలవుతుంది. అంతేకాదు భవిష్యత్తు అగమ్యగోచరమవుతుంది.**

# “శరవణ్ భవన్” రాజగోపాల్

ప్రతిమనిషి ఒక విజేతగానే జన్మిస్తాడు. పుట్టినప్పుడు ప్రపంచాన్ని జయించే శక్తియుక్తులు అతనిలో నిక్షిప్తమై ఉంటాయి.

కానీ ఆ వ్యక్తి ఎదిగే ప్రక్రియలో పరిసరాల ప్రభావంతోగానీ, పెంపకలోపం వలనగానీ, సరైన ప్రోత్సాహం, గైడెన్స్ లేకపోవటం వలనగానీ సామాన్యుడుగా మిగిలిపోతాడు. ఐనప్పటికీ అతికొద్దిమంది మాత్రం ఆ కళ్లల్లో కలలను, గుండెలో కసిని, మనసులో ఆశల్ని సజీవంగా నిలుపుకొని సామాన్య స్థితినుండి అసామన్యంగా ఎదుగుతారు. అటువంటి అరుదైన వ్యక్తి రాజగోపాల్.

1947లో తమిళనాడులోని ట్యూటికారిన్‌లో జన్మించాడు. తండ్రి చిన్నరైతు. రాజగోపాల్ పెద్దగా చదువుకోలేదు. చదువుతోపాటు వచ్చే డిగ్రీలు లేకపోయినా ఆలోచనతోపాటు అందే జ్ఞానం సంపాదించాడు. తండ్రిలా ఒక సామాన్యరైతుగా ఉండటం అతనికి ఇష్టంలేదు.

1968లో అప్పటి మద్రాస్ నగరం వెలుపల (ఇప్పటి చెన్నై) ఒక కిరాణా షాపు తెరిచాడు. లాభాల రుచి మరిగాడు. కొత్త వ్యాపార మార్గాలను అన్వేషించాడు.

1981లో చెన్నైలో శరవణ భవన్ రెస్టారెంటు ప్రారంభించాడు. పరిశుభ్రమైన పరిసరాలతో రుచికరమైన వంటకాలు వడ్డించేవారు. రెస్టారెంటుకు మంచిపేరు వచ్చింది. విపరీతమైన లాభాలు కూడా.

కష్టించే స్వభావం, దార్శనికత, తన దగ్గర పనిచేసే ఉద్యోగులను చక్కగా చూసుకోవటం ఈయన గుణగణాలు. ఈ లక్షణాల వలన మరో పది సంవత్సరాలలో చెన్నై నగరం ఎన్నో ‘శరవణ భవన్’ రెస్టారెంట్లను ప్రారంభించి హోటల్ పరిశ్రమలో ప్రముఖస్థానాన్ని కోట్లు రూపాయల లాభాల్ని సాధించాడు.

మరో పది సంవత్సరాలలో భారతదేశంలోని అన్ని ప్రధాన నగరాలతో పాటు విదేశాలలో కూడా ‘శరవణ్‌భవన్’ రెస్టారెంట్లు వెలిశాయి. దుబాయ్, పారిస్, ఫ్రాంక్‌ఫర్ట్,

లండన్, న్యూయార్క్, డల్లాస్, టొరోంటో, ఆస్ట్రేలియా, మలేషియా, ఓమన్, దోహా, సింగపూర్, కెన్యా, థాయ్‌లాండ్, హాంకాంగ్, స్వీడన్, నెదర్‌లాండ్‌లో రెస్టారెంట్లు ప్రారంభించారు.

ఈ హొటల్లో 2014లో పనిచేసే కార్మికుల సంఖ్య సుమారు పదివేలు. తొలి హొటల్ ప్రారంభించిన ముప్పై ఐదు సంవత్సరాలకు, అ ంటే 2017లో 'శరవణ్‌భవన్' టర్నోవర్ మూడువేల కోట్లు.

ఒక జీవితకాలంలో మనిషి ఏం సాధించగలడో రాజగోపాల్ సాధించి చూపించాడు. ఇక్కడతో కథ ముగిసిపోతే అందరికీ సంతోషమే.

కానీ మనందరికి తెలిసిన పాత సామెత **"చిన్న రంధ్రం కూడా పెద్ద ఓడను ఓడించగలదు" చిన్న బలహీనత పెద్ద బలవంతుడ్ని నిర్వీర్యం చేయగలదు. జీవితాన్ని నిరర్ధకం కూడా చేయగలదు.**

55 సంవత్సరాల వయసులో తన వద్ద పనిచేస్తున్న ఉద్యోగి కుమార్తెపై మోజుపడి, ఆమెను పెండ్లాడటానికి ఆమె భర్త శాంతకుమార్‌ను హత్య చేయించాడనే అభియోగంతో జైలు పాలయ్యాడు. ఇది కోర్టులో ప్రూవ్ అయ్యి జైలుశిక్ష పడింది. 2019లో ఆయన మరణించేనాటికి ఆయన సాధించిన ప్రగతి కంటే ఆయన మూటకట్టుకున్న అపకీర్తిదే పైచెయ్యి అయ్యింది. **సుమారు 40 సం॥ కష్టపడి నిర్మించుకున్న శరవణ్ భవన్ అనే అందమైన గాజుభవనం మోహం అనే రాయి తగిలి ముక్కలైపోయింది.**

# VI. చరిత్ర చెప్పే పాఠాలు

## a) గెలుపంటే మనల్ని మనం గెలవటమే

**ఈమధ్య చాలా సాధారణంగా వినిపించే మాట, "విన్‌విన్". విన్ అంటే ఎదుటి వ్యక్తి మీద గెలవటం, విన్ విన్ అంటే ఎదుటి వ్యక్తిని గెలుచుకోవటం, గెలుపును ఇద్దరూ సమంగా పంచుకోవటం, విన్ విన్ భావన జీవితంలో, దాంపత్యంలో ఉద్యోగంలో, సమాజంలో కూడా అద్భుత ఫలితాల్నిస్తుంది.**

ఎన్నో యుద్ధాలుచేసి, రాజ్యాలను జయించిన అశోకచక్రవర్తి కళింగయుద్ధ రక్తపాతానికి చలించి, తను గెలవాల్సింది రాజ్యాలను కాదు తనలోని రాజ్యకాంక్షను అని తెలుసుకొని బౌద్ధధర్మాన్ని పాటిస్తూ అశోక దిగ్రేట్‌గా చరిత్రలో నిలిచిపోయాడు. (భారతచరిత్రలో  అశోకుడు, అక్బర్, రాజరాజచోళునికి మాత్రమే "దిగ్రేట్" టైటిల్ ఉపయోగిస్తాము)

భాహ్య శత్రువును సులభంగానే జయించవచ్చు కానీ అంతర్గత శత్రువుని జయించటమే కష్టం. బద్ధకం,  పనులు వాయిదా వేయడం, కోపాన్ని అదుపులో పెట్టకపోవడం, అసూయ, ఈర్ష్య, ద్వేషం, మనుష్యులను ప్రేమించలేకపోవడం, నిరాశా వాదం, నేనింతే అనుకోవడం, శక్తికి పరిమితులు విధించుకోవడం, ఏంబిషన్ లేకపోవడం, ఇవన్నీ అంతర్గత శత్రువులు. వీటిని గెలవలేకపోతే మన గెలుపు అసంపూర్ణం. ఎవరెస్ట్ పర్వత విజేత ఎడ్మన్డ్ హిల్లరీ అంటారు "మేము పర్వతాన్ని కాదు జయించింది... మమ్మల్నే"

తనని తాను గెలవలేక తన చేతిలో తానే ఓడిపోయిన ఒక మహారాజు చరిత్ర తెలుసుకొందాం.

# అజాత శత్రువు

**క్రీ.**పూ. ఐదవ శతాబ్దానికి చెందిన గొప్పరాజు అజాతశత్రువు. మగధసామ్రాజ్య పాలకుడు. ప్రాచీన భారతచరిత్రలో మగధ గొప్ప సామ్రాజ్యం. ఇది ప్రస్తుత దక్షిణ బీహార్ ప్రాంతం. మనం బాహుబలి సినిమాలో చూచే ఆయుధాలు పొదిగిన రథం వంటి రథాలు ఈ రాజుగారి కాలంలో తొలిసారి వాడారని చరిత్ర చెబుతుంది. అజాత శత్రువు అంటే శత్రువులు లేని వాడు అని అర్థం. అరవీర భయంకరుడైన ఈ రాజుతో శతృత్వం వహించడానికి ఇతర పాలకులెవరూ సాహసించలేదు. అందుకే శత్రువులు లేరు. కానీ ఆయన శత్రువు ఆయనలోనే ఉన్నాడు. తనకు తనే శత్రువు. ఈ రాజు చరిత్ర తెలుసుకుందాము.

అజాత శత్రువు హర్యంకవంశ పాలకుడు. మనందరికి చాణుక్యుడు (కౌటిల్యుడు) గురించి తెలుసు. ఎన్నో సినిమాలు, సీరియల్లు చాణుక్యుడు మీద వచ్చాయి. అర్థశాస్త్రం రచయిత. కౌటిల్యుడు అర్థశాస్త్రంలో చెప్పిన విషయాలు ఇప్పటికీ ఉపయోగకరమే.

మగదను ఏలిన నందరాజుల చేతిలో అవమానపడి దానికి ప్రతీకారంగా చంద్రగుప్త మౌర్యుని ద్వారా నందరాజులను ఓడించి మౌర్య సామ్రాజ్య స్థాపనకు కారణమవుతాడు. ఇంతకు సుమారు 150 సంవత్సరాలకు పూర్వం అజాతశత్రు మగదను పాలించాడు.

అజాతశత్రువు తండ్రి బింబిసారుడు. హర్యంక వంశస్థాపకుడు. గొప్ప రాజు. వివిధ శాస్త్రాలలో ప్రావీణ్యత గలవారిని మంత్రులుగా నియమించేవాడు. మంత్రి యొక్క సలహాను తప్పక పాటించేవాడు. 2500 సంవత్సరాల తరువాత ఇప్పటి మంత్రులను చూస్తే జాలేస్తుంది కదూ!

బింబిసారునికి కుమారుడంటే అపరిమిత ప్రేమ. ఒకసారి కుమారునికి చిటికినవేలు మీద గాయమవుతుంది, నొప్పితో ఏడుస్తు ఉంటాడు. రాజుగారు నిద్రకూడా

మాని రాత్రంతా కుమారున్ని ఒల్లో కూర్చోబెట్టుకుని నొప్పి తెలియకుండా వేలు చీకుతూ ఉంటాడు. అందుకే అజాతశత్రువుకు "కునిక" అనే నిక్‌నేమ్ కూడా ఉంది. కునిక అంటే అప్పటి భాషలో గాయపడిన వేలు అని అర్థం.

బింబిసారుడు కుమారునికి యుక్తవయసు రాగానే అంగరాజ్యానికి రాజప్రతినిధిగా నియమించాడు. అంతే, తొలిసారి మానవ రక్తాన్ని రుచిచూచిన పులిలా రెచ్చిపోయాడు. అంటే మగధ సామ్రాజ్యానికి రాజుకావాలని ఉవ్విళ్ళూరాడు. తనలోని అంతర్గత శత్రువులు, రాజ్యకాంక్ష, అధికార దాహం, అనైతికత అతన్ని ఓడించాయి. ఫలితంగా తండ్రిని ఖైదు చేసి సింహాసనాన్ని ఆక్రమించాడు, పిదప తండ్రి చావుకు కారణమయ్యాడు.

దీని ఫలితమేమిటి? కొన్ని సంవత్సరాల తర్వాత అజాతశత్రువుని చంపి అతని కుమారుడు ఉదయభద్రుడు సింహాసనాన్ని ఆక్రమించాడు. ఇట్లా నాలుగు తరాలు తండ్రిని చంపి సింహాసనాన్ని ఆక్రమించారు వారి కుమారులు.

భారతదేశ చరిత్రలో తొలిసారి తండ్రిని చంపి సింహాసనాన్ని ఆక్రమించిన అపఖ్యాతి అజాతశత్రువుది. నాలుగు తరాలు కొనసాగిన ఈ చెడు సంప్రదాయానికి ఆద్యుడు అజాతశత్రువు. నీవు నేర్పిన విద్యయే....

# b) గెలుపంటే బాధ్యతలను స్వీకరించడమే

**క్రికెట్ బ్యాట్ తలమీద పెట్టుకుంటే చాలా బరువుగా ఉంటుంది. చేతిలోకి తీసుకొని ఆడుతుంటే ఇంకా ఇంకా ఆడాలనుకుంటాం. బాధ్యత కూడా అలాంటిదే, దానిని మనస్ఫూర్తిగా స్వీకరిస్తే అస్సలు బరువనిపించదు.**

**జీవితం కూడా ఒక బాధ్యతే, ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తే విజయం అనివార్యం.** ఒక విద్యార్థి రోజూ స్కూలుకు వెళ్తాడు, ఇంటికొచ్చి హోంవర్క్ చేసుకుంటాడు. ఇది అతని భవిష్యత్తుపట్ల అతనికి తెలియకుండానే తీసుకునే ఒక బాధ్యత. స్కూల్ ఫీజులు కట్టడం, పుస్తకాలు, యూనిఫామ్ ఏర్పాటు చేయడం తండ్రి బాధ్యత. మంచి అలవాట్లు నేర్పడం, ఆహారం అందించడం తల్లి బాధ్యత. ప్రేమలు, అనుబంధం, ఆప్యాయతలు ఎలాగూ ఉంటాయి, కానీ బాధ్యత ఒక యంత్రంలా జీవితాన్ని విజయపథంలో నడిపిస్తుంది.

సిగరెట్, మద్యం లాటి వ్యసనాలు లేకపోవడం శరీరం పట్ల మనం బాధ్యత వహించడం. యోగా, వ్యాయామం, నడక, జిమ్‌కు వెళ్లడం మన ఆరోగ్యం పట్ల మనం బాధ్యత వహించడమే. కుటుంబ సభ్యులు ఒకరిపట్ల ఒకరు ప్రేమను వ్యక్తపరుచుకోవడం అనుబంధాలపట్ల మన బాధ్యత. **ఇలా చెప్పుకుంటూ పోతే జీవితమంటే బాధ్యతల ప్రవాహం.**

బాధ్యతలు స్వీకరించడం, బాధ్యతాయుతంగా ప్రవర్తించడం విజేతల ప్రథమ లక్షణం. ఆఫీసులో ఉద్యోగిగా, ఒక బాస్‌గా, ఒక సబార్డినేట్‌గా, ఇంట్లో ఒక భర్తగా, భార్యగా, కోడలిగా, సోదరుడిగా, సోదరిగా, స్నేహితునిగా ఒకేసారి జీవితంలో వేర్వేరు బాధ్యతలు నిర్వర్తిస్తాము. ఏ పాత్రలోనైనా పూర్తిగా ఒదిగిపోయి ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి నప్పుడు జీవితంలో విజేతగా నిలుస్తాము. ఇందులో ఏ ఒక్క బాధ్యతలో విఫలమైనా, “స్మాల్ లీక్ సింక్స్ గ్రేట్ బోట్” అన్నట్లు జీవిత నౌక మునిగిపోతుంది.

జీవితంలో ఎదురయ్యే విషాదాలు, సమస్యలు, ఒత్తిడి, ఓటమి బాధ్యతల్నుంచి పారిపోవటానికి సాకుగా ఉండకూడదు. జీవితమంతా విషాదాలమయమైనా, తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన ఒక మహారాణి గురించి తెలుసుకొందాం.

# రాణి అహల్యా బాయ్ హోల్కర్
# (1725–1795)

**మ**నం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ విమానాశ్రయంలో దిగగానే మనకు కనిపించే బోర్డు రాణి అహల్యాబాయ్ ఇండోర్ ఎయిర్‌పోర్ట్. అక్కడి నుండి ఇండోర్ యూనివర్సిటీకి వెళ్తే కనిపించే బోర్డు రాణి అహల్యాబాయ్ ఇండోర్ యూనివర్సిటీ. ఇలా ఇండోర్‌లో ఎన్నో సంస్థలకు అప్పటి ఆమె పేరు పెట్టారు. ఇండోర్ అప్పటి పేరు మాళ్వా. –మాళ్వా మహరాణిగా, చిన్న కుగ్రామంగా ఉన్న ఇండోర్‌ను మహానగరంగా అభివృద్ధి చేసిన దార్శనికురాలిగా, పిలాసఫర్ క్వీన్‌గా ఇప్పటికీ ప్రజలచే ఆరాదింపబడుతుంది.

ఆమెది చాలా ఆసక్తిదాయకమైన జీవనచిత్రం. ఆమె రాజవంశానికి చెందిన వనితకాదు. ప్రస్తుత మహారాష్ట్రలోని అహమద్‌నగర్ జిల్లాలోని చోండీ గ్రామంలో 1725లో ఒక సాధారణ కుటుంబంలో జన్మించింది. విశేషమేమిటంటే, సుమారు 300 సంవత్సరాల క్రితం స్త్రీవిద్య ఊహకైనా అందని ఆరోజుల్లోనే ఆమె తండ్రి అహల్యాకు చదువు చెప్పించారు. ఇది ఆమె మనోవికాసానికి ఎంతగానో తోడ్పడింది. అంతేకాదు, ఆమె నాయకత్వ లక్షణాలను ప్రదర్శిస్తూ ఆలోచనలు ప్రవర్తనలో మిగిలిన బాలికలకంటే భిన్నంగా ఉండేది. విధి విచిత్రమైనది. ఒకరోజు తన సైన్యంతో అటుగా వెళ్తున్న మాళ్వ పాలకుడు మల్హర్‌రావు ఆలయ ప్రాంగణంలో విశ్రమించి, ఆలయంతో ఎంతో భక్తిశ్రద్ధలతో పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్న అహల్యాను చూచి ముచ్చటపడి ఆమెను తన కోడలుగా చేసుకోవాలనుకుంటాడు. ఆవిధంగా పది సంవత్సరాల వయసులో స్వగ్రామాన్ని, తల్లిదండ్రులను విడిచి 500 కి.మీ. దూరంలోని మాళ్వారాజ్యానికి యువరాణిగా వెళ్తుంది. సామాన్య కుటుంబం నుండి రాచకుంటుంబానికి పయనమవుతుంది.

భర్త కండేరావు బాధ్యతా రహితుడు. వ్యసనపరుడు. అతనితో మార్పును తీసుకురావడానికి ఆమె ఎంతో ప్రయత్నించింది. రాజ్యవ్యవహారాలపట్ల యువరాజు ఎటువంటి శ్రద్ధాశక్తులు చూపకపోవడం వలన రాజు  మల్‌హర్‌రావు ఆ బాధ్యతలు కోడలు అహల్యకు అప్పగించాడు. అప్పటికే ఆమె ఇద్దరు బిడ్డల తల్లి ఒక కుమారుడు, కుమార్తె, – కుమారుడు మానసిక వికలాంగుడు, ఐనప్పటికి అహల్య మామగారి అభ్యర్థనయే  మేరకు గుర్రపు స్వారీ, కత్తిసాము ఇతర యుద్ధవిద్యలన్నీ నేర్చుకుంటుంది. రాజ్యవ్యవస్థ, పరిపాలనా పద్ధతులు క్షుణ్ణంగా నేర్చుకుంది. రాజు జైత్రయాత్రలకు వెళ్లినపుడు ఆమె స్వయంగా పరిపాలనా వ్యవహారాలు చూసేది. గుర్రంపై రాజ్యమంతా తిరుగుతూ ప్రజల సాదకబాధలు తెలుసుకొని పరిష్కరించేది. అంతే సహనంతో భర్తను కూడా సంస్కరించుకుంది. భర్త కండేరావు కూడా వ్యసనాలనుండి బయటపడి రాజ్యవ్యవహారాలలో శ్రద్ధ చూపడం ప్రారంభించాడు. అటు రాజ్యపాలన, ఇటు కుటుంబ వ్యవహారాలలో సాఫీగా జరిగిపోతున్న తరుణంలో ఒక దురదృష్ట ఘడియలో జాట్ పాలకుడు సూరజ్‌మల్‌తో జరిగిన యుద్ధంలో భర్త కండేరావు చనిపోయాడు. 29 సంవత్సరాల వయసులో వితంతువుగా ఆనాటి సంప్రదాయాన్ననుసరించి సతీసహగమనం (భర్త చితిపై సజీవ దహనం) చేసుకోవాలని నిర్ణయించుకుంది. మామగారు, పిల్లలు, రాజ్యప్రజలు ఆమెను బలవంతంగా ఆపారు. మరో పది సంవత్సరాలకు ఇంకో యుద్ధంలో 1766లో రాజు మల్‌హర్‌రావు చనిపోయాడు. యువరాజు ముందే చనిపోవడం వలన గత్యంతరం లేని పరిస్థితుల్లో అప్పటికి టీనేజ్‌కూడా నిండని, మానసిక వికలాంగుడైన ఆమె కుమారుడు మాలేరావును సింహాసనంపై కూర్చోపెట్టి రాజప్రతినిధిగా అహల్యా బాయ్ మాళ్వాను పాలించింది. ఈ వరుస విషాదాలకు కొనసాగింపుగా కొన్ని నెలలలోపే కుమారుడు మాలేరావు చనిపోయాడు. గత్యంతరం లేని పరిస్థితుల్లో 1767లో ఆమె స్వయంగా సింహాసనాన్ని అదిష్టించి చనిపోయే వరకు అంటే 1795 వరకు మాళ్వా పాలకురాలిగా మాళ్వా ప్రజలకు ఉత్తమ పాలన అందించింది.

రాజ్యంలో బందిపోటు దొంగల బెడద ఎక్కువ. ఈ బందిపోట్లను అణిచివేసిన వ్యక్తికి తనకుమార్తె నిచ్చి పెళ్ళిచేస్తానని ప్రకటించింది. యశ్వంతరావ్ అనే సాధారణ వ్యక్తి ఒక సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని బందిపోటు దొంగలందరిని సంహరించాడు. యశ్వంతరావు రాజుకుటుంబానికి చెందిన వ్యక్తి కానప్పటికి అతనికి కుమార్తెనిచ్చి

పెళ్ళిచేసింది. కుమార్తె అల్లుడుతో రోజులు సంతోషంగా గడిచిపోతున్న తరుణంలో మరో యుద్ధంలో అల్లుడు చనిపోయాడు. అల్లుడు చితిమీద కుమార్తె సతీసహగమనం చేసుకొంది.

అహల్యాబాయ్ జీవితంలో వరుస విషాదాలు మరోసారి చూడండి.

- 10 సంవత్సరాల వయసులో ఊరును, తల్లిదండ్రులను వదిలి బంగారు పంజరంలోకి సుదూర పయణం.
- కుమారుడు మానసిక వికలాంగుడు
- 29 సంవత్సరాల వయసులో భర్త మరణం
- మరో పది సంవత్సరాలకుతండ్రి లాటి మామ మరణం
- కొద్ది నెలలకు కుమారుడు మరణం
- అల్లుడు మరణం
- కుమార్తె సతీసహగమనం

ఇన్ని విషాదాల నడుమ మాళ్వా ప్రజలకు ఉత్తమ పాలన అందించడం మాత్రమే కాక ఒక కుగ్రామమైన ఇండోర్‌ను మహానగరంగా అభివృద్ధి చేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది– **జీవితంలో జరిగే విషాదాలు, కాలం కల్పించే ఓటములు మన బాధ్యతలను విస్మరించే హేతువులు కావద్దు.**

# VII. పీసా టవర్ చెప్పే పాఠాలు

మనందరికి తెలుసు పీసా టవర్ గురించి. ఒక వైపుకు వంగిపోయి ఎప్పుడు పడిపోతుందా అన్నట్లు ఉంటుంది. కానీ గత 850 సంవత్సరాలుగా అలా ఒక వైపుకు ఒరిగి పోయి ఉంది గానీ పడిపోలేదు. **ఇది ఒక నిర్జీవ నిర్మాణం కాదు, సజీవ వ్యక్తి అని భావించుకుంటే ఇది మనకు చెప్పే జీవిత పాఠాలు ఎన్నో! అవి ఏంటో చూద్దాం.**

ఇది ఇటలీలో పీసా అనే నగరంలో ఉంది. ఇది ఒక బెల్ టవర్ (చర్చి గంటల కోసం నిర్మించిన స్తంభం) సుమారు 20 అంతస్థుల భవనం అంత ఎత్తు. దీనిపైన ఒక్కొక్కటి 3000 కిలోల బరువున్న ఏడు గంటలు ఏర్పాటు చేశారు. అంటే ఈ గంటలు స, రి, గ, మ, ప, ద, ని ... లాంటి వేర్వేరు శబ్దాలు చేస్తాయి. సరే దీని కథ ఏంటో తెలుసుకుందాం.

నిర్మాణదశలో ఇది ఒక పక్కకు ఒరిగిపోయింది. కావాలని ఏటవాలుగా కట్టిన నిర్మాణం కాదు. ఈరోజుల్లో ఒక భవనాన్ని నిర్మించాలంటే నేల స్వభావాన్ని పరీక్షిస్తారు. అంటే అది రాతి నేల రేగడి నేల, ఇసుక నేలా? ఎంత బరువు మోయగలదు? ఎంత లోతు పునాదులు తవ్వాలి? మొదలగు వివరాలు సేకరిస్తారు. కానీ, పీసా టవర్ నిర్మాణం 14/8/1173లో ప్రారంభించారు. నేల స్వభావాన్ని తెలుసుకొని నిర్మాణం ప్రారంభించే టెక్నాలజీ అందుబాటులో లేదు. పది అడుగులు పునాదులు తీసి నిర్మాణం మొదలుపెట్టారు. మొదటి రెండంతస్థులు కట్టిన తరువాత ఇది ఆ బరువుకు ఒక వైపు ఒరిగి పోవటం గమనించారు. అలా ఒరిగి, ఒరిగి పడిపోతుందని నిర్ధారించుకున్నారు. నిర్మాణం ఆపేశారు. సుమారు ఒక వంద సంవత్సరాలు దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. కొంచెం కొంచెంగా వరిగి ఒకవైపుకు పడిపోతుందని ఎదురు చూసారు. అది కొంచెం ఒరిగిందిగానీ ఓడిపోలేదు. అంటే కూలిపోలేదు. ఈ వంద సంవత్సరాలో దాని చుట్టూర, దాని మీద ఎన్నో మొక్కలు, చెట్లు, ముళ్ళ తుంపలు పెరిగిపోయి ఉండాలి. కానీ అది **నిరాశపడలేదు. ఓపికగా ఎదురుచూసింది. "పేషెన్స్ పేస్".** వంద సంవత్సరాల తర్వాత పెద్దలు దాన్ని గురించి మరలా ఆలోచించారు. మరో అంతస్తు నిర్మించారు.

ఆ బరువును తట్టుకుంటుందో, కూలి పోతుందో అని ఎదురుచూసారు. మరో అంతస్తును నిర్మించినా అది ఇంకా ఒరగలేదు. అలా ఒక్కొక్క అంతస్తు నిర్మిస్తూ చివరగా బెల్ టవర్ నిర్మించారు. బెల్ టవర్ నిర్మించి కూడా ఇప్పటికి 650 సంవత్సరాలు. ఆధునిక నిర్మాణశాస్త్రాన్ని సవాలుచేస్తూ సగర్వంగా నిలబడి ఉంది. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా కొన్నిలక్షలమంది టూరిస్టులను ఆకర్షిస్తుంది. పీసాటవర్ కంటె ఎత్తైనవి, పురాతనమైనవి ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. కానీ పీసాటవర్ చూడాలని అందరి ఆశ. **జరిగిపోవడం దానికి శాపం కాదు, ఆభరణం. మన జీవితాలలో కూడా మనము ఊహించుకునే లోపాలు, శాపాలు వాస్తవంలో మనకు ఉపయోగపడే ఆభరణాలు, ఆయుధాలు కూడా కావచ్చు. అంతేకాదు ఈ నిర్జీవ నిర్మాణమే తన లోపాన్ని జయించి నిలిచినపుడు మనమెందుకు మన లోపాల్ని జయించలేము.**

ఇంకో ఆశ్చర్యకర విషయం! ఈ పీసా టవర్ నాలుగు పెద్ద భూకంపాలను కూడా తట్టుకొని నిలబడింది. ఈ భూకంపాలకు పెద్ద పెద్ద భవనాలే కూలిపోయినపుడు ఆల్‌రెడీ ఒకవైపుకు ఒరిగిన టవర్ ఎలా తట్టుకుందని ఇంజనీర్లు కారణాలను అన్వేషించారు. వారు నిర్ధారించిన కారణం –ఈ టవర్‌కు ఒకవైపు లూస్ సాయిల్ (మెత్తని మట్టిపొరలు) ఉంది. అందుకనే అది ఆ వైపుకే ఒరిగింది. ఇదే లూస్ సాయిల్ ఒక కుషన్ (స్ప్రింగ్)లాగా పనిచేసి భూకంప తీవ్రతను తట్టుకొని నిలబడటానికి దోహదం చేసింది. అంటే, **అది ఒకవైపు వంగిపోవటానికి కారణమైన మెత్తని మట్టిపొరలే, అది భూకంపాలను తట్టుకునేందుకు కారణమయ్యాయి. దీనినిబట్టి మనకేమర్థవుతుంది. మన జీవితాలలో కూడా కొందరు వ్యక్తులు, కొన్ని సంఘటనలు, కొన్ని పరిస్థితులు మన ప్రగతికి అవరోధాలుగా కనిపించినా ఏమో అవే మనకు అవకాశాలేమో.**

దక్షిణాఫ్రికాలో గాంధీజీ ట్రైన్ నుండి గెంటివేయబడటం అప్పటికి అది అవమానమే, కానీ ఆ సంఘటనే ఆయన ఒక జాతిపితగా ఎదగటానికి అవకాశంగా మారింది. ఔనా!

అబుదాబీలో పీసాటవర్‌ని అనుకరిస్తూ ఒకవైపుకు ఒరిగిపోయిన టవర్‌ని కట్టారు. అంటే **మన లోపాలతో కూడా మనమొక రోల్‌మోడల్ కావచ్చు. మనకున్న డిఫెక్ట్ మనకు గిఫ్ట్‌గా కూడా మార్చుకోవచ్చు. ఒప్పుకుంటారా?**



పిసా టవర్ వద్ద రచయిత

## ఇందులో...

- విజయానికి ఏడు సూత్రాలు
- గెలుపు గాథలు
- విద్యార్థులకు ఏడు సూత్రాలు
- యువతకు ఏడు సూత్రాలు

## ఎవరి కోసం ఈ పుస్తకం....

ఎవరికోసం? జీవితంలో గెలవాలనుకునే ప్రతి యువకుని కోసం - చదువుకుంటున్న ప్రతి విద్యార్థి కోసం - చదువు మధ్యలో ఆపేసిన కుర్రాల్ల కోసం - చదువు పూర్తి చేసుకొని ఉద్యోగవేటలో ఉన్న ఆశావాదుల కోసం - ఏ ఉద్యోగం లభించడం లేదనే నిరాశలో ఉన్న నిరుద్యోగుల కోసం - అమ్మా నాన్నలకు ఆస్తిపాస్తుల్లేని కుటుంబాల్లోని యువకుల కోసం - ఆస్తిని కాక స్వశక్తిని నమ్ముకున్న సుపుత్రుల కోసం - సినిమాలు, షికార్లు, స్నేహితులతో కుషీగా కాలం గడిపేస్తూ కూడా అంతరాంతరాల్లో, జీవితంలో ఏదైనా సాధించాలనే కసి ఉన్న యంగ్‌స్టర్ కోసం - "లవ్" లో గెలిచి జీవితంలో కూడా గెలవాలనుకునే ప్రేమికుల కోసం - లవ్‌లో ఓడి జీవితంలో నైనా గెలవాలనుకునే యువత కోసం - భవిష్యత్తును నిర్మించుకోవాలనుకునే వారి కోసం - జీవితాన్ని పునర్‌నిర్మించుకునే వారి కోసం...... ఒక్క మాటలో చెప్పాలంటే ఇది అక్షర జ్ఞానమున్న ప్రతి యువకుడి కోసం... ప్రతి యువతి కోసం...

ఓటమి, అవమానం, తిరస్కారం ఇవి ఖరీదైన చాక్లెట్‌పైన
గట్టిగా చుట్టిన రేపర్ లాంటివి. ఓపికగా వాటిని ప్రక్కకు తొలగిస్తే లోపల
గెలుపు చాక్లెట్ తీయగా పలుకరిస్తుంది. మనసును పరవశింప చేస్తుంది కూడా..

రూప ప్రచురణలు, హైద్రాబాద్ - 500045